# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 10 ఆగష్టు 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 216 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA





## తైక్వాండోలో గిన్నిస్ రికార్డు



2

## నేటితో ముగియనున్న సర్ గడువు

హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?

17న ముసాయిదా ఓటర్ల జాబితా

2



# వరుణ దేవా కరుణించవా

సకాలంలో వానలు కురిపించి.. తెలంగాణకు సుభిక్షం కలిగిస్తూ.. ప్రజలను ప్రగతి పథంలో నడిపించాలని వాన దేవుడిని కోరుతూ కృష్ణా నది ఒడ్డున నాగార్జున సాగర్‌లో యాదాద్రి వేద పండితులు, 108 మంది రుత్వికుల నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నేడు జరుపుతున్న వరుణ యాగం..పై మనం ప్రత్యేక కథనం...



...వివరాలు 12లో

# జో ఖేలేగా వో ఖిలేగా

## కామన్వెల్త్ విజేతలతో ప్రధాని భేటీ



ఢిల్లీ, ఆగష్టు 9: కామన్వెల్త్ గేమ్స్ 2026లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఆదివారం సీడబ్ల్యూజీ పతక విజేతలతో మోడీ సమావేశమై వారి ప్రదర్శనను ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు వారు చూపిన పట్టుదల, కృషిని కొనియాడారు. దేశంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని క్రీడల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలని.. యువత మరింత మంది క్రీడల వైపు వచ్చేలా వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. జో ఖేలేగా వో ఖిలేగా. భారత్ కు ఎప్పుడూ మద్దతుగా నిలవండి. భారత్ మాతా కీ జై!' అంటూ మోడీ ఇన్స్టాగ్రామ్లో పోస్టు చేశారు. యువత క్రీడల్లో పాల్గొనాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ గతంలోనూ

...మిగతా 2లో

## ఆర్జీకర్ ఘటన.. మరోసారి దర్యాప్తునకు సీఎం ఆదేశం

2

## మరోసారి ఆశల పల్లకిలో

# ఆశావహులు

### క్యాబినెట్ విస్తరణపై ఊపందుకున్న ఊహాగానాలు

- పంద్రాగస్టుకు ముందే జరగొచ్చంటూ ప్రచారం
- సీఎం రేవంత్‌కు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా?
- కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో
- తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో చిగురిస్తున్న ఆశలు



హైదరాబాద్, మనం బ్యూరో: రాష్ట్ర క్యాబినెట్ విస్తరణపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. పంద్రాగస్టుకు ముందే క్యాబినెట్ విస్తరణ జరగొచ్చంటూ తాజాగా ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న క్యాబినెట్ విస్తరణ అంశం చర్చకు వచ్చిందనీ, అధిష్టానం పెద్దలు సైతం ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పార్టీ వర్గాలలో ప్రచారం జరుగుతోంది. తాజాగా పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో కేంద్ర నాయకత్వం మంత్రివర్గ విస్తరణను ముగించడంతో ఇప్పుడు దృష్టి తెలంగాణ పైకి మళ్లింది. అధికారిక ధృవీకరణ రానప్పటికీ

...మిగతా 2లో

## మధ్యాహ్నం సాగర్‌కు సీఎం

పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి

2



## 12న సంపూర్ణ సూర్యగ్రహణం

### మన దేశంలో దీని ప్రభావం తక్కువే

హైదరాబాద్, ఆగష్టు 9: ఈ నెల 12న అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఇదే రోజు ఆషాఢ బహుళ అమావాస్య (చుక్కల అమావాస్య) కూడా కావడం విశేషం. ఈ గ్రహణం భారతదేశంలో కనిపించకపోయినా, ప్రపంచంలోని అనేక దేశాల్లో కనిపిస్తుంది. ఈ ఏడాదిలో సంభవించే తొలి సంపూర్ణ సూర్యగ్రహణం ఇదే కావడం విశేషం. స్పెయిన్, ఐస్లాండ్ దేశాల్లో మాత్రమే సంపూర్ణ సూర్యగ్రహణం

...మిగతా 2లో

## అడవితో అనుబంధం..

## అభివృద్ధిలో అగ్రస్థానం




2

# నామినేటెడ్ పోస్టుల సంగతి తేల్చండి

## కాంగ్రెస్‌పై సీపీఐ, టీజేఎస్ ఒత్తిడి

- ఎన్నికల సమయంలో చెరో ఎమ్మెల్సీ, 5 నామినేటెడ్ పోస్టుల హామీ
- ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలని కూనంనేని డిమాండ్
- ఇదే అంశంపై చర్చించడానికి సీఎం అపాయింట్‌మెంట్ కోరిన కోదండరాం

హైదరాబాద్, మనం బ్యూరో: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నామినేటెడ్ పదవుల సంగతి తేల్చాలని కాంగ్రెస్ పార్టీపై మిత్రపక్ష పార్టీలైన సీపీఐ, టీజేఎస్‌పై ఒత్తిడి తెస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకోవడంతో మరి తమ సంగతి ఏంటని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను ఆ పార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి సీపీఐ, టీజేఎస్ మద్దతు కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలనీ, మిత్రపక్షంగా పోటీ చేయడం ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని నచ్చజెప్పారు. అప్పటి పీసీసీ చీఫ్ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి రెండు పార్టీల కార్యాలయాలకు వెళ్లి ఒప్పించారు. దీంతో అప్పటి వరకు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉన్న సీపీఐ, ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే ఆలోచనను విరమించుకుని

...మిగతా 2లో

## సారూ.. మీరు (రా)వద్దు..

నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన

- ఆయన్ను పిలవొద్దని 450 మంది విద్యార్థులు సంతకాలు
- మా డిమాండ్ ఒప్పుకోకపోతే ఆందోళనలు ఉధృతం చెస్తం.. విద్యార్థుల హెచ్చరిక

2

## మెడికో ప్రియాంక మృతి

### రాజమహేంద్రవరం 'ఘటన'లో గాయపడ్డ వైద్య విద్యార్థిని



హైదరాబాద్, ఆగష్టు 9: రాజమహేంద్రవరం ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతిచెందారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు సికింద్రాబాద్ కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం మధ్యాహ్నం 3.25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్లు వెల్లడించారు. కిమ్స్‌లో ఉన్న ప్రియాంక మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

**ప్రియాంకది ఏక్లాస్ పూర్..**

ప్రియాంక స్వస్థలం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఏక్లాస్ పూర్. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆమె.. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్

...మిగతా 2లో

## పార్లమెంటు ముందుకు

# నేడు కీలక బిల్లులు

ఢిల్లీ, ఆగష్టు 9: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా నేడు పార్లమెంటులో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్ సభలో బిల్లును ప్రవేశపెట్టనున్నారు. వివిధ ట్రిబ్యునళ్ల చైర్ పర్సన్లు, సభ్యుల నియామకాలు, సేవా నిబంధనలలో పారదర్శకత, స్వతంత్రతను పెంచేందుకు ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు చట్టసభల ముందుకు రానుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దీనిని ప్రవేశపెడతారు. గనులు, ఖనిజాల అభివృద్ధి, క్రమబద్ధీకరణ

...మిగతా 2లో

# పెద్ది లేడని బాధ పడొద్దు..పెద్దన్నగా మీకు నేనున్నా

- సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత
- నల్లబెల్లిలో సుదర్శన్ రెడ్డి దశదినకర్మకు హాజరై ఆయన పిల్లలను అక్కున చేర్చుకుని.. అండగా ఉంటానని భరోసా



హైదరాబాద్, మనం ప్రతినిధి: ఇటీవల తీవ్ర అనారోగ్యానికి చికిత్స పొందుతూ, అకాల మరణం చెందిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత,

...మిగతా 2లో



# మక్కా ఒప్పందంలో చేరుతున్న ఈజిప్ట్

### వెల్లడించిన తుర్కియే

కైరో, ఆగష్టు 9: నాటో తరహా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచనతో పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే దేశాలు 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇందులో తాజాగా ఈజిప్ కూడా చేరనున్నట్లు తుర్కియే విదేశాంగ మంత్రి వెల్లడించారు. అన్ని విషయాల్లో తమ భాగస్వామిగా ఉండే ఆ దేశం మక్కా ఒప్పందంలోనూ చేరుతుందని తెలిపారు. అయితే తాము ఏ ఒక్క దేశాన్ని లక్ష్యంగా చేసుకోలేదని.. తమను తాము బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశంతో దీనిపై సంతకం చేశామని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ కూటమి మరింత విస్తరించే అవకాశం ఉందని.. భవిష్యత్తులో మరిన్ని దేశాలు తమతో చేతులు కలుపుతాయని

...మిగతా 2లో

## కిమ్ సేనలకు రష్యాలో

# యుద్ధ శిక్షణ

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ

కీవ్, ఆగష్టు 9: ఉక్రెయిన్ పై యుద్ధానికి మద్దతుగా తమ సైన్యాన్ని రష్యాకు పంపినట్లు ఉత్తర కొరియా ఇప్పటికే వెల్లడించింది. తాజాగా ఆ దేశం నుంచి మాస్కోకు 50వేల మంది సైనికులను పంపడానికి సన్నాహాలు చేస్తున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఆరోపించారు. మొదట్లో వందల సంఖ్యలో యుద్ధంలో పాల్గొన్న కిమ్ సేనలు.. ప్రస్తుతం వేల సంఖ్యలో కనిపిస్తున్నారని అన్నారు. దాడుల్లో పాల్గొంటూనే వారు యుద్ధ తంత్రాలను అధ్యయనం చేస్తున్నారని.. ఇదిలాగే కొనసాగితే

...మిగతా 2లో

# అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాల్సిందే

## హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు కొత్త షరతులు పెట్టిన ఇరాన్



టెహ్రాన్, ఆగష్టు 9: హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ కొత్త షరతులు విధించింది. అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని స్పష్టం చేసింది. ఈ వ్యూహాత్మక ప్రాంతం నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపింది. ఇర్నా యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. తమ ఆస్తులపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయడంతోపాటు, విదేశాల్లో స్తంభింపజేసిన నిధులను బేషరతుగా విడుదల చేయాలని కోరింది. ఇరాన్ నౌకాశ్రయాలపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మహ్మద్ బాగెర్ జోల్ఘాదర్ ఈ వివరాలు వెల్లడించారు. జూన్ లో తాత్కాలిక

...మిగతా 2లో



## తైక్వాండోలో గిన్నిస్ రికార్డు

**హైదరాబాద్, ఆగష్టు 9 :** గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 'తైక్వాండో లెసన్' ప్రదర్శన గిన్నిస్ వరల్ రికార్డులో చోటు దక్కించుకుంది. ఎంజేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 9 ఏళ్ల చిన్నారుల నుంచి 70 ఏళ్ల వద్ధుల వరకు మొత్తం 533 మంది పాల్గొని, 35 నిమిషాల పాటు వివిధ విన్యాసాలు ప్రదర్శించారు. గతంలో 302 మందితో చేసిన ప్రదర్శనను.. తాజాగా అధిగమించారు. గిన్నిస్ వరల్ రికార్డు పరిశీలకుడు స్వప్నిల్ నిర్వాహకులకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

## పార్లమెంటు ముందుకు నేడు కీలక బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

చట్టం-1957కు సవరణలు చేసే బిల్లును కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సమర్పిస్తారు. ఎన్సీడీసీ చట్టం-1962కు సవరణలు చేస్తూ రూపొందించిన ఈ బిల్లును కూడా అమిత్ షా సభలో ప్రవేశపెట్టనున్నారు.

**రాజ్యసభలో చర్చకు రానున్నవి..**

డిజిటల్ బ్యాంకింగ్ విధానాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సాక్ష్యాధారాల చట్టాన్ని ఆధునీకరించే ఈ బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పరిశీలన, ఆమోదం కోసం మూవ్ చేస్తారు. అదే విధంగా పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007, ఇన్కమ్ టాక్స్ యాక్ట్-2025 లలో అవసరమైన సవరణల కోసం ఈ బిల్లును ఎగువసభ పరిశీలించనుంది.

## మెడికో ప్రియాంక మృతి

(మొదటి పేజీ తరువాయి)

వైద్య కళాశాలలో డెర్మటాలజీ విభాగంలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్ లో స్థిరపడ్డారు. ప్రియాంక ఈ నెల 3న రాత్రి రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్య మాల్లో సినిమా చూసి, సహచర విద్యార్థి ఉమేష్ తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రద్దీ కారణంగా వాహనాలు థియేటర్ గేటు వద్ద ఆగగా.. అదే సమయంలో నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆండ్రూ విలియం జోసెఫ్ మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ వచ్చి వీరి బైకును ఢీకొట్టారు. తరువాత మరో రెండుసార్లు బలంగా ఢీకొట్టి.. పైనుంచి కారు నడపడంతో కిందపడిపోయిన ప్రియాంక తలకు తీవ్ర గాయమైంది. ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం సికింద్రాబాద్ లోనికిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు.

## మక్కా ఒప్పందంలో చేరుతున్న ఈజిప్ట్

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి స్థిరత్వాన్ని తీసుకురావడంలో ఇది కీలక ముందడుగు అని తుర్కియే విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. నాటో తరహా రక్షణ ఒప్పందం చేసుకోవాలన్నది ఇప్పటి ఆలోచన కాదు. 'అరబ్ వసంతం' తర్వాత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా 34 ముస్లిం దేశాలు ఒక్కటవ్వాలని సౌదీ అరేబియా పిలుపునిచ్చింది. 2015లో మరోసారి ఈ తరహా ప్రతిపాదనను ఈజిప్ట్ చేసినా.. సార్వభౌమాధికారం, ఇతరత్రా కారణాలతో ముందుకు సాగలేదు. ప్రస్తుతం గల్ఫ్ దేశాలపై దాడులు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఒప్పందం తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా మూడింటిపై జరిగిన దాడిగానే పరిగణిస్తాయి. ఉమ్మడి సైనిక విన్యాసాలు, రక్షణ దళాలకు ప్రత్యేక శిక్షణ, సాంకేతిక బదిలీ, నిఘా సమాచారం మార్పిడికి ఒప్పందం మార్గం సుగమం చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# నామినేటెడ్ పోస్టుల సంగతి తేల్చండి

(మొదటి పేజీ తరువాయి)

టీజేఎస్ కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీపీఐ, టీజేఎస్ పార్టీలకు చెరో ఎమ్మెల్సీతో పాటు 5 రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులు, 5 జిల్లా స్థాయి పదవులు మొత్తం పది నామినేటెడ్ పదవులు ఇచ్చే విధంగా ఇరు పార్టీల నేతలను ఒప్పించారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీని చేశారు. అలాగే, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఆయనతో పాటు పార్టీ సీనియర్ నేత ప్రొ.పీఎల్ విశ్వేశ్వరరావుకు విద్యా కమిషన్ సభ్యునిగా అవకాశం ఇచ్చారు. తాజాగా, కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. సీనియర్లతో పాటు జూనియర్ నేతలు సైతం కార్పొరేషన్, జిల్లా స్థాయి పదవులను ఆశిస్తున్నారు. ఇటీవలే 37 కార్పొరేషన్ ఛైర్మన్ల పదవీ కాలం సైతం ముగిసింది. అయినప్పటికీ ఆ పోస్టుల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు. దీంతో తమకు అవకాశం దక్కుతుందని ఇప్పటి వరకు పదవులు రాని నేతలు ఆశలు పెట్టుకున్నారు. పలు దఫాలుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై సమావేశాలు నిర్వహించినప్పటికీ కొన్ని పోస్టుల విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. దీంతో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తున్నది. ఇదిలా ఉండగా, తమకు నామినేటెడ్ పోస్టుల విషయంపై తాజాగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ మాతో పెట్టుకుని భూస్థాపితమైంది, మీరు కూడా అదే బాటలో వెళితే మీకు కూడా అదే పరిస్థితి తప్పదనీ, మిమ్మల్ని ఎవరూ కాపాడలేరంటూ ఘాటు హెచ్చరికలు చేశారు. ఇక టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం నామినేటెడ్ పోస్టుల అంశంపై చర్చించడానికి సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కోరి పదిహేను రోజులు అయినప్పటికీ సీఎంవో నుంచి ఇంకా కబురు రాలేదు. దీంతో నామినేటెడ్ పోస్టులపై గంపెడాశలు పెట్టుకున్న ఆ పార్టీ నేతలు కోదండరాంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. నామినేటెడ్ పదవులు రానిపక్షంలో ఇక పార్టీలో ఉండి లాభం లేదని తమ దారి తాము చూసుకోవాలనే ఆలోచనలో కొందరు సీనియర్ నేతలు భావిస్తున్నట్లు తెలిసింది.

## అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందంలో హర్మూజ్ జలసంధి విషయంలో కొన్ని అంశాలపై అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. ఆంక్షల సడలింపు, స్తంభించిన ఆస్తుల విడుదల వంటి అంశాలను తుది ఒప్పందంలో చేర్చాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు ఇరాన్ వైఖరి మారింది. జలసంధిని తెరవాలంటే ఆంక్షల ఎత్తివేత, స్తంభించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతోంది. అమెరికా మాత్రం జలసంధిపై ముందుగా ఒప్పందం కుదరాలని భావిస్తోంది. ఆ తర్వాతే దిగ్బంధనాన్ని ముగించే అంశాన్ని పరిశీలించాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తాజా డిమాండ్లపై అమెరికా ఇంకా స్పందించలేదు. ఒమన్తో తాము జరుపుతున్న చర్చలు కేవలం నౌకల రాకపోకల సాంకేతిక మార్గాల కోసమేనని.. అమెరికా తమ షరతులు అంగీకరించే వరకు జలసంధి తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది.

## ఆర్జీకర్ ఘటన.. మరోసారి దర్యాప్తునకు సీఎం ఆదేశం

**కోల్కతా, ఆగష్టు 9:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీకర్ హత్యాచార కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై మరోసారి దర్యాప్తునకు ఆదేశించినట్లు బెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రకటించారు. మృతురాలి తల్లి, ప్రస్తుత భాజపా ఎమ్మెల్యే రత్న దేబ్నాథ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో పోలీసులు తమ విధి నిర్వహణలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

ఈ కేసులో కొత్తగా దర్యాప్తు జరపాలని కోరుతూ రత్న దేబ్నాథ్ నాకు లేఖ రాశారు. ఈ క్రమంలోనే సీఎస్తోపాటు నిపుణుల బృందంతో విస్తృత చర్చల అనంతరం.. మరోసారి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశాను'' అని సీఎం సువేందు పేర్కొన్నారు. అదేవిధంగా బాధితురాలి అంత్యక్రియల నిర్వహణలో జరిగిన లోపాలపై కూడా ప్రత్యేక దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు, ఈ ఘటనకు నేటితో రెండేళ్లు పూర్తి కాగా.. బాధితురాలికి నివాళిగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

## కిమ్ సేనలకు రష్యాలో యుద్ధ శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

ఇతర ఆసియా దేశాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. వారు రష్యా ఆధ్వర్యంలో ఆధునిక యుద్ధంలో శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు.

యుద్ధంలో అనుభవాన్ని పెంచుకున్న అనంతరం.. రష్యా నుంచి లైసెన్సులు పొంది..వారి నుంచి అన్ని రకాల సైనిక పరికరాలను పొందడానికి కిమ్ వ్యూహరచన చేసినట్లు ఆరోపించారు. తమ దేశంపై రష్యా చేసిన దాడుల్లో ఉత్తర కొరియా తయారు చేసిన క్షిపణులు వాడినట్లు తమ సైన్యం కనుగొందని తెలిపారు. ఈ నేపథ్యంలో రష్యాను ఎదుర్కోవడానికి తమకు సహకరించాలని జెలెన్స్కీ దక్షిణ కొరియాను కోరారు. గగనతల రక్షణ వ్యవస్థల విషయంలో దేశం కొరతను ఎదుర్కొంటోందని.. ఆయా రంగాల్లో ఆ దేశం నుంచి మద్దతు పొందాలని భవిస్తున్నట్లు వెల్లడించారు.

యుద్ధంలో ఉక్రెయిన్ కు అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు జెలెన్ స్కీ దౌత్యపరమైన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సెర్బియా పర్యటనకు వెళ్లారు. ఆ దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ వుచిచ్తో భేటీ అనంతరం మాట్లాడుతూ.. యూరోపియన్ యూనియన్లో చేరాలనే ఉమ్మడి లక్ష్యం కోసం ఇరు దేశాలు కలిసి పని చేస్తాయన్నారు. ఉక్రెయిన్ కు మానవతా సహాయం, మౌలిక సదుపాయాలు, ఇంధన రంగానికి సంబంధించిన పరికరాలను అందించడానికి సెర్బియా ప్రభుత్వం అంగీకరించింది.

# మరోసారి ఆశల పల్లకిలో.. ఆశావహులు

(మొదటి పేజీ తరువాయి)

పాలనను క్రమబద్ధీకరించడానికి రెండు ఖాళీ పదవులను భర్తీ చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న పోర్ట్ఫోలియోలను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉంది. ఈ రేసులో ప్రధాన పోటీదారుగా ఉన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పలుమార్లు మంత్రివర్గంలో చేరాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. అలాగే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న మల్రెడ్డి రంగారెడ్డి కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఆ జిల్లా నుంచి ప్రాంతీయ సమతుల్యత లేకపోవడంతో మల్రెడ్డి రంగారెడ్డి లేదంటే రామ్మోహన్ రెడ్డికి మంత్రి పదవులు దక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకవేళ క్యాబినెట్ విస్తరణ జరిగితే కుల, సామాజిక సమీకరణలకు కూడా కాంగ్రెస్ అధిష్టానం ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా ఎస్టీ సామాజికవర్గం నుంచి బాలు నాయక్ రామచంద్రు నాయక్ ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. అంతర్గత తిరుగుబాటును నివారించడానికి హైకమాండ్ ప్రస్తుత మంత్రులలో ఎవరినీ తొలగించే అవకాశం లేదని టాక్. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో ఎవరినైనా మంత్రిని మార్చిన పక్షంలో తిరిగి అదే సామాజికవర్గం నుంచి భర్తీ చేయనున్నారు. మంత్రివర్గంలో చోటు కోసం హైదరాబాద్, ఢిల్లీ స్థాయిలో ఆశావహులు తీవ్ర స్థాయిలో లాబీయింగ్ చేస్తున్న నేపథ్యంలో పంద్రాగస్టులోపే సానుకూల ప్రకటన వెలువడే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాల భోగట్టా.

# నేటితో ముగియనున్న సర్ గడువు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ నేటి(సోమవారం)తో ముగియనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ చేశారు. డిజిటలైజేషన్లో హైదరాబాద్ 58.58 శాతంతో చివరి స్థానంలో ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి 63.82 శాతం, రంగారెడ్డి 64.91 శాతం నమోదయ్యాయి. అత్యధిక డిజిటలైజేషన్లో యాదాద్రి భువనగిరి 94.30 శాతంతో తొలి స్థానంలో ఉంది. మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశారు. కుమురం భీమ్ ఆసిఫాబాద్లో 89.45 శాతం, జగిత్యాలలో 89.60 శాతం పూర్తి అయింది. రెండుసార్లు గడువు పొడిగించిన హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పెరగలేదు.

**రాజధానిలో భారీ మార్పులు..**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నేటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్న, మొన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్నగర్లో సగానికి పైగా ఓట్లు రద్దు..**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్లో 44.21%, ఎల్బీనగర్లో 42.19%, ఉప్పల్లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

# జో ఖేలేగా వో ఖిలేగా



(మొదటి పేజీ తరువాయి)

ఆయన 'జో ఖేలేగా వో ఖిలేగా' నినాదాన్ని పలుమార్లు ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ప్రధానితో సమావేశమైన బాక్సింగ్ స్వర్ణ పతక విజేత సాక్షి చౌదరి ఈ భేటీపై ఆనందం వ్యక్తం చేశారు. 'కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతలందరినీ ప్రధానమంత్రి ఆహ్వానించారు. ఆయనను కలవడం ఎంతో గర్వంగా, సంతోషంగా అనిపించింది. ప్రధానమంత్రి చాలా సౌమ్యంగా ఉంటారు. ఆయనతో మాట్లాడటం అద్భుతమైన అనుభవం' అని సాక్షి తెలిపింది.

**బాక్సింగ్లో రికార్డు మెడల్స్..**

గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్లో భారత పతకాల వేటలో బాక్సింగ్ కీలక పాత్ర పోషించింది. భారత బాక్సర్లు మొత్తం 10 పతకాలు సాధించగా.. అందులో ఏడు స్వర్ణాలు ఉన్నాయి. కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో భారత బాక్సింగ్కు ఇదే అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది.జ ముఖ్యంగా భారత మహిళా బాక్సర్లు అదరగొట్టారు. ఏడు స్వర్ణాల్లో ఐదు మహిళల ఖాతాలోనే చేరాయి.

# పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, ఆగష్టు 9 :** రాష్ట్రవ్యాప్తంగా రాబోయే 24 గంటల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేస్తూ హెచ్చరికలు జారీ చేసింది. రాజధాని హైదరాబాద్ తో పాటు కామారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే ములుగు, నల్గొండ, నారాయణపేట, సంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు స్పష్టం చేశారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈదురుగాలులు, ఉరుముల తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా వాహనదారులు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. రైతులు కూడా తమ పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# 12న సంపూర్ణ సూర్యగ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యక్షమవుతుంది. కాగా, ప్రపంచంలోని 55 దేశాల్లో పాక్షిక సూర్యగ్రహణం మాత్రమే గోచరిస్తుంది.

ఈ సంపూర్ణ సూర్య గ్రహణంలో చంద్రుడు సూర్యబింబాన్ని పూర్తిగా కప్పివేయడంతో, కొన్ని ప్రాంతాల్లో సుమారు రెండు నిమిషాలకు పైగా సంపూర్ణ చీకటి ఏర్పడుతుంది. అదే సమయంలో సాధారణంగా కనిపించని సూర్యుని బాహ్య వాతావరణమైన 'కరోనా' స్పష్టంగా దర్శనమిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఖగోళ శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహిస్తారు. ఐరోపాలోని కొన్ని ప్రాంతాల్లో పాక్షిక గ్రహణం కొనసాగుతుండగానే సూర్యాస్తమయం జరుగుతుంది. దీనిని 'గ్రస్తాస్తమయ గ్రహణం' అని పిలుస్తారు.

**భారతదేశంలో ప్రభావం ఉందా?**

ఈ గ్రహణం భారతదేశంలో ఎక్కడా కనిపించదు. అందువల్ల భారతదేశ ప్రజలకు ప్రత్యక్ష గ్రహణ దర్శనం ఉండదు. ధర్మశాస్త్రాలలో ప్రధానంగా దృశ్యగ్రహణమే ఆచారానికి ప్రమాణం. అందువల్ల భారతదేశంలో కనిపించని ఈ గ్రహణానికి సాధారణంగా సూతకం, దేవాలయాల మూసివేత, ఆహార నియమాలు, ప్రత్యేక శాంతులు వంటి ఆచారాలు అవసరం లేదని అనేక పంచాంగ కర్తలు, పండితులు చెబుతున్నారు.

# సారూ.. మీరు (రా)వద్దు..

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** అత్యంత ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, 'వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు,' 'మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి' వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు.

తమ డిమాండ్కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్లో ఒక సంప్రదాయంగా వస్తోంది.

కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# పెద్ది లేడని బాధ పడొద్దు..పెద్దన్నగా మీకు నేనున్నా

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. ఎర్రవెల్లి నివాసం నుంచి, ఆదివారం నల్లబెల్లికి బయలుదేరిన గులాబీ బాస్ పెద్ది స్వగ్రామానికి చేరుకొన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి అమర్ రహే.. జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి.. అంటూ సాగిన కార్యకర్తల నినాదాలు నడుమ, పెద్ది చిత్రపటానికి కేసీఆర్ శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్న., పిల్లలు, తల్లి అమృతమ్మను కేసీఆర్ ఓదార్చారు. పెద్ది అన్నాదమ్ములను కుటుంబ సభ్యులను పలకరించి కేసీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి కుటుంబ పెద్దగా ధైర్యం చెప్పారు. ఆందోళన చెందవద్దని పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను పలకరించి కేసీఆర్ వారిని ఓదార్చారు. తల్లికి ధైర్య వచనాలు చెప్పారు. భార్య స్వప్నకు గుండె ధైర్యం నింపారు. పిల్లలను బాగా చదువుకోవాలని ఆశీర్వదించారు. వారికి తండ్రి లేని లోటు లేకుండా చూసుకోవాలనీ,పిల్లలను కాపాడుకోవాలనీ పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నలకు కేసీఆర్ సూచించారు. కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు. దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరామర్శించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లిలో నిర్వహించిన పెద్ది దశదిన కార్యక్రమానికి హాజరైన కేసీఆర్.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన కేసీఆర్.. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎప్పుడు చిరునవ్వులు చిందిస్తూ కల్మషం లేని హృదయంతో స్వచ్ఛంగా మాట్లాడే పెద్ది ఇక లేడనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక, బాధతో ఉన్న కేసీఆర్తో సహా పార్టీ ముఖ్యులు కుటుంబ సభ్యులు ఆవేదనలో మునిగి ఉండగా, అక్కడి వాతావరణం గంభీరంగా మారింది. బీఆర్ఎస్ తరపున పెద్ది కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును అందించారు. ఇందులో పెద్ది ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఇవ్వగా, తల్లి అమృతమ్మ బాగోగులు, సంక్షేమం కోసం మరో రూ.25 లక్షల చెక్కును కేసీఆర్ తన చేతులతో వారికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారితో మాట్లాడుతూ... ఈ కుటుంబం ఎలాంటి కష్ట సమయంలోనైన పార్టీ అండగా ఉంటుందని.. ఎప్పుడు అవసరమొచ్చినా బీఆర్ఎస్ పార్టీ సహకరిస్తుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పిల్లల భవిష్యత్తు, చదువులు, కుటుంబ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**పెద్ది యాదిలో... కేసీఆర్ కంట కన్నీరు...**

ఈ సందర్భంగా కేసీఆర్ కాసేపు విషణ్ణ వదనంతో మునిగిపోయారు. పార్టీ స్థాపించిన నాటి నుండి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకు పోవడంలో పార్టీ నిర్మాణంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పాత్రను మనకు అనుచరుడుగా ఆత్మీయుడుగా పెద్దితో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ బాధతప్త హృదయంతో ఆయన్ను స్మరించుకున్నారు. ఎప్పుడు చిరునవ్వులు చిందిస్తూ కల్మషం లేని హృదయంతో స్వచ్ఛంగా మాట్లాడే పెద్ది ఇక లేడనే వాస్తవాన్ని జీర్ణించుకోలేక, బాధతో ఉన్న కేసీఆర్తో సహా పార్టీ ముఖ్యులు కుటుంబ సభ్యులు ఆవేదనలో మునిగి ఉండగా, అక్కడి వాతావరణం గంభీరంగా మారింది. దీంతో పెద్ది యాదిలో... కేసీఆర్ కంట కన్నీరు రాల్చారు. పెద్ది పిల్లలను అక్కున చేర్చుకుని దుఃఖ పడ్డారు.

# అడవితో అనుబంధం.. అభివృద్ధిలో అగ్రస్థానం

**గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**హైదరాబాద్, ఆగష్టు 9:** అడవితో అనుబంధాన్ని, తమ మూలాలను కాపాడుకుంటూనే గిరిజన సమాజం అభివృద్ధిలో అగ్రస్థానానికి చేరుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు ఆకాంక్షించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు వారి భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గిరిజన బిడ్డలు దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్లోని బంజారా భవన్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**గిరిజన సంక్షేమానికి రూ.18,745.16 కోట్లు**

2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులను గిరిజన ప్రాంతాల్లో విద్య, మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్యుత్, సాగు-భూమి అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి తదితర రంగాలకు వినియోగిస్తున్నామని చెప్పారు.

ఒక గిరిజన గ్రామానికి రోడ్డు రావాలి.. ఒక ఇంటికి మంచినీరు అందాలి.. ఒక విద్యార్థికి మంచి విద్య లభించాలి.. ఒక యువకుడికి నైపుణ్యం రావాలి.. ఒక మహిళకు ఆదాయం సమకూరాలి.. ఒక రైతు భూమిలో పంట పండాలి. అప్పుడే బడ్జెట్కు నిజమైన అర్థం ఉంటుంది అని మంత్రి పేర్కొన్నారు.

**ఏజెన్సీ ప్రాంతాల్లో దూరం అనే మాట ఉండకూడదు**

గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

విద్య, వైద్యం ప్రతి గిరిజన కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి అంటే నగరాల్లో పెద్ద భవనాలు నిర్మించడం మాత్రమే కాదని.. మారుమూల గిరిజన తండాలో ఒక కుటుంబం జీవితం సులభతరం చేయడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు.

**భూమికి నీరు.. రైతుకు పంట.. కుటుంబానికి ఆదాయం**

ఇందిరా గిరి జల వికాసం ద్వారా గిరిజన రైతుల భూములకు నీటి వసతి కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌరశక్తి, సోలార్ పంపుల వినియోగాన్ని పెంచడంతో పాటు తోటలు, ప్రత్యామ్నాయ పంటలు, భూమి ఉత్పాదకత పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అడవి.. ఆదివాసీకి తల్లి లాంటిది**

ఆదివాసీకి అడవి కేవలం ప్రకృతి సంపద కాదని.. అది జీవనాధారం, సంస్కృతికి మూలం, భవిష్యత్తుకు భరోసా అని మంత్రి అన్నారు. అడవి అన్నం, ఔషధం, ఉపాధి, నీడ అందించిందని తెలిపారు. ఆదివాసీ-అడవి బంధం చెట్టు-మనిషి సంబంధం కాదు.. తల్లి-బిడ్డ అనుబంధం అని పేర్కొన్నారు. అడవిని కాపాడుకుంటూనే అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

గిరిజన గురుకులాల్లోని 166 విద్యాసంస్థల్లో 83 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని మంత్రి తెలిపారు. 2025-26లో పదో తరగతిలో 98 శాతానికి పైగా, ఇంటర్మీడియట్లో 86 శాతానికి పైగా, డిగ్రీలో 89 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

# దేశం బాగుండాలి తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

**అమ్మవారిని కేటీఆర్ దర్శించుకున్న కేటీఆర్**

**భాగ్యనగర మహిళలకు బోనాల పండుగ శుభాకాంక్షలు: కేటీఆర్**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని సింహ వాహిని అమ్మవారిని కోరుకున్నానని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. దేశం కూడా బాగుండాలని అమ్మవారిని కోరుకున్నానని చెప్పారు. ఆదివారం బోనాలు సందర్భంగా లాల్ దర్వాజాలోని అమ్మవారిని మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌తో కలిసి కేటీఆర్ దర్శించుకున్నారు.

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. సింహ వాహిని అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. భాగ్యనగర మహిళలకు ఈ సందర్భంగా ఆయన బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మీరాలం మండిలోని శ్రీమహంకాళి అమ్మవారిని కూడా కేటీఆర్ దర్శించుకున్నారు.

**బోనాలు గౌరవం.. కేసీఆర్‌కే దక్కింది : తలసాని**

ప్రపంచవ్యాప్తంగా బోనాల పండుగ ప్రసిద్ధి చెందిందని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. 50 ఏళ్ల నుంచి బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని డిమాండ్ ఉన్నా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే కేసీఆర్, బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తు చేశారు. దేవాలయాలకు నిధులు ఇవ్వడం కూడా కేసీఆర్ హయాంలోనే ప్రారంభమైందని అన్నారు. కేసీఆర్‌కే ఆ గౌరవం దక్కిందని తెలిపారు. అమ్మవారి దయవల్ల అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నానని చెప్పారు. వర్షాలు బాగా కురవాలని, అందరూ కలిసి మంచిగా ఉండాలని ఆ అమ్మవారిని ప్రార్థించినట్లు తలసాని శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి షాక్

# చెక్ బౌన్స్ కేసులో నాన్-బెయిలబుల్ వారెంట్

**రూ. 34 లక్షల చెక్ బౌన్స్ కేసులో దోషిగా నిర్ధారించిన హైదరాబాద్ కోర్టు**

**తీర్పు సమయంలో కోర్టుకు హాజరుకానందున వారెంట్ జారీ**

**పోలీసులు అరెస్టు చేసి హాజరుపరిచిన తర్వాత శిక్ష ఖరారు**

**2014 నాటి కేసులో తాజాగా వెలువడిన తీర్పు**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి బిగ్ షాక్ తగిలింది. చెక్ బౌన్స్ కేసులో పైలట్ రోహిత్ రెడ్డికి హైదరాబాద్ కోర్టులో చుక్కెదురైంది. దాదాపు దశాబ్ద కాలం నాటి చెక్ బౌన్స్ కేసులో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ, న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు సంబంధించిన రూ. 34.23 లక్షల చెక్ బౌన్స్ కేసులో ఈ తీర్పు వెలువడింది. 2015లో రోహిత్ రెడ్డి ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న సమయంలో, సంస్థ వనరులను తన వ్యక్తిగత వ్యాపారాలకు వినియోగించి నష్టం కలిగించారనే ఆరోపణలు వచ్చాయి. కంపెనీ యాజమాన్యానికి ఈ వ్యవహారం తెలిసిన తర్వాత రోహిత్ రెడ్డిని ప్రశ్నించారని.. ఆ తర్వాత అడ్వైజరీ ఫీజు మొత్తాన్ని చెల్లించేందుకు ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా ఆయన అంగీకరించినట్లు కోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో రోహిత్ రెడ్డి సదరు సంస్థకు చెక్కును అందజేశారు. ఈ నేపథ్యంలోనే 2014 ఫిబ్రవరి 7వ తేదీన సంస్థ డైరెక్టర్ పదవికి పైలట్ రోహిత్ రెడ్డి రాజీనామా చేసినట్లు వెల్లడించింది.

అయితే, ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ 2014 అక్టోబర్, డిసెంబర్ మధ్య మూడుసార్లు బౌన్స్ అయింది. దీనిపై సంస్థ పంపిన లీగల్ నోటీసులకు రోహిత్ రెడ్డి స్పందించకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన హైదరాబాద్ మొదటి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (మున్సిపల్ కోర్టు), నెగోషియబుల్ ఇనిస్టేమెంట్స్ యాక్ట్ సెక్షన్ 138 కింద రోహిత్ రెడ్డిని దోషిగా నిర్ధారించింది. తీర్పు వెలువడే సమయంలో రోహిత్ రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం శిక్షాకాలాన్ని ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత బకాయి మొత్తాన్ని చెల్లించాలని కోరుతూ పంపించిన న్యాయపరమైన నోటీసును స్వీకరించేందుకు రోహిత్ రెడ్డి నిరాకరించినట్లు ఫిర్యాదుదారు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 2015లో క్రిమినల్ కేసు దాఖలైంది. విచారణ సమయంలో రోహిత్ రెడ్డి తరఫు న్యాయవాదులు కొన్ని కీలక పత్రాల చెల్లుబాటును ప్రశ్నించారు. ముఖ్యంగా ప్రామిసరీ నోట్ సాక్షుల సంతకాలు లేవని.. అలాగే కంపెనీ ప్రతినిధులు ఖాళీ ప్రామిసరీ నోట్, చెక్కులపై రోహిత్ రెడ్డి సంతకాలు తీసుకున్నారని వాదించారు. అయితే ఈ వాదనలను కోర్టు అంగీకరించలేదు. కీలక పత్రాలపై ఉన్న తన సంతకాలను రోహిత్ రెడ్డి తిరస్కరించలేదని న్యాయస్థానం పేర్కొంది. అలాగే చెక్ హోల్డర్కు అనుకూలంగా నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్‌లోని సెక్షన్లు 118, 139 కల్పించే చట్టబద్ధమైన అనుమానాన్ని ఆయన సమర్థవంతంగా ఖండించలేకపోయారని కోర్టు అభిప్రాయపడింది. దీంతో ఖాతాలో తగినంత నిధులు లేక చెక్ తిరస్కరణకు గురైన కేసుల్లో వర్తించే నెగోషియబుల్ ఇనిస్టూమెంట్ యాక్ట్ సెక్షన్ 138 కింద రోహిత్ రెడ్డిని దోషిగా కోర్టు నిర్ధారించింది. తీర్పు వెలువరించే సమయంలో రోహిత్ రెడ్డి కోర్టుకు హాజరు కాలేదు. దీంతో న్యాయస్థానం ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దోషిగా నిర్ధారించిన తర్వాత శిక్షపై వాదనలు వినాల్సి ఉండటంతో.. నిందితుడిని కోర్టులో హాజరుపరిచిన తర్వాతే శిక్షను ప్రకటిస్తామని జడ్జి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఈ కేసులో ప్రస్తుతానికి కోర్టు పైలట్ రోహిత్ రెడ్డిని దోషిగా నిర్ధారించినప్పటికీ.. తుది శిక్ష ఎంత అన్నది ఆయన కోర్టులో హాజరైన తర్వాత జరిగే తదుపరి ప్రక్రియలో నిర్ణయించాల్సి ఉంది.

# చేనేత చేయూత..

**చీరల అర్డర్‌తో నేతన్నకు బాసట**

**ఈసారి కొత్త డిజైన్ చీరలతో రాజన్న సిరిసిల్ల నేతన్నలకు భారీ ఆర్డరు**

**తెలంగాణ మహిళలకు ఈ ఏడాది కూడా ఉచితంగా చీరలు**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలో మహిళా సంఘాలకు పంపిణీ చేయనున్న చీరల ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. మే నెలలో 4.62 కోట్ల మీటర్లకు ఆర్డర్లు ఇవ్వగా.. ఇప్పటికే 1.74 కోట్ల మీటర్ల ఉత్పత్తి పూర్తయింది. ఈసారి నీలం స్థానంలో చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం రూ.450 కోట్లు కేటాయించగా.. రూ.142 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. సెప్టెంబరు 20లోగా ఉత్పత్తి పూర్తి చేసి అక్టోబరులో పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏకరూప దుస్తుల మిగిలిన వస్త్రాన్ని కూడా టెస్కో సేకరిస్తోంది.

తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది మహిళా సంఘాలకు పంపిణీ చేయనున్న చీరల కోసం ప్రభుత్వం రూ.450 కోట్లను కేటాయించింది. గతంలో నీలం రంగు చీరలను పంపిణీ చేయగా.. ఈ ఏడాది చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. చీరల ఉత్పత్తి ద్వారా రాజన్న సిరిసిల్ల పవర్లూమ్, మ్యాక్స్ సంఘాలకు పని లభించడంతో నేతన్నల్లో ఆశలు పెరిగాయి.ఇందులో ఇటీవల రూ.142 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసింది. టెస్కోకు నిధులు మంజూరైన వెంటనే చీరల ఉత్పత్తి చేస్తున్న మ్యాక్స్ సంఘాలకు చెల్లింపులు జరగనున్నాయి. దీంతో ఉత్పత్తి ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది. తొలుత 133 మ్యాక్స్ సంఘాలకు చీరల ఉత్పత్తి ఆర్డర్లు కేటాయించారు. వీటిలో 80 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని పూర్తి చేసిన 61 సంఘాలను గుర్తించి ఇటీవల రెండో విడతగా మరో 1.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు.ఉత్పత్తి పూర్తయిన వస్త్రాన్ని టెస్కో సేకరిస్తోంది. ఒక్కో చీరకు జాకెట్ వస్త్రంతో కలిపి 6.6 మీటర్ల మేర తయారు చేస్తున్నారు. ఒక్కో చీర ఉత్పత్తికి సుమారు రూ.238 ఖర్చవుతోంది. దీనికి అదనంగా ప్రాసెసింగ్, ప్రింటింగ్, రవాణా తదితర ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది. మొత్తం చీరల ఉత్పత్తి లక్ష్యాన్ని సెప్టెంబరు 20లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. అక్టోబరులో మహిళా సంఘాలకు చీరలను పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. దీంతో గడువులోగా ఉత్పత్తి పూర్తి చేసేందుకు మ్యాక్స్ సంఘాలు పనులను వేగవంతం చేస్తున్నాయి.

మరోవైపు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏకరూప దుస్తుల వస్త్రం విషయంలో నెలకొన్న సమస్యకు కూడా పరిష్కారం లభిస్తోంది. ఫిబ్రవరిలో జిల్లా పరిశ్రమకు 63 లక్షల మీటర్ల వస్త్ర ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు. ఉత్పత్తి ప్రారంభమైన రెండు నెలలకే ఏప్రిల్లో ఉత్పత్తిని నిలిపివేయాలని ప్రభుత్వం టెస్కోకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాలుగు నెలలుగా నేతన్నలు అయోమయంలో ఉన్నారు. తాజాగా ఇప్పటికే తయారైన వస్త్రాన్ని సేకరించే ప్రక్రియ ప్రారంభమైంది. 2023 నవంబరులోనూ జిల్లా పరిశ్రమ నుంచి దాదాపు రూ.100 కోట్ల విలువైన వస్త్రాన్ని సేకరించినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో రూ.42 కోట్ల విలువైన వస్త్రానికి లెక్కలు పూర్తయ్యాయి. మరో రూ.50 కోట్ల వరకు విలువైన వస్త్రం ఇంకా పరిశీలించి లెక్కించాల్సి ఉందని అంచనా. ఈ మొత్తాన్ని కూడా త్వరగా విడుదల చేసి ఉత్పత్తిదారులకు చెల్లింపులు చేయాలని నేతన్నలు కోరుతున్నారు. తాజా చీరల ఆర్డర్లు, పెండింగ్ వస్త్రం సేకరణతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

# భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తం

**హిందూ సమాజమంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భయం : బండి సంజయ్**

**చార్మినార్ సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న బండి సంజయ్**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** హైదరాబాద్ పాతబస్తీలో లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఆషాఢ మాస బోనాల సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన బండి సంజయ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామని బండి సంజయ్ కీలక ప్రకటన చేశారు. బోనాల నిర్వహణకు ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన బండి సంజయ్.. 2029లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాము వస్తే.. పాతబస్తీలో బోనాల ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడంతో పాటు.. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు భారీగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే 2029లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం.. ఉత్సవాల నిర్వహణకు తగిన స్థాయిలో నిధులు కేటాయించడం లేదని బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. లాల్దర్వాజా బోనాలకు ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోవని పేర్కొన్నారు. ఇతర పండుగలకు కేటాయించే నిధులతో పోలిస్తే బోనాలకు తక్కువ ప్రాధాన్యం ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు కాలేదని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు హిందూ సమాజం, ఆలయాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. అయితే ఇవన్నీ తన రాజకీయ విమర్శలేనని.. హిందూ సమాజానికి సంబంధించిన అంశాలపై మాట్లాడటం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు యువత ముందుకు రావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ.. హిందూ సమాజమంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భయమని అన్నారు. ఆ రెండు పార్టీలు మైనారిటీ సంతుష్టీకరణ విధానాలను అవలంబిస్తున్నాయని పేర్కొన్నారు. 'అయోధ్య రామాలయ నిర్మాణాన్ని కాంగ్రెస్ నేతలు ఎందుకు వ్యతిరేకించారు. వాస్తవాలు చెబితే కాంగ్రెస్‌కు కడుపు మంటగా ఉంది. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారు సరే.. నిధులేవి?. హైదరాబాద్లో 3,400 ఆలయాలుంటే బోనాల ఉత్సవాలకు రూ.20 కోట్లు విదిలిస్తారా?. రంజాన్ పండుగకు మాత్రం రూ.33 కోట్లు విడుదల చేస్తారా?. బోనాల ఉత్సవాల్లో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు' అని అన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'రంజాన్ పండుగకు రూ.33 కోట్లు ఇస్తే.. 80 శాతం మంది హిందువుల పండుగకు ఇంకెన్ని కోట్లు ఇవ్వాలి. విదేశాలు నిషేధించిన తబ్లీగీ జమాతే సంస్థ సభకు కూడా రూ.2.40 కోట్లు విడుదల చేస్తారా?. నేను హిందువుల కోసం బరాబర్ ప్రశ్నిస్తా. గోమాతను వధిస్తే ప్రశ్నించాలా? వద్దా?. హిందూ ఆలయాలను ధ్వంసం చేస్తే ప్రశ్నించాలా? వద్దా?. 15 నిమిషాల టైమిస్తే హిందువులను నరికి చంపుతానంటే ప్రశ్నించవద్దా?. నేను బరాబర్ సనాతన ధర్మం కోసం పని చేస్తా. హిందువులంతా జాగ్రుతం కావాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను ఎందుకు పాఠ్యాంశాల్లో చేర్చలేదని ఆయన ప్రశ్నించారు. టిప్పు సుల్తాన్ దీపావళి నాడు ఆలయంలో వెయ్యి మంది మహిళలను, పిల్లలను కాల్చి చంపిన నీచుడని.. అటువంటి దుర్మార్గుడిని హీరోగా చిత్రీకరిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆయన విగ్రహాలు పెట్టడం కరెక్టేనా? అని ప్రశ్నించారు. హిందువులారా జెన్ జీలను స్ఫూర్తిగా తీసుకోండి'.. 'ఆకాశంలోకి రాకెట్లను పంపడమే కాదు.. హిందూ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు. జెన్ జీల తీరు చూస్తుంటే ముచ్చటేస్తోంది. బోనాల ఉత్సవాలకు ఏటా వస్తూనే ఉన్నా. ఎన్నికలకు బోనాలకు సంబంధమే లేదు. బీజేపీ స్వచ్ఛంద సంస్థ కాదు.. రాజకీయ పార్టీ. రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోంది. హైడ్రా 150 పోస్టులకు ఫిజికల్ టెస్ట్ పెడితే సరూర్ నగర్ స్టేడియం నిండిపోవడమే నిదర్శనం. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తానన్న హామీ ఏమైంది?. ఉద్యోగాలను భర్తీ చేసేదాకా నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తానన్న హామీ ఏమైంది?. రోజ్ గార్ మేళాతో 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత మోదీదే. ఫీజు రీయంబర్స్ మెంట్ అందక పేద విద్యార్థులు అల్లాడుతున్నారు' అని అన్నారు.

# మధ్యాహ్నం సాగర్‌కు సీఎం

- పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 9(మనం బ్యూరో):** రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవాలని సోమవారం నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్‌లో వరుణ యాగం నిర్వహించనున్నారు. వరుణ యాగంలో భాగంగా నిర్వహించే పూర్ణాహుతిలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం 2-45కు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకుంటారు. అక్కడి నుంచి విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌజ్ ప్రాంగణంలో జరిగే యాగం వద్దకు చేరుకోనున్న సీఎం యాగం ముగిసిన అనంతరం 4 గంటలకు తిరిగి హైదరాబాద్ బయలుదేరతారు. 108 మంది రుత్విక్కులతో 11 హోమ గుండాలతో ఈ వరుణ యాగం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో జరుగనుంది.

# వరుణుడి కరుణ కోసం సాగర్‌లో మహాయాగం

## నేడు 108 మంది రుత్వికులతో ప్రత్యేక క్రతువు

**పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి**

**నేతృత్వం వహించనున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**11 హోమగుండాలతో విజయవిహార్‌లో వైదిక కార్యక్రమం**

**కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పం**

**సాగర్లో ఇంకా 166.39 టీఎంసీల ఖాళీ.. భారీ ప్రవాహాల కోసం ఎదురుచూపు**



**హైదరాబాద్/నాగార్జునసాగర్, ఆగస్టు 9:** నైరుతి రుతుపవనాల కాలం సగం దాటి ఆగస్టు రెండో వారంలోకి ప్రవేశించినా తెలంగాణకు జీవనాడులైన కృష్ణా, గోదావరి నదులకు స్థిరమైన ప్రవాహాలు ఇంకా పూర్తిస్థాయిలో అందడం లేదు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయిలో నిండాలంటే తెలంగాణలో వర్షాలతోపాటు ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ విస్తారంగా వర్షాలు కురవాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా-గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని ఆకాంక్షిస్తూ సోమవారం నాగార్జునసాగర్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వరుణ యాగం నిర్వహించనుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి ఈ యాగంలో పాల్గొననుండగా, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్కుమార్రెడ్డి కార్యక్రమానికి నేతృత్వం వహించనున్నారు.

తెలంగాణతోపాటు కృష్ణా, గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా, సకాలంలో వర్షాలు కురవాలని, నదులకు స్థిరమైన ప్రవాహాలు రావాలని, జలాశయాలు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, వ్యవసాయానికి సమృద్ధిగా నీరు అందాలని కోరుతూ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు.

### 108 మంది రుత్వికులు.. 11 హోమగుండాలు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితులు, ఆలయ సిద్ధాంతితో సంప్రదింపుల అనంతరం ఆగస్టు 10న వరుణ యాగం నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయించారు. నాగార్జునసాగర్లోని విజయవిహార్ ప్రాంగణంలో 11 హోమగుండాలను ఏర్పాటు చేస్తున్నారు.

108 మంది రుత్వికులు, అర్చకులు, వేదపండితులు రోజంతా ప్రత్యేక వైదిక క్రతువులు నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పంటలకు సాగునీటి కొరత తలెత్తకుండా కృష్ణా, గోదావరి నదులకు సమృద్ధిగా ప్రవాహాలు రావాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

### ఎగువ రాష్ట్రాల వర్షాలే కీలకం

తెలంగాణ జలభద్రత కేవలం రాష్ట్రంలో నమోదయ్యే వర్షపాతంపైనే ఆధారపడి ఉండదు. కృష్ణా, గోదావరి నదుల ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షాలు రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు అత్యంత కీలకం. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతం సుమారు 2.59 లక్షల చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉండగా, ఇందులో దాదాపు 44 శాతం కర్ణాటకలో, 27 శాతం మహారాష్ట్రలో ఉంది.

అంటే కృష్ణా పరీవాహక ప్రాంతంలో 70 శాతానికిపైగా ఈ రెండు ఎగువ రాష్ట్రాల్లోనే ఉంది. కర్ణాటక, మహారాష్ట్రల్లోని పశ్చిమ కనుమలు, కృష్ణా, భీమా, తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో కురిసే వర్షాలే ఆల్మట్టి, నారాయణపూర్ మీదుగా జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్కు వచ్చే ప్రవాహాలను ప్రధానంగా ప్రభావితం చేస్తాయి.

గోదావరి విషయంలోనూ ఇదే పరిస్థితి. సుమారు 3.13 లక్షల చదరపు కిలోమీటర్ల గోదావరి బేసిన్లో దాదాపు 49 శాతం మహారాష్ట్రలోనే ఉంది. నాసిక్, మరాఠ్వాడాతోపాటు ఎగువ, మధ్య గోదావరి ప్రాంతాల్లో కురిసే వర్షాలు తెలంగాణలోని శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులకు వచ్చే ప్రవాహాలపై ప్రభావం చూపుతాయి. అందువల్ల రాష్ట్రంలో ఎంత వర్షం కురుస్తుందన్నదానితోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షపాతం, ఎగువ జలాశయాల్లో నిల్వలు, అక్కడి నుంచి విడుదలయ్యే నీటిని నీటిపారుదల శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది.

### కృష్ణాలో పెరుగుతున్న ప్రవాహాలు

ఆదివారం ఉదయం 9 గంటల నాటికి కృష్ణా ఎగువ ప్రాంతాల్లో ప్రవాహాలు ఆశాజనకంగా కనిపించాయి. ఆల్మట్టికి 1,05,332 క్యూసెక్కుల ఇన్ఫ్లో నమోదవుతుండగా 86,155 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. 129.72 టీఎంసీల స్థూల సామర్థ్యానికి గాను ఆల్మట్టిలో 113.71 టీఎంసీల నిల్వ ఉంది. నారాయణపూర్కు సుమారు 42 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 18,654 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తెలంగాణలోకి కృష్ణా ప్రవాహాలకు ముఖద్వారంగా ఉన్న జూరాలకు సుమారు 80 వేల క్యూసెక్కుల ఇన్ఫ్లో నమోదైంది. అక్కడి నుంచి 46,543 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. 9.66 టీఎంసీల సామర్థ్యానికి గాను జూరాలలో 8.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీశైలంలో 215.807 టీఎంసీల స్థూల సామర్థ్యానికి గాను 179.90 టీఎంసీల నీరు ఉంది. ఇంకా సుమారు 35.91 టీఎంసీల ఖాళీ సామర్థ్యం ఉంది.

### సాగర్లో సగానికంటే తక్కువే

వరుణ యాగానికి వేదికగా మారుతున్న నాగార్జునసాగర్ మాత్రం ఇంకా భారీ ప్రవాహాల కోసం ఎదురుచూస్తోంది. నాగార్జునసాగర్ స్థూల నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 145.65 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అంటే జలాశయంలో ఇంకా దాదాపు 166.39 టీఎంసీల ఖాళీ సామర్థ్యం ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఊఖఔ) 590 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం సుమారు 518 అడుగుల వద్ద ఉంది. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే పరిస్థితిలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. గత ఏడాది ఆగస్టు 9న నాగార్జునసాగర్లో సుమారు 310.25 టీఎంసీల నిల్వ ఉండగా, నీటిమట్టం 589.40 అడుగుల వద్ద ఉంది. అంటే దాదాపు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఈ ఏడాది అదే తేదీకి జలాశయంలో గతేడాది నిల్వలో సగానికంటే తక్కువ నీరే ఉంది.

### మిగిలిన రుతుపవనాలే కీలకం

రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు సీజన్ మొత్తంలో వర్షాల విస్తరణ అత్యంత కీలకమని నీటిపారుదల వర్గాలు భావిస్తున్నాయి. ఒకటి, రెండు భారీ వర్షాలతోనే సాగునీటి అవసరాలు పూర్తిగా తీరవు. పంటలకు వివిధ దశల్లో తేమ అవసరం. చెరువులకు వరుస ప్రవాహాలు రావాలి. భూగర్భ జలాల పెరుగుదలకు నిరంతర వర్షాలు అవసరం. ప్రధాన జలాశయాలు నిండాలంటే ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి స్థిరమైన ప్రవాహాలు కొనసాగాలి. ఈ నేపథ్యంలో రుతుపవనాల మిగిలిన కాలంలో తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురవడం రాష్ట్ర జలభద్రతకు కీలకంగా మారింది.

### జలభద్రత కోసం సామూహిక సంకల్పం

ఈ పరిస్థితుల్లో జరుగుతున్న వరుణ యాగానికి ప్రాధాన్యం ఏర్పడింది. వర్షాలు పూర్తిగా ముఖం చాటేసిన పరిస్థితుల్లో కాకుండా, కృష్ణాలో ప్రవాహాలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ అవి సీజన్ అంతటా స్థిరంగా కొనసాగుతాయా అన్నది ఇంకా స్పష్టత రాని సమయంలో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణతోపాటు కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలన్నింటిలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నదుల్లో ప్రవాహాలు పెరగాలని, ప్రాజెక్టులు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుతూ వరుణ యాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఒకవైపు వర్షపాత అంచనాలు, జలాశయాల నీటిమట్టాలు, ఇన్ఫ్లో-అవుట్ఫ్లోలను శాస్త్రీయంగా పర్యవేక్షిస్తూ ప్రభుత్వం జల నిర్వహణకు చర్యలు చేపడుతుండగా, మరోవైపు ప్రకృతి అనుకూలించాలని కోరుతూ భారతీయ వైదిక సంప్రదాయంలో వరుణ యాగాన్ని నిర్వహిస్తోంది. కృష్ణా తీరాన జరిగే ఈ మహాక్రతువులో ఒకటే సంకల్పం - సమృద్ధిగా వర్షాలు కురవాలి.. కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి.. తెలంగాణ జలాశయాలు నిండాలి.. రైతాంగం సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలుగు కీర్తి పతాకలు



నేటి తరానికి భావితరానికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఆదర్శప్రాయంగా ఉండాలని ఉద్దేశంతో ఈ తెలుగు దీపికలలో మొత్తం 50 మంది తెలుగు తేజాలు గురించిన సంక్షిప్త సమాచారం ఉంది. 1841-1899 మధ్య కాలంలో జన్మించిన మహిళామణులు, సంఘ సంస్కర్తలు, నాటకం, కళాసాహిత్య, క్రీడారంగాలలో ప్రముఖులు. రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులుగా పేరందిన తెలుగు వారి గురించిన సంక్షిప్త సమాచారాన్ని సేకరించి ఒకచోట చేర్చిన వెలుగు రేఖలు ఈ 'తెలుగు దీపికలు'.

ముందుగా డొక్కా సీతమ్మ గారు. వీరి నాన్నగారికి బువ్వన్న గారు అనే మరో పేరు ఉండేదట. అంటే అన్నం పెట్టే పెద్దమనిషి అని జనం పిలుచుకున్నారు. ఆ వారసత్వాన్ని సీతమ్మ గారు కొనసాగించారు. ఆమె కీర్తి బ్రిటిష్ చక్రవర్తి చెవిన పడి ఏడవ ఎడ్వర్డ్ ప్రభువు ఆమెను లండన్ రమ్మని ఆహ్వానించే వరకు సాగింది. ఆంగ్ల ప్రభుత్వం ఢిల్లీలో తిరిగి పట్టాభి షేకం వేడుకలు జరిపినప్పుడు దర్బార్‌హాల్లో ఆమె చిత్రపటాన్ని పెట్టి గౌరవిం చారు.

కొక్కొండ వెంకటరత్నం పంతులు. వీరు ఆంధ్ర భాషా సంజీవని పత్రికను 20 సంవత్సరాలు పాటు నడిపారు. హాస్యవర్ధిని అనే పత్రికను కూడా నడిపారు ఆంగ్లభాష పదాలను ఉపయోగించకుండా వాటికి సరైన పారిభాషిక పదాలు నిర్మించి వ్యాప్తిలోకి తెచ్చారు.

కందుకూరి వీరేశలింగం గారు దక్షిణ భారత విద్యాసాగరుడుగా ప్రసిద్ధులు. వితంతు శరణాలయాన్ని స్థాపించారు. హితకారిణీ సమాజం అనే సంస్థను స్థాపించి తన యావదాస్తిని దారాదత్తం చేశారు. 1874లో వివేకవర్ధని పత్రికను 1883లో సతీ హిత బోధిని పత్రికను స్థాపించి స్త్రీ అభ్యుదయం కోసం తెలుగులో వ్యాసాలను రాశారు. వీరి సతీమణి కందుకూరి రాజ్యలక్ష్మి గారు భర్తకు తగిన సహచరి.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు సుమారు 30 నాటకాలు రాశారు. నాటక ప్రదర్శన కోసం సరస వినోదిని సభ స్థాపించి తద్వారా నాటక ప్రదర్శనలు కవి పండిత సమ్మేళనాలు నిర్వహించి తెలుగుదేశంలో ముందెప్పుడూ లేని గౌరవ స్థానాన్ని నాటకానికి ఆర్జించి పెట్టారు. చక్కటి చిక్కటి సాహిత్య పుష్టి గల రచనలే గాని అందులోని పద్యాలు బహుళ ప్రచారం పొందాయి.

న్యాపతి సుబ్బారావు పంతులుగారు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ న్యాయవాద పట్టాను పొందటం అప్పట్లో అరుదైన విషయం. వీరు 'ద హిందూ' జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించారు. అప్పట్లో భారత దేశంలో ప్రచురితమయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటిష్ ప్రభుత్వ కనుసన్నల్లో ఉండేవే. 1907లో వందేమాతర ఉద్యమం సందర్భంగా బిపిన్ చంద్రపాల్ ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించారు.

ఆదిభట్ల నారాయణదాసు గారు కవిత్వం సంగీతం నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు కొనిపోయారు. ఈ మూడింటి కలయికకు భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచించారు.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు సాక్షి వ్యాసాలు, కంఠాభరణం రచయితగా ప్రసిద్ధులు. సాక్షి వ్యాసాలు ఆరు సంపుటలుగా నాటకాలు సుమారు 30 వరకు ప్రచురించారు. వారి రచనలన్నింటిలోనూ చలోక్తులు చమత్కారాలు ఉపమానాలు రత్నాలు, ముత్యాలు లాగా వెదజల్లబడి ఉంటాయి.

చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారి అసలు పేరు పున్నయ్య. మనోరమ సరస్వతి దేశమాత అనే పత్రికలు నడిపారు. ప్రహసనాలు, నాటకాలు రాశారు. 'సౌందర్య తిలక కర్పూర మంజరి' 'గణపతి' ఆయన ప్రసిద్ధ రచనలు.

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు అప్పటి మారుతున్న పరిస్థితులను రాజకీయ పరిణామాలను తెలుగువారికి అందించాలనే ఉద్దేశంతో 'ఆంధ్ర పత్రిక' దినపత్రికను ప్రారంభించారు. 1924లో 'భారతి' అనే సాంస్కృతిక సాహితీ పత్రికను కూడా ప్రారంభించారు. వీరికి దేశోద్ధారక అనే బిరుదు ఉంది. మహాత్మా గాంధీ వీరి దాతృత్వాన్ని అభినందిస్తూ 'విశ్వదాత' అనుకొని యాడారు.

రఘుపతి వెంకయ్య నాయుడు తెలుగు ప్రజలకు సినిమాను పరిచయం చేసి చలనచిత్ర రంగానికి పితామహుడు అనిపించుకున్నారు. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సినిమా నిర్మాణ సంస్థ 'స్టార్ ఆఫ్ ది ఈస్ట్' ను స్థాపించారు. భీష్మ ప్రతిజ్ఞ మూగ చిత్రాన్ని నిర్మించారు. 1980వ సంవత్సరంలో వీరి పేరు మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినీ రంగంలో విశేష కృషి చేసిన వారికి అవార్డు ప్రదానం చేస్తున్నారు.

చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి అవధానాల పరంపరను ఒక వంక కొనసాగిస్తూ మరో వంక ఆంధ్ర నాటక సాహిత్యాన్ని రసవత్తరమైన పాండవ నాటకాలతో సుసంపన్నం చేశారు. పాండవ జననం మొదలు అశ్వమేధం వరకు కథను ఆరు నాటకాలుగా రచించారు.

టంగుటూరి ప్రకాశం పంతులు గారికి రంగస్థలం నక్షత్రం అనే బిరుదు ఉంది. పారిజాతాపహరణంలో సత్యభామ పాత్రను, వీరేశలింగం గారి చమత్కార రత్నావళి లోని స్త్రీ పాత్రను ప్రకాశం గారే ధరించేవారు. నా జీవిత యాత్ర పేరుతో నాలుగు సంపుటాలుగా చక్కని వ్యవహారిక భాషలో తన ఆత్మకథ రాశారు. స్వరాజ్య అనే పత్రికను ముందు ఆంగ్లంలో ఆ తర్వాత తమిళ తెలుగు భాషల్లో నడిపారు.

బండారు అచ్చమాంబ 'ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధించబడు స్త్రీలు రక్షితరాండ్రు కాదు. ఏ స్త్రీలు తమ యొక్క ఆత్మను తామే కాపాడు కొందురో వారే సురక్షితురాండ్రు' అంటూ 1901 లోనే 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే మహత్తర గ్రంథాన్ని రచించారు. వీరి ధన త్రయోదశి కథ వాస్తవానికి మొదటి తెలుగు కథ. తెలుగులో మొట్టమొదటి స్త్రీల చరిత్రను రాసిన తొలి మహిళగా అచ్చమాంబ చరిత్రలో చోటు చేసుకున్నారు.

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు. వీరు అజ్ఞానాంధకారంలో నిద్రాణమైన తెలుగు జాతిని మేల్కొలిపిన మహాపురుషులలో లక్ష్మణరావు ఒకరిగా ప్రసిద్ధి పొందారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారు పల్నాడు పుల్లరి సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించారు. మాలపల్లి నవలా రచన.. దీనికే సంగవిజయం అని కూడా పేరు పెట్టారు.

పింగళి వెంకయ్య గారు భవిష్యత్తులో చైనా భారత్ పై దాడి చేస్తుందని దలైలామా వంటి శాంతికాముకులు అక్కడ ఉండలేక భారత్‌కు వస్తారని 1920 నాటికే ఊహించి తన రచనలో పేర్కొన్న క్రాంతదర్శి. ఏ నేషనల్ ఫ్లాగ్ ఫర్ ఇండియా అనే పుస్తకాన్ని రచించి అందులో 30 రకాల జండాల నమూనాలను పొందుపరిచారు.

దువ్వూరి సుబ్బమ్మ గారికి దేశభాంధవి బిరుదు ఉంది. ఖద్దరు చీరలు బరువు మోయలేకపోతున్నామని సుబ్బమ్మగారితో మొరపెట్టుకున్న వాళ్లకు గుండెత్తు బరువున్న మొగుళ్లను మోస్తున్నారు. ఉద్యమం కోసం ఈ మాత్రం కోకలు బరువయ్యాయా అంటూ తనదైన శైలిలో మందలించి వారిలో చేనేత స్ఫూర్తిని నింపారు.

కట్టమంచి రామలింగారెడ్డి గారు, బళ్ళారి రాఘవ గురించిన ఎంతో విలువైన సమాచారం ఈ తెలుగు దీపికలలో చోటు చేసుకున్నాయి.

గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గారు ఆంధ్రలో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా పేరుపొందారు. యంగ్ ఇండియా పత్రికలో గాంధీజీచే 'ది బ్రేవ్ హరిసర్వోత్తమరావు' అని ప్రశంసలు అందుకోవడమే కాకుండా ఆంధ్ర తిలక్ గా వీరికి పేరు ఉంది.

మాడపాటి హనుమంతరావు గారు హైదరాబాదులోని శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, హనుమకొండలో రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా వీరు అభివృద్ధి చేసినవే. వీరు ఆంధ్ర మహాసభకు, వీరి సతీమణి ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం ఒక అపూర్వ సంఘటన. 1955లో కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ బిరుదును పొందిన తెలుగు వారిలో వీరే ప్రథములు.

దేవరాజు వెంకటకృష్ణారావు తొలి తెలుగు డిటెక్టివ్ నవలా రచయితగా పరిగణింపబడుతున్న వారు. తాపీ ధర్మారావు తో కలిసి వేగుచుక్క గ్రంథమాలను నెలకొల్పి 1912లో దాని ద్వారా 'వాడే వీడు' తెలుగులో మొట్టమొదటి డిటెక్టివ్ నవల. కాలూరాయ్ అపరాధ పరిశోధన నవలలో నాటికి లేని, ఇంకా అప్పటికి ఉనికి లోనికి రాని హెలికాప్టర్ ని సృష్టించారు. .

బులుసు సాంబమూర్తి గారు న్యాయవాదిగా రెండు చేతులా ఆర్జిస్తూ సూటుబూటుతో మోటార్ వాహనంపై గోదావరి జిల్లాలో తిరిగిన వీరు గాంధీజీ ఇచ్చిన సహాయ నిరాకరణ పిలుపుతో ఆ దర్జాలు దర్పాలకు వీడ్కోలు పలికారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు 'ఆంధ్ర రత్న' బిరుదు పొందిన వారు చీరాల పేరాల వీరు పాల్గొన్న ఉద్యమ సమరం. జానపద కళారూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాలకృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారు. సాధన అనే పత్రిక నడిపారు.

చిలుకూరి నారాయణరావు గారుఆంధ్ర విశ్వకళాపరిషత్తుచే కళా ప్రపూర్ణ బిరుదును కాశీ సంస్కృత విద్యాపీఠంచే 'మహోపాధ్యాయ' బిరుదును పొందారు. వీరికి ఆంధ్ర బెర్నార్డ్ షా'అనే బిరుదు ఉంది. తెలుగు సాహిత్యంలో తొలి పి.హెచ్‌డీ పరిశోధకుడు. నవ్య సాహిత్య పరిషత్తు తొలి అధ్యక్షుడు.

అయ్యంకి వెంకటరమణయ్య గారు గ్రంథాలయ ఉద్యమ పితామహుడుగా పేరు పొందారు. 1911 లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పడ్డారు. 1914లో విజయవాడలో చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షతన ప్రథమ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభను జయప్రదంగా నిర్వహించారు.

మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు శాసనాల శర్మగా చరిత్రలో నిలిచిపోయారు. గరిమెళ్ళ సత్యనారాయణ గారు రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా. గరిమెళ్ళ పాట విన్న బ్రిటిష్ కలెక్టరుకు తెలుగు భాష రాకపోయినప్పటికీ ఆ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజలను సైతం ఎలా చైతన్య పరచగలదో ఊహించి ఆ పాటను రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సర కఠిన కారాగార శిక్ష విధించారు. జైలులో ఉండగా తమిళ కన్నడ భాషలు నేర్చుకున్నారు. తమిళ కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువదించారు.

తెన్నేటి విశ్వనాథం గారు- పార్టీని మార్చినప్పుడు పదవులకు రాజీనామా ఇచ్చే సత్ సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన మొదటి వ్యక్తి. మన రాష్ట్రంలోనే కాక దేశంలోనే వీరు ప్రప్రథములు. కాఫీ బోర్డు ప్రెసిడెంట్‌గా ఉన్న రోజులలోనే అరకు లోయలో కాఫీ తోటలో వేయించ మొదలుపెట్టడం వీరి ప్రత్యేకత.

విశ్వనాథ సత్యనారాయణ గారు నన్నయ తిక్కన ఎర్రన్న కలగలిపిన రూపంతో పోతన లా భక్తాగ్ర గణ్యుడు. పద్యం చెప్పినా, కావ్యం రాసినా నవల రాసినా ఏ ప్రక్రియలోనైనా తన అరుదైన ప్రత్యేకతతో సాహితీ ప్రియుల హృదయాలను దోచుకున్న జ్ఞానపీఠ అవార్డు గ్రహీత.

జిడ్డు కృష్ణమూర్తి గారు 'జ్ఞాన సముపార్జనకు పరిమితం లేదు అంటూ పుస్తకాలు చదవడం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం, చదువు పూర్తయింది అనిపించుకోవడంతో సంపూర్ణ జ్ఞానం సంపాదించినట్టు కాదు, పుట్టిన క్షణం నుంచి శరీరాన్ని త్యజించే వరకు జీవితాంతం నిరంతరాయంగా కొనసా గాల్సిన ప్రక్రియ' అని ప్రబోధించారు.

గుర్రం జాషువా 'అస్పృశ్యులు పండించే ధాన్యం, ఆలయాలలో దేవుడి నైవేద్యంగా సమర్పిస్తున్నారు కానీ, ఆ ధాన్యం పండించే కృషికులకు ఆలయ ప్రవేశం లేదంటూ నోచ్చుకున్నారు. ధనవంతుల అపవ్యయాన్ని ఎండ గట్టారు. ఆస్థాన కవి చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి స్వయంగా జాషువా గారికి గండపెండేరం తొడగటం ఒక అపూర్వ ఘట్టం.

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు గారు విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలో భాగంగా ఖద్దర్‌తో నేసిన సర్జికల్ యాప్రాన్ వేసుకుని మెడికల్ కాలేజీకి హాజరయ్యేవారట. 1945లో బెంజమన్ డగ్గర్ తో కలిసి ఆయన టెట్రాసైక్లిన్ని కనిపెట్టారు. ఫైలేరియా కోసం హైట్రజెన్ ఔషధం, టి.బిని అరికట్టడానికి




ఐసోనికోటినిక్ ఆసిడ్, హైడ్రాజైడ్ కనిపెట్టారు. క్యాన్సర్ కీమోథెరపీ వాడకం గురించి తొలి డ్రగ్ మెథో ట్రేక్సేట్‌ను డెవలప్ చేసింది సుబ్బారావు గారే.

కనుపర్తి వరలక్ష్మమ్మ గారు 'నా జీవము ధర్మము, నా మతము నీతి, నా లక్ష్యము సతీ శ్రేయము. ఈ మూడింటిని సమర్థించుటకే నేను కలము పూనితిని' అని చెప్పుకున్న రచయిత్రి. బాపట్లలో 'స్త్రీ హితైషిణి మండలి'ని స్థాపించి స్త్రీల కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టి సమాజ సేవ చేశారు.

సుబ్బారావు గారు 'లోకమాన్య' అనే పత్రికకు సంపాదకత్వం వహించారు. కల్లూరి సుబ్బారావు గారిని బాబు రాజేంద్రప్రసాద్ 'జైలు పట్టభద్రుడు' అని కొనియాడారు.

దామెర్ల రామారావు గారు రాజమండ్రిలో నాటక ప్రదర్శనలు ఎక్కువగా జరుగుతున్న సమయంలో నాటకాన్ని కొత్త తరహాలో ప్రదర్శించిన వారిలో ముఖ్యులు. హిందూ డ్రమెటికల్ కంపెనీ వారు ప్రతి ఒక్క నాటకాన్ని కొత్త బ్యాక్ డ్రాప్ తో సరికొత్తగా తయారుచేసి ప్రదర్శించేవారు. అజంతా ఎల్లోరాలను సందర్శించి అక్కడ గచ్చు పై చిత్రాలు, శిల్పకళ మీద స్కెచ్ లు వేయమని రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్ జెన్నింగ్స్ కూల్ డ్రే ప్రోత్సహించారు. ఆంధ్ర సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్స్ పేరున 1922లోనే ఆయన రాజమండ్రిలో ఒక చిత్రకళ పాఠశాల ప్రారంభించారు. కేవలం 28 ఏళ్లకే అకాల మరణం చెంది చిత్రకళ ప్రపంచానికి ఎంతో అన్యాయం జరిగింది. ఇలా 'మన తెలుగు దీపికలు' ఎన్నెన్నో గొప్ప విషయాలను ఇప్పటి తరం వారికి తెలియనివి, మరొకసారి చదివించే రీతిలో వారి ఛాయా చిత్రాలతో ఈ పుస్తకాన్ని అందంగా సర్వాంగ సుందరంగా ఆయిల్ పేపర్ పై ముద్రించి తీర్చిదిద్దారు సంపాదకులు వివిఎస్ రాఘవాచారి గారు విభిన్న తరహాలో. వీరి సాహితీ సేవ ప్రస్తుతించ తగ్గది. తెలుగు భాషా సాహిత్య సేవ చేస్తున్న వీరు కందుకూరి పురస్కారం, కళాబంధు, గరుడ పురస్కారాలతో గతంలో సత్కరింపబడ్డారు.

కళాదీపిక సంపాదకుడు వి. ఎస్. రాఘవాచారి.. 'మన తెలుగు దీపికలు' (స్ఫూర్తి ప్రదాతలు సృజనాత్మక శిఖరాలు)అన్న శీర్షికన 'కళాదీపిక' పదవ ప్రచురణగా వెలువరించారు. (వెల రూ.150/, పేజీలు 137: మొబైల్ నం. 99088 37451)

**- మల్లేశ్వర రావు ఆకుల**
7981872655

# బహుభాషా కోవిదుడు 'గడియారం'



అతడు నిజంగానే అనేక యుద్ధములలో ఆరి తేరిన వృద్ధమూర్తి. జీవించింది ఎనభైఏడేళ్ళు. స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభలు, సంఘ సంస్కరణలు, నిజాం వ్యతిరేక పోరాటం,ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదలైన ఉద్యమాల్లో పాల్గొన్న వజ్ర సంకల్ప సదృశ నాయకత్వం, కవితా రచన, పత్రికా రచన, శాసన పరిశోధన,కావ్యాలంకార నాటక వ్యాకరణాది శాస్త్ర పాండిత్యం, అనువాదం, నాటక సమాజ స్థాపన, నటన, దర్శకత్వం వంటి సాంస్కృతికాభ్యుదయ శాఖల్లో సాంద్రతరమైన కృషితో తాను సంచరించిన తెలంగాణను వెలిగించిన బహుముఖీన ప్రతిభామూర్తి, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా వెలుగొందుతున్న పరమ పావన ఆలంపుర క్షేత్ర జోగులాంబ ఆలయ సంరక్షకుడు, సాహితీ మూర్తి గడియారం రామకృష్ణశర్మ. అనంతపురం జిల్లాలో జన్మించినా చిన్నతనంలోనే తెలంగాణకు వచ్చి ఆలంపురంలో స్థిరపడి జీవిత చరమాంకం వరకు ఆలంపురంతో పాటు తెలంగాణకు తన సేవలను విస్తరింపజేసిన విశిష్ట విద్వన్మూర్తి శర్మ గారు.

రామకృష్ణ శర్మ గారు 1919 మార్చి 6న రాయలసీమలోని అనంతపురం జిల్లా కదిరి తాలూకా బాబాసాహెబ్ గ్రామంలో జన్మించారు. వారి తల్లిదండ్రులు శ్రీమతి సుబ్బమ్మ, జ్వాలాపతి శాస్త్రి గార్లు. జ్వాలాపతి శాస్త్రి సుప్రసిద్ధ జ్యోతిష్య పండితులు. శర్మ గారి విద్యాభ్యాసం ఆ ఊరిలో వీధిబడిలో ప్రారంభమై ఎలిమెంటరీ స్కూల్లో ఐదవ తరగతి వరకు కొనసాగింది. ఆ పై తరగతులకు సంబంధించి అక్కడ బడి లేకపోవడంతో ఒక సంవత్సరం పాటు పాఠశాల విద్యకు దూరమయ్యారు. ఆ సమయంలో చిన్నాన్న రామశర్మ గారి వద్ద అమరకోశము, కొన్ని వేదమంత్రాలను అభ్యసించారు. ఈలోగా శర్మగారి అక్కకు వివాహమైంది. ఆమెను ఆలంపురానికి ఇచ్చారు. బావగారి ప్రోద్బలంతో శర్మగారు అలంపురం చేరుకొని అక్కడ ఉర్దూ మీడియంలో ఆరవ తరగతిలో చేరారు. ఆనాడు నిజాం రాష్ట్రంలో తెలుగువారు ఉర్దూ మీడియంలో చేరి చదువుకోవాల్సిన పరిస్థితి ఉండేది. శర్మ గారికి అది నచ్చక ఒక సంవత్సరం చదివి బడి మానేశారు. అన్న వరస అయినా సమీప బంధువు ద్వారా తెలుగు పుస్తకాలు తెప్పించుకొని స్వయంగా అధ్యయనం చేశారు. ఆ క్రమంలోనే మహాభారతం, భాగవతం ప్రబంధాలను చదువుకున్నారు. వేలూరి శివరామశాస్త్రి గారి వద్ద శిష్యుడుగా చేరి సంస్కృతం, అలంకార వ్యాకరణ శాస్త్రాలను అభ్యసించారు.ఆరో తరగతి తో తన పాఠశాల విద్యాభ్యాసం ముగిసిపోయిన స్వయం అధ్యయనంతో సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యం సంపాదించారు.

ఒకసారి శర్మగారు అలంపురంలో అతను మిత్రులతో కలిసి హరిచంద్ర నాటకం వేస్తుండగా తప్ప తాగి వచ్చిన పోలీసు ఆమీన్ రంగస్థల నటులను దుర్భాషలాడుతూ తెలుగు పద్యాలు పాటలు వద్దని,ఉర్దూ గజల్స్ పాడమని వేదిక మీద అల్లరి చేశాడు. తెలుగు భాషకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేని శర్మగారు ఆమీన్‌ను ఎదిరించారు. తర్వాత అలంపురంలో తన మిత్రులతో కలిసి ఆంధ్ర యువజన నాట్య మండలి స్థాపించి ఎన్నో నాటక ప్రదర్శనలు ఇచ్చారు. నాడు నిజాం పాలనపై ఉద్యమాన్ని నడుపుతున్న ఆంధ్ర మహాసభలో చేరి కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యమాన్ని నడిపారు. ఆ సమయంలో తెలంగాణ ప్రజలను ఉద్యమ కార్యోన్ముఖులను చేయడానికి వారిని చైతన్య పరచడానికి రహస్యంగా భాగ్యనగర్ రేడియో కేంద్రాన్ని నెలకొల్పి సందేశాలను అందించేవారు. సురవరం ప్రతాపరెడ్డి గారి ప్రోత్సాహంతో సుజాత పత్రికకు సంపాదకుడిగా ఉంటూ నిజాం మరియు బ్రిటిష్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యాసాలు రాస్తుండేవారు. సాంఘిక దురాచారాలను నిరసిస్తూ వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడమే కాకుండా తాను స్వయంగా కమలమ్మ అనే వితంతువును వివాహమాడి ఆదర్శంగా నిలిచారు. అనాధ స్త్రీల కొరకు ప్రత్యేక విద్యాలయం స్థాపించి శిక్షణ ఇప్పించి వారికి జీవనోపాధిని కల్పించారు. ఆంధ్రోద్యమంతోపాటు గ్రంథాలయోద్యమాన్ని నడిపి వాటి స్థాపనకు అభివృద్ధికి కృషి చేశారు.

కర్నూలు జిల్లా నిడుజురాలో పదేళ్ళ వయసు గల బాల వితంతువుకు పునర్వివాహం చేయించారు. 5-6 వితంతు పునర్వివాహాలు చేయించారు. దాంతో కులబహిష్కార దండనను ధైర్యంగా ఎదుర్కొని నిలిచారు. 1953లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆలంపురంలో సప్తమ మహాసభలు జరుపుకున్నది. సభల్లో 30వేల మంది పాల్గొనడం ఒక రికార్డు. నిజాం రాష్ట్ర ఆంధ్ర సరస్వత పరిషత్తు స్థాపకులలో ఒకడిగా, కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా వివిధ హోదాల్లో తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేశారు.

ఆలంపురం ఆలయాలతో శర్మ గారి జీవితం పెనవేసుకు పోయింది ఆలంపురంలో ఎన్నో తామ్ర శాసనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసు కోవాలని శర్మ గారికి ఆసక్తి కలిగింది.అదే ఆయనను పరిశోధన రంగం వైపు మళ్ళించింది. దేవాలయాల వాస్తు నిర్మాణంపై ఆసక్తితో వాస్తు శాస్త్రాన్ని అధ్యయనం చేసి ఆలయాల వాస్తు నిర్మాణ వైశిష్ట్యాన్ని అందరికీ తెలియజేశారు. ఆలంపుర ఆలయాల అభివృద్ధి కొరకు ఏర్పాటు చేయబడిన



జోగులాంబ బాల బ్రహ్మేశ్వర దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా దశాబ్దాల పాటు పనిచేసే ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు. ఒక విధంగా శర్మగారు ఆలంపురం క్షేత్ర పరిరక్షకుడిగా పనిచేశారనడంలో అతిశయోక్తి లేదు.

శర్మగారు అలంపురం చరిత్ర - మహత్యం, దక్షిణ వారణాసి, బీచుపల్లి క్షేత్రచరిత్ర, ఉమా మహేశ్వర క్షేత్ర చరిత్ర మొదలైన క్షేత్ర చరిత్రలు, పాంచజన్యం, చంద్రహాసోపాఖ్యానం వంటి పద్య కావ్యాలు, కన్నడ సాహిత్య చరిత్ర,పంజాబ్ సాహిత్య చరిత్ర, మన వాస్తు సంపద, భారతీయ వాస్తు విజ్ఞానం, వీర గాధలు అనే కథా సంపుటి మొదలైనవెన్నో రాశారు. శతపత్రం పేరుతో ఆత్మకథ రాసుకున్నారు. ఆ గ్రంథానికి శర్మ గారి మరణాంతరం 2007లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

ఇవేగాక శర్మగారు ఆలంపురంలోని రైతుల అభ్యున్నతికై రైతులందరినీ సంఘటిత పరిచి ఆలంపురం వ్యవసాయ సంఘాన్ని స్థాపించారు.ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యుడిగా, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడిగా,గ్రంథాలయ సంస్థ సభ్యుడిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం అకాడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా అనేక విధాలుగా తన సేవలు అందించారు గడియారం లాగ నిరంతరం ఆలంపుర అభివృద్ధికి పాటుపడిన మహామనిషి 2006 జూలై 25న పరమపదించారు. శర్మ గారి జీవిత అనుభవాలు విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చడం ద్వారా మనం ఆయనను గౌరవించిన వారమవుతాం.

**- సుధాకర్. ఏ.వి**
9000674747

# జ్ఞానపీఠ సాహితీ సుమాలు



కేదార్‌నాథ్ సింగ్ భారతదేశానికి చెందిన సుప్రసిద్ధ ఆధునిక హిందీ కవి, విమర్శకుడు, వ్యాసకర్త. జూలై 7,1934న ఉత్తరప్రదేశ్ లోని బలియా జిల్లా, చకియా గ్రామంలో జన్మించిన ఆయన హిందీ సాహిత్యానికి చేసిన విశేష కృషికి గాను 2013 సంవత్సరంలో అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును అందుకున్నారు. ఆయన రచనలో ఒక ఆత్మీయ ఆర్ద్రత కనబడుతుంది. కేదార్‌నాథ్ సింగ్ చుట్టూ ఉన్న ప్రపంచాన్నే తన కవిత్వానికి వస్తువుగా మలచుకుని అనేక కావ్యఖండాలను చెక్కారు. ఆయన కవితాయాత్ర 1950 నుంచే మొదలవుతుంది. సమకాలీన హిందీ కవిత చరిత్ర రచనా రీతుల మీద చర్చకు తెరలేపిన కవి అజ్ఞేయ్ సంపాదకత్వంలో 1950లో వెలువడిన 'తార్ సప్తక్'లో స్థానం పొంది అప్పట్లోనే శక్తివంతమైన యువకవిగా పేరొందారు. ఆయన కలం నుంచి వెలువడిన కవితా సంకలనాల శీర్షికలను చూడగానే కవి తృష్ణ అవగతమవుతుంది. 'అభిబిల్కులే అభి', 'జమీన్ పక్ రహీ హౌ', 'అకల్ మే సారస్' (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచన) టాఘ్ (పులి) ల్లాంటి అత్యంత శక్తివంతమైన రచనలు ఆయన సృజనలు. హిందీలోని 'నవ్య కవిత్వం' (నయీ కవిత) ఉద్యమంతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. ఆయన రచనలలో 'పులి' కవితా సంకలనం ప్రసిద్ధమైనది. మానవ







జీవితంలోని వికృతాన్ని, విపరీత పోకడలను తిరస్కరించడమంటే మనిషిలోని ప్రేమను బ్రతికించడమే. కేదార్‌నాథ్ సింగ్ హిందీలోని 'నవ్య కవిత్వం' (నయీ కవిత) ఉద్యమంతో బలమైన అనుబంధం పెంచుకున్నారు. ఆయన ప్రముఖ రచనలలో అకాల్ మే సరస్ (కరువులో కొంగలు) ప్రసిద్ధ కవితా సంకలనానికి గాను ఆయనకు 1989లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. పురస్కారాలు,గౌరవాలు ఆయన పొందిన వాటిలో జ్ఞానపీఠ పురస్కారం (2013)సాహిత్య అకాడమీ అవార్డు (1989)వ్యాస సమ్మాన్, కుమారన్ ఆశాన్ అవార్డు మరియు దినకర్ పురస్కారం వంటి మరెన్నో ప్రతిష్టాత్మకమైనవి కలవు. కేదార్ నాథ్ సింగ్ మార్చి19, 2018న న్యూఢిల్లీలో కన్నుమూశారు.

భారతదేశానికి చెందిన ప్రముఖ గుజరాతీ భాషా కవి, సాహిత్యకారుడు. గుజరాతీ సాహిత్యంలో గాంధీ యుగం తర్వాతి కాలంలో (అను-గాంధీ యుగం) అత్యంత ప్రతిభాశాలిగా ఆయన గుర్తింపు పొందిన రాజేంద్ర కేశవలాల్ షా జనవరి 28,1913 కాపడ్వాని, బొంబాయి ప్రెసిడెన్సీలో జన్మించారు. ఎం.ఎస్.యు బరోడా పూర్వ విద్యార్థి రాజేంద్ర షా రాసిన ప్రసిద్ధ రచనలలో ధ్వని ,శాంత్ కోలాహల్ కలవు.

షా కవిత్వం రాయడమే కాకుండా, ఠాగూర్ కవితా సంకలనం బాలాకాను కూడా అనువదించాడు. ఆయన జయదేవుని గీత గోవింద , కోల్రిడ్జ్ రాసిన ది రిమ్ ఆఫ్ ది ఏన్షియంట్ మెరైనర్ ,డాంటే రాసిన ది డివైన్ కామెడీ లను కూడా అనువదించాడు. ఆయన వివిధ వృత్తులతో పాటు బొంబాయిలో ఒక ప్రచురణకర్తగా ఆయన1957 లో కవిలోక్ అనే కవితా పత్రికను ప్రారంభించాడు. షా బహుగ్రంథ కర్త. ఆయన కవితా సంకలనాలు ధ్వని, అందోలన్, శ్రుతి,మోర్పిన్చ్,శాంత్ కోలహల్, చిత్రానా పత్రాలేఖా,, ప్రసాంగ్ సప్తక్ , స్మృతిసంవేదన, విరాహ్మధురి, వ్రజ్యైకుంతే,హా... హు సాక్షి చు,ప్రేమ్నో పరియే ఇంకా ఆ గగన్ కలవు. రాజేంద్ షా అందుకున్న ప్రసిద్ధ పురస్కారాలెన్నో కలవు. వాటిలో 1947లో కుమార్ చంద్రక్ అవార్డ్, 1956లో రంజిత్రం సువర్ణ చంద్రక్ పురస్కారం, 1963లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1992లో సాహిత్య గౌరవ్ పురస్కారం,1999లో నరసింగ్ మెహతా పురస్కారం, 2001లోప్రతిష్టాత్మకమై జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందారు.'అతని భావోద్వేగం, ఆవిష్కరణల తీవ్రత, వ్యక్తీకరణ అతనిని గొప్ప ప్రాముఖ్యత కలిగిన కవిగా వేరు చేసింది. ఇక ఆయన కవిత్వం యొక్క ఆధ్యాత్మిక స్వరం నర్సింగ్ మెహతా, కబీర్, అఖో వంటి గొప్ప మధ్యయుగ కవుల సంప్రదాయం నుండి వచ్చింది' అని పురస్కారానికి ఎంపికచేసే న్యాయమూర్తులు గుర్తించడం రాజేంద్ర షాతో పాటు గుజరాతీ సాహిత్యానికి వన్నె తెచ్చింది. గుజరాతీ సాహిత్య సీమలో ప్రసిద్ధ అభ్యుదయ కవిగా వెలిగిన రాజేంద్ర కేశవ్ లాల్ షా జనవరి 2,2010న తన 96 యేండ్ల వయసులో ముంబాయిలో కన్నుమూశారు.

సీతాకాంత్ మహాపాత్ర ఒడియా మరియు ఆంగ్ల భాషలలో విశిష్టమైన భారతీయ కవి మరియు సాహిత్య విమర్శకుడుగా పేరున్న సీతాకాంత్ మహాపాత్ర సెప్టెంబర్ 17,1937న ఒడిషాలోని మహానది యొక్క ఉపనది 'చిత్రోత్పల' యొక్క ఒడ్డున గల మహంగ గ్రామంలో జన్మించారు. సీతాకాంత్ మహాపాత్ర సాంప్రదాయ కుటుంబంలోని ఒరియా భాషలో భగవద్గీతలోని అధ్యాయాల్ని వల్లె వేస్తూ పెరిగాడు. 1959లో అలహాబాద్ యూనివర్సిటీ నుండి రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ డిగ్రీని పూర్తి చేసారు. ముందు ఆయన ఆంగ్లము, ఒరియా భాషలలో రచనలను చేశారు. కానీ తరువాత ఆయన తన స్థానిక భాషలోనే కవిత్వం రాయాలని నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే 'ఒక కవి తను కలలు కన్న భావాలను వ్యక్తీకరించడానికి స్వంత భాష అవసరం' అనేది ఆయన అభిప్రాయం. భారతీయ సాహిత్యానికి ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా 1993లో భారతదేశపు అత్యున్నత సాహిత్య పురస్కారమైన 'జ్ఞానపీఠ్ అవార్డు'తో సీతాకాంత్ మహాపాత్రను సత్కరించారు. 1974లో 'శబ్దర్ ఆకాశ్' కవితా సంపుటికి గాను ఒడియా భాషలో సాహిత్య అకాడమీ అవార్డు లభించిన సీతాకాంత్ మహాపాత్ర 2002లో భారత రాష్ట్రపతి ఆయనకు దేశపు పౌర పురస్కారమైన 'పద్మ భూషణ్' 2010లో పద్మవిభూషణ్‌ను అందు కున్నారు. ఠాగూర్ శాంతి అవార్డు 2017లో అందుకున్నారు. ఆయన రచనల లో అష్టపది , శబ్దర ఆకాశ, అరదృశ్య, శ్రేష్ఠ కవిత కవితా సంపుటాలు ముఖ్యమైనవి. సీతాకాంత్ సృజన విశాలం బహుళం. ఒడియా భాషలో ఆయన రాసిన మొదటి కవితా సంపుటి 'దీప్తి ఓ ద్యుతి' 1963లో ప్రచురితమవగా ఆయన రెండవ సంపుటి 'అష్టపది'. ఆయన ఒడియాలో 350కి పైగా కవితలను, అలాగే ఆంగ్లంలో సాహిత్య విమర్శ మరియు సంస్కృతికి సంబంధించిన సుమారు 30 ప్రచురణలను వెలువరించారు. సంతాల్ గిరిజన సంస్కృతి మరియు సంతాలీ భాషపై ఆయనకున్న పట్టుతో గిరిజనుల మౌఖిక కవిత్వానికి సంబంధించిన తొమ్మిది సంపుటాలు వెలువరించారు. వీటిలోని కవిత్వాన్ని ఆయన స్వయంగా సేకరించారు.

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# గిరిజన సంక్షేమానికి రూ.18 వేల కోట్లకుపైగా నిధులు




- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు
- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల, ఆగష్టు 09( మనం ప్రతినిధి):** ఆదివాసీ సమాజం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి హక్కులను కాపాడటంతో పాటు ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి అడ్లూరి తెలిపారు.ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్లో బంజారాహిల్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందులో విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అందించే డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు త్వరలో మరింత మెరుగైన నాణ్యత కలిగిన కాస్ట్యూమ్స్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులు పాఠశాల విద్యతోనే పరిమితం కాకుండా ఉన్నత విద్య, ఉన్నత చదువుల వరకు అత్యుత్తమంగా రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి అన్నారు. రాష్ట్ర గిరిజన విద్యార్థులకు సంబంధించిన పోస్ట్-మెట్రిక్ స్కాలర్షిప్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి ఇటీవల హామీ ఇచ్చారని తెలిపారు.

**గిరిజన హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం**

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ, గిరిజనుల అటవీ హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి, గిరిజన సంస్కృతి-సంప్రదాయాల పరిరక్షణ, మహిళల గౌరవం, సాధికారత, ఆరోగ్యం, అభివృద్ధి వంటి అంశాలకు శాఖ ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు.

గిరిజనుల సాంప్రదాయ జ్ఞానం, జీవన విధానం, కళలు, భాషలు, ఆచారాలను భావితరాలకు అందించేందుకు శాఖ ఆధ్వర్యంలో సంస్కృతి పరిరక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## విష్ణుపురి కాలనీలో ఘనంగా శ్రీ శివశక్తి మహంకాళి బోనాల జాతర

**అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే నాయిని**



**కాజిపేట్ ఆగష్టు 9(మనం న్యూస్ ):** విష్ణుపురి కాలనీలో ప్రతియేటా అంగరంగ వైభవంగా నిర్వహించే శ్రీ శివశక్తి మహంకాళి బోనాల జాతరలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకాంక్షించారు. బోనాల జాతర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.విష్ణుపురి కాలనీలో సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ జాతర భక్తి శ్రద్ధలతో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు.

## మెడికో ప్రియాంక కుటుంబానికి అండగా ఉంటాం



- వైయస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల

**హైదరాబాద్, ఆగష్టు 9(మనంన్యూస్):** హైదరాబాద్లో మృత్యువుతో పోరాడుతూ మృతి చెందిన రాజమండ్రి మెడికో ప్రియాంక కుటుంబాన్ని వైయస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల రెడ్డి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, , దాని ఫలితంగానే ఈరోజు ఇలాంటి విషాద ఘటన చోటుచేసుకుంది. ఒక వైద్యురాలిగా సేవ చేయాలనే కలతో ముందుకు సాగుతున్న ప్రియాంక జీవితం ఇలా అర్ధాంతరంగా ముగియడం అత్యంత విషాదకరమన్నారు. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వారి దాష్టీకానికి ఒక నిండు జీవితం బలైపోయిందన్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న వేదన మాటల్లో చెప్పలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. . ఈ విషాద సమయంలో వైయస్ఆర్సీపీ వారి కుటుంబానికి అండగా నిలుస్తుంది. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

# ప్రకృతి సందేశమేమన జీవన మార్గం

- దేశ విదేశీ అతిధులతో ప్రకృతి ప్రతిజ్ఞ
- వండర్స్ ఇన్ నేచర్ పుస్తకావిష్కరణ
- వినూత్న రీతిలో సాగిన నేచర్ టు ఫ్యూచర్ సభ

**హైదరాబాద్, ఆగస్టు,09,(మనం న్యూస్):** మనమందరమూ ప్రకృతి ప్రేమికులమే. ప్రకృతికి దూరం అయితే ఏం జరుగుతుందో మనందరికీ తెలుసు. పకృతి కోపాన్ని మనం చవిచూస్తున్నాము. ఈ కోపం విలయంగా మారకముందే పర్యావరణ పరిరక్షణకు బద్ధులంకావాలని ప్రముఖ సినీ దర్శకులు, రచయిత, సామాజిక కార్యకర్త రాజ్ మాదిరాజ్ అభిప్రాయపడ్డారు. నేచర్ టు ఫ్యూచర్ పేరిట హైదరాబాద్ - చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాజ గానసభ ప్రధాన మందిరంలో ఆదివారం సాయంత్రం జరిగిన వినూత్న కార్యక్రమంలో రాజ్ మాదిరాజ్ మాట్లాడుతూ, ప్రకృతి రుణం తీర్చుకోలేనిది, ఇంట్లో ఓ చిన్న మొక్క నాటి పర్యావరణాన్ని రక్షిస్తున్నట్లు కొందరు ఫీలవుతుంటారు. ఇది సరికాదు, మనమంతా ప్రకృతితో పరవశం అయ్యే వరకు పర్యావరణ రక్షణను ఓ ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి. మానసమాట్లాడుతూ, మానవ నాగరికత అడవి సంపదను ఉపయోగించుకోవడంతోనే మొదలైందనీ, అందుకే అనేక సమాజాల్లో ఆధ్యాత్మిక చింతన అంతా ప్రకృతితో మమేకమైనదేనని అన్నారు. ప్రతి ఏటా నేచర్ టు ఫ్యూచర్ వంటి కార్యక్రమాలతో చైతన్యం కలిగించాలని, ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలతో పాటుగా ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ముదావహం అని హర్షం వెలుబుచ్చారు. ఆకాశవాణి విశ్రాంత అధికారిణి విజయ మాట్లాడుతూ, ఏ వృత్తిలో ఉన్నా సమాజ సేవను స్ఫూర్తిగా తీసుకోవాలని, ఈ విషయంలో తుర్లపాటి దంపతులు ఆదర్శంగా నిలిచారని అన్నారు. విద్యావేత్త, పర్యావరణవేత్త జె. రమాదేవి మాట్లాడుతూ, నేలను తవ్వేస్తున్నాము, కొండలు పడగొడుతున్నాము.. మరో ప్రక్కన పంచభూతాలు మన ఆధీనంలో ఉన్నాయని భావిస్తున్నాము. ఇది సరికాదు, నిజానికి ప్రకృతి ఆగ్రహిస్తేమన నాగరికత ఏమవుతుందోతెలిసి కూడా తప్పులు చేస్తున్నామేమో, ఇప్పటికైనా మేల్కొనాలని రమాదేవి హెచ్చరించారు. అక్షజ్ఞ పబ్లిషర్ వెంకట్ జ మాట్లాడుతూ, ప్రకృతిని ప్రేమిస్తే అంతే ప్రేమను ప్రకృతి మనకు ఇస్తుందనిచెప్పారు. సమాజానికి అవసరమైన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ముందుకు నడిపిస్తున్న తుర్లపాటి దంపతులను కొనియాడారు. సాహితీ ప్రియులు పరకాల రాజేశ్వర రావు మాట్లాడుతూ, వండర్స్ ఇన్ నేచర్ పుస్తకంలో ప్రతి పేజీ మేలుకొలుపే అని అభివర్ణించారు. తుర్లపాటి రచనల్లో ఓ సామాజిక బాధ్యత ఉంటుందనీ, అదే ఈ పుస్తకంలోనూ స్పష్టంగా కనిపించిందని అన్నారు. విద్యావేత్త, రచయిత కస్తల వేంకట విజయబాబు మాట్లాడుతూ, సమాజం నుంచి స్ఫూర్తిని అందుకుని తిరిగి ఆ సమాజానికే సేవ చేయాలన్న తపన తుర్లపాటి దంపతుల్లో స్పష్టంగా కనిపిస్తున్నదని,




సాంస్కృతి, విజ్ఞానం వంటి అంశాల్లో ప్రతిభ చూపుతున్న వారికి పురస్కారాలు అందజేయడం ముదావహమని అభివర్ణించారు. తుర్లపాటి నాగభూషణ రావు రచించిన వండర్స్ ఇన్ నేచర్ పుస్తకాన్ని అతిథుల సమక్షంలోచిన్నారులు టి. విరాజ్, టి.విహాన్, బి. శ్యామృత్, కె. గాయత్రి అనంత స్మృతి తదితరులు ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని డాక్టర్ కానూరి సత్యనారాయణ, డాక్టర్ సీతాలక్ష్మిలకు రచయిత తుర్లపాటి నాగభూషణ రావు అంకితం ఇవ్వగా,ఈ పుణ్య దంపతులకు బదులుగా వీరి కుమారుడు ఆనంద్, కోడలు సవిత గ్రంథ స్వీకర్తలుగా వ్యవహరించి పుస్తకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ, ఇటువంటి పుస్తకం రావాలని అమ్మా నాన్నలు పడిన తపన ఈ నాటికి నిజమైందని అన్నారు. ప్రకృతితో మమేకం భవిష్యత్తుకు ఆలంబనం అన్న స్ఫూర్తితో సభికులంతా ప్రకృతి ప్రతిజ్ఞ చేశారు. ఈ సభలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా, తమిళనాడు, కర్నాటక కు చెందిన వారు, ఇంకా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా కు చెందిన అతిథులు కూడా పాల్గొని ప్రకృతితో మమేకమవుతామని ప్రతిజ్ఞ చేయడం మరో విశేషం నాదనీరాజం పేరిట జరిగిన శాస్త్రీయ సంగీత కార్యక్రమంలో కిదాంబి లక్ష్మీకాంత్ ఇతర చెన్నై బృంద సభ్యులు చక్కటి కీర్తనలతో సభను రంజింపజేశారు. చిన్నారి స్మృతి నాట్య ప్రదర్శన,భోగరాజు శ్యామృత్వేసిన పోతరాజు వేషం అలరించాయి. ఈ కార్యక్రమానికి నిర్వహించడంలో పి. ఇందిరాదేవి, పోణంగి బాలభాస్కర్, శేషభట్టర్ మురళి వేంకటాచారి, వివిఎన్ విజయకుమార్ లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. తుర్లపాటి దంపతులను పలువురు వేదిక మీద ఆత్మీయంగా అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలే పట్టుకొమ్మలు



- ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం
- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్

**పెద్దపల్లి,ఆగస్టు 09 (మనం ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ కార్యకర్తలే పట్టుకొమ్మలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి,యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు అవినాష్ మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.యువతను రాజకీయంగా చైతన్యవంతులను చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి యూత్ కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ సిద్ధాంతాలు,ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు యూత్ కాంగ్రెస్ కార్యక్రమాల నిర్వహణలో ఎమ్మెల్యే విజయరమణారావు సరైన మార్గదర్శకత్వం వహిస్తూ,ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్నారని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శ్రావణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి రాజు, గుమ్మడి ప్రసాద్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ తిరుమలేష్ ,జనరల్ సెక్రెటరీ ఆయుబ్ మహమ్మద్, రాకేష్,ఓదెల,జూలపల్లి మండలాల అధ్యక్షులు రాహుల్, దేవేందర్ తో పాటు పలువురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కాటారం, ఆగష్టు 09 మనం న్యూస్:** కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఆదివారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీమల సందీప్ యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీమల సందీప్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యువతకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ముందుకు సాగుతున్న ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని రాహుల్ గాంధీ ఎంతో ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు.
యూత్ కాంగ్రెస్లో ఎన్నికల ద్వారా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో యువ నాయకత్వాన్ని తయారు చేయడంలో ఆయన కృషి ఎంతో గొప్పదని తెలిపారు. మంథని నియోజకవర్గ యువతకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తు, యువతను మంచి మార్గంలో నడిపిస్తూ, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, విద్య, ఉద్యోగాలు, క్రీడలు, రాజకీయాలు, సామాజిక సేవ తదితర అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సందీప్ తెలిపారు. శ్రీధర్ బాబు నాయకత్వంలో, శ్రీనుబాబు మార్గదర్శకత్వంలో మంథని నియోజకవర్గ యువతను మరింత శక్తివంతమైన యువ నాయకత్వంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేమునూరు ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పంతకాని తిరుమల, జిల్లా కాంగ్రెస్ నాయకులు పంతకాని సమ్మయ్య, కుంభం స్వప్న, అంగజాల అశోక్, తెప్పల దేవేందర్ రెడ్డి, దబ్బెడ రాజేష్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు కొట్టే ప్రభాకర్ , చీర్ల తిరుపతిరెడ్డి, జాడి మహేశ్వరి, ఎలుబాక సుజాత, ఐత శకుంతల, గద్దె సమ్మిరెడ్డి, నవీన్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మద్యం ఉచితంగా ఇవ్వలేదని వైన్స్‌షాప్‌లోకి చొరబడి దౌర్జన్యం



**పెద్దపల్లి, ఆగస్ట్ 09 (మనం న్యూస్):** మద్యం ఉచితంగా ఇవ్వలేదన్న కారణంతో ముగ్గురు వ్యక్తులు వైన్షాప్లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు షాప్ ఆస్తులను ధ్వంసం చేసి, హత్య చేస్తామని బెదిరించిన ఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని హన్మంతునిపేటలో చోటుచేసుకుంది. వైన్షాప్ నిర్వాహకుడు విద్యాసాగర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఈ నెల 8న శనివారం రాత్రి సుమారు 7.30 నుంచి 8 గంటల మధ్య సురభి కిరణ్రావు, శ్రీనివాస్రావు, పోలసాని సుధాకర్రావు అనే ముగ్గురు వ్యక్తులు హన్మంతునిపేటలోని గెజిట్ నంబర్ 12, లక్ష్మీ గణపతి వైన్స్లోకి బలవంతంగా ప్రవేశించినట్లు పేర్కొన్నారు. మద్యం ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేయగా, తాము అందుకు నిరాకరించడంతో తనను, సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషిస్తూ హత్య చేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో తెలిపారు. అనంతరం షాప్ గ్రిల్ను ధ్వంసం చేసి కౌంటర్ లోపలికి చొరబడి మద్యం బాటిళ్లను పగులగొట్టడంతో పాటు సీలింగ్ ఫ్యాన్ రెక్కలను విరగ్గొట్టినట్లు ఆరోపించారు. ఈ ఘటనలో షాప్కు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని విద్యాసాగర్ తెలిపారు. నిందితుల బెదిరింపులతో తాను, తన సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురైనట్లు పేర్కొన్నారు. గతంలో కూడా కిరణ్రావు ఇదే విధంగా పలుమార్లు ఇబ్బందులకు గురిచేసినప్పటికీ, అప్పట్లో విషయాన్ని పెద్దది చేయకుండా వదిలేశామని, అయితే ఈసారి ఆస్తి నష్టంతో పాటు ప్రాణహాని కలిగించే విధంగా బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలు, ఇతర ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అవసరమైన సమయంలో వాటిని పోలీసులకు అందజేస్తామని విద్యాసాగర్ తెలిపారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తనకు, సిబ్బందికి, షాప్కు తగిన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## యువ కవి సమ్మేళనంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




- గంజాయి, డ్రగ్స్‌పై యువత అక్షర యుద్ధం ప్రారంభించాలి

**కరీంనగర్ ఆగస్టు 9(మనం బ్యూరో):** కరీంనగర్ నగరంలోని ఫిల్మ్ భవన్లో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ కవి సమ్మేళనం కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తెలంగాణ రచయితల సంఘానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కరీంనగర్ సాహిత్య చరిత్రలో తొలిసారిగా యువ కవులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఫిల్మ్ భవన్ వేదికగా ఈ యువ కవి సమ్మేళనం నిర్వహించడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. కేవలం కవిత్వానికే పరిమితం కాకుండా, నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వ్యసనాలకు వ్యతిరేకంగా యుద్ధం మొదలైంది అనే అంశాన్ని ఎంచుకోవడం యువ కవుల సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. యువతను ఉద్దేశించి మేయర్ మాట్లాడుతూ, నేను ఈ రోజు మీ ముందుకు ఒక మేయర్గా మాత్రమే రాలేదు, మీ మంచి కోరుకునే కుటుంబ సభ్యుడిగా వచ్చాను. నేటి యువత అనంతమైన శక్తిసామర్థ్యాలకు మారుపేరు. అయితే కొందరు స్నేహితుల ఒత్తిడి, క్షణికావేశం లేదా ఇతర కారణాలతో గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఒకసారి ఈ మత్తు రక్కసి కోరల్లో చిక్కుకుంటే, అది కేవలం శరీరాన్నే కాదు, బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను కూడా దహనం చేస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు.

## నిర్మల్ హృదయ్ స్కూల్ కరస్పాండెంట్

# వంగా సాంబశివరెడ్డి మృతి

**నివాళులర్పించిన పలువురు ప్రముఖులు**

**సాంబశివరెడ్డి మరణం విద్యా రంగానికి తీరని లోటు!**

**సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం**





సిపిఎం జిల్లా కమిటీ సంతాపం

**ఖమ్మం, ఆగస్టు 9(మనం న్యూస్):** నిర్మల్ హృదయ్ స్కూల్ కరెస్పాండెంట్ వంగా సాంబశివరెడ్డి ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. విద్య ద్వారా వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన ఆయన విద్యను సేవగా భావించి, క్రమశిక్షణతో, మంచి విలువలతో ఒక తరాన్ని తీర్చిదిద్దిన గొప్ప విద్యావేత్త అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.సుదర్శన్ అన్నారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే వారి స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం, సుదర్శన్ మాట్లాడుతూ సాంబశివరెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విద్యతోనే సమాజం మారుతుందని నమ్మి జీవితమంతా విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితమైన వ్యక్తి సాంబశివరెడ్డి అని వారు గుర్తు చేశారు. 'నిర్మల్ హృదయ్ స్కూల్ అంటే ఒక పేరు కాదు, అది ఒక భావన. ఆ భావనకు ప్రాణం పోసిన వ్యక్తి సాంబశివరెడ్డి, ఆయన చూపిన బాటలోనే మనం ముందుకు వెళ్దామని తెలిపారు. 'గురువుగా, సంస్థ అధినేతగా, మార్గదర్శకుడిగా అనేక మంది గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని,. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రముఖ విద్యా సంస్థల అది నేత, ఆదర్శ ప్రాయుడు వంగ సాంబశివరెడ్డి సేవలను జిల్లా ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. విద్యా రంగంలో ఆయన చేసిన కృషి క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, పేద విద్యార్థులకు చేయూత, సహాయం అందించటం గొప్ప విషయమని కొనియాడారు.

ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే పార్టీ జిల్లా నాయకులు అయన స్వగృహం కెళ్ళి సాంబశివరెడ్డి పార్థివ దేహానికి సందర్శించి నివాళులర్పించారు. వీరిలో సిపిఎం జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, ఎర్ర శ్రీనివాసరావు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, తాళ్లపల్లి కృష్ణ, కుటుంబరావు, ప్రకాష్, మధు తదితరులు ఉన్నారు.

## ఎల్లమ్మకు పూజలు నిర్వహించిన మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్



**జగిత్యాల, ఆగస్టు 9 (మనం ప్రతినిధి):** హైదరాబాద్‌లోని బల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ తల్లి దేవస్థానాన్ని ఆదివారం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా జ్యోతి కీ ఆలయ అర్చకులు, భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో కొద్దిసేపు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో జీవించాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలపై, ముఖ్యంగా మహిళలు, యువత, పేదలు, బడుగు బలహీన వర్గాలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, అభివృద్ధి, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, అమ్మవారి ఆశీర్వచనం అందజేశారు

# గిరిజన సమాజాలు లిఖిత పూర్వక లిపి



**హైదరాబాద్, ఆగస్టు 9(మనంన్యూస్):** ప్రతి సంవత్సరం ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ ప్రజల అంతర్జాతీయ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా భారతదే శంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గిరిజన, ఆదివాసీ సమాజాలందరికీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ అనేది అనేక భిన్నమైన జాతి, గిరిజన సమూహా లను సూచించే విస్తృత పదం. ప్రపంచవ్యాప్తంగా 90 దేశా ల్లో 476 మిలియన్లకు పైగా ఆదివాసీ ప్రజలు నివసిస్తున్నా రని, వారు ప్రపంచ జనాభాలో సుమారు 6.2 శాతం ఉన్నార ని అందుబాటులో ఉన్న అంతర్జాతీయ గణాంకాలు సూచి స్తున్నాయి. తరతరాలుగా ప్రకృతితో మమేకమై జీవిస్తూ, తమను తాము ఈ భూమికి ఆదిమ నివాసులుగా భావించే ఈ సమాజాలు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణలో విశిష్ట పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచంలోని ఆదివాసీ సమాజాలకు ప్రత్యేకమైన భాషలు, సంస్క ృతులు, సంప్రదాయాలు, జానపద కళలు, సాంప్రదా య వస్త్రధారణ, ఆభరణాలు, ఆహారపు అలవాట్లు, ఆచార వ్యవహారాలు ఉన్నాయి. అనేక గిరిజన సమాజాలు లిఖి తపూర్వక లిపి, సాహిత్యం లేకపోయినా, తమ జ్ఞానాన్ని, సంస్క ృతిని, చరిత్రను, సంప్రదాయాలను తరతరాలుగా మౌఖికంగా పరిరక్షించుకుంటూ వస్తున్నాయి. అంతర్జాతీయ అభివృద్ధి రంగంలో గిరిజన వ్యవహారాలపై పనిచేసిన ఆంటోనెల్లా కార్డోన్ పేర్కొన్నట్లుగా, ఆదివాసీ గిరిజనులు సహజ వనరులకు సంరక్షకులు మరియు నిర్వాహకులుగా వ్యవహరిస్తూ, తమ ఉనికి ప్రారంభం నుంచే ప్రకృతి వనరులను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

# బస్టాండ్ బాధ తీరేదేనాడో...!

**కాటారంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయానికుల ఇక్కట్లు**
**ఎండకు వానకు రోడ్డుపైనే...**
**వివాదాల్లో గతంలో నిర్మించిన బస్టాండ్లు**
**సుదీర్ఘ కాలంగా ప్రయానికుల నిరీక్షణ**



**కాటారం, ఆగస్టు 09 మనం న్యూస్:** కాటారం పేరుకు ఐదు మండలాల సబ్ డివిజన్.. పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన డివిజన్ కార్యాలయాలకు నిలయం.. సబ్ కలెక్టర్ ఆఫీస్ సైతం ఏర్పడింది.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు వెళ్లే ప్రధాన కూడలి కానీ ఇక్కడ మాత్రం ప్రయానికులకు నిలువ నీడ కరువైంది. ఎండ అనక, వాన అనక ప్రయానికులు బస్సుల కోసం రోడ్లపైన గంటల కొద్ది పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. గత కొన్ని సంవత్సరాల క్రితం మండల కేంద్రానికి సమీపంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్లు వివాదంలో ఉండటంతో వినియోగంలోకి రాక ప్రయా నికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలువ నీడ లేక.. ప్రయానికుల ఇక్కట్లు.. ఐదు మండలాలకు కేంద్రంగా ఉన్న కాటారంలో పూర్తి సౌకర్యాలతో కూడిన ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు గత కొన్నేళ్లుగా కళగా మిగిలిపోతుంది. కాటారం మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు మహాముత్తారం. మహదేవపూర్, పలిమెల, మల్హర్ మండలాలకు చెందిన ప్రజలు ఎటైన వెళ్లాలనుకుంటే కాటారం మండల కేంద్రానికి రావడానికి ప్రాధాన్యత ఇస్తారు. ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్తారు. కాటారం ప్రధాన కూడలిలో ప్రయానికులు బస్సుల కోసం మంథని, భూపాలపల్లి. కాళేశ్వరం వైపుగా దుకాణాలు, వ్యాపార సముదాయాల ఎదుట వేచివుండాల్సిన పరిస్థితి ఉంటుంది. కొన్ని సమయాల్లో బస్సుల కోసం గంటల తరబడి దుకాణాల ఎదుట రోడ్డుపైనే పడిగాపులు ఉండాల్సి వస్తుంటుంది.

దీంతో దుకాణాల యజమానుల నుండి ప్రయానికులకు ఈసడింపులు ఎదుర వడంతో పాటు గంటల కొద్ది నిల్చుని ఉండలేక నానా పాట్లు పడుతుంటారు. ఎక్కడ కూర్చో లేక ఎక్కడ నిల్చోలేక ప్రయానికుల బాధలు వర్ణాతీతంగా మిగిలి పోతున్నాయి.

# విత్తుకు...విపత్తు...?

- పుట్టగొడుగుల్లో వెలుస్తున్న విత్తన కంపెనీలు
- నాణ్యతలేని విత్తనాలతో రైతన్నల అరిగోస
- మొలకెత్తని వాటి స్థానంలో మరిన్ని విత్తనాలు ఇస్తామంటు దళారుల రాయబారం
- సీడ్ ఏజెన్సీ లపై కరువైన వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ



**భూపాలపల్లి ఆగస్టు 9 మన ప్రతినిధి:** ఎల్ని నో ప్రభావం ఒకవైపు, అస్సాం అల్పపీడనం మరోవైపు ప్రకృతి తీరు తీరుగా రైతులపై తన ప్రపోపాన్ని చూపిస్తున్న తరుణంలో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టుగా తయారైంది రైతుల పరిస్థితి. పుట్ట గొడుగుల్లా పుట్టుకస్తున్న విత్తనాలు ప్రతి సంవత్సరానికి తీరొక్క రీతిన పుట్టుకొస్తున్న పలు రకాల కంపెనీల విత్తనాలతో, ఆయా కంపెనీల ప్రతినిధులు చేస్తున్న ప్రచారాలకు బోల్తా పడిన రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రైతుల అమాయకత్వాన్ని పెట్టుబడులుగా వాడుకుంటున్న ఆయా కంపెనీల ప్రతినిధులు తమ తెలివి తేటలతో రైతులను బురిడీ కొట్టిస్తున్నారు.. అమాయకులైన రైతులు తమ గ్రామాల్లో బడా బాబులను నమ్మి విత్తనాలు కొనుగోలు చేసి నాటుకుంటే ఆయా కంపెనీలవిత్తనాలు మొలకత్తక అన్న దాతలుహరీ మంటున్నారు.ఈ సంగతి ఇలా ఉంటే నకిలీ విత్తనాలను అంతగట్టిన ఆయా సీడ్ కంపెనీల తరఫున కొందరు దళారులు రంగంలోకి దిగి మొలకె త్తని విత్తనాల స్థానంలో కొత్త విత్తనాలు ఇస్తా మంటూ రాయబారాలు కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఈ దందా ఇలా కొనసాగు తుంటే అసలు నకిలీ విత్తనాలపై పర్యవేక్షించాల్సిన టాస్క్ ఫోర్స్ కమిటీలు యాడ ఉన్నాయో జాడ కానరావడం లేదు. ఇప్పటికైనా వ్యవసాయ, టాస్క్ ఫోర్స్ అధికారులు స్పందించి విత్తన స్థాయిలో రైతులు నష్టపోయిన పంట నష్టం కాకుండా అధికారులు చర్యలు తీసుకోని రైతులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భూపాలపల్లి జిల్లాలోని ఒక సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటికే అధికార అండ దండలతో కోట్లాది రూపాయల విత్తనాలను అమ్మినట్టు, వారంతా ఇబ్బందులు పడు తున్నప్పటికి అమ్మిన వ్యక్తులు పాలక పార్టీ కి చెందిన వారు కాబట్టి ఇంకా ఆ దందా బయటకు చెప్పు కునేందుకు నష్ట పోయిన రైతులు కిమ్ నాస్తిగా ఉండిపోతున్నట్టు సమాచారం.

# ఆరోగ్యమే మహాభాగ్యం



- ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను నివారిద్దాం
- ఎంపీ రఘునందన్ రావు

**గజ్వేల్ ఆగస్టు 9 మనం న్యూస్:** మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సౌజన్యంతో, శిశిర హస్పిటల్ వారి సహకారంతో గజ్వేల్ పట్టణంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ - ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలందరూ భారీ సంఖ్యలో పాల్గొని ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోన్నారు. ఈ సందర్భంగా ఎంపి రఘునందన్ రావు మాట్లాడుతూ క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే సమర్థవంతమైన చికిత్స పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది అన్నారు . గజ్వేల్ ప్రభుత్వ శిశిర ఆసుపత్రి సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాము విజయవంతం చేయడానికి కృషి చేసిన బిజెపి నాయకులకు కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు పాల్గొని ఈ శిబిరానికి హాజరై ఉచిత పరీక్షలు చేయించు కోవడంతో వారికి ఆరోగ్యంపై ఎంతో అవగాహన ఉందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవనేని సింధు, డాక్టర్ శ్రవణ్ లు పాల్గొని పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ కార్య క్రమంలో స్థానిక బిజెపి నాయకులు గాడి పల్లి భాస్కర్, మనోహర్ యాదవ్, బాల్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ అవగాహనతో రత్నాలను గుర్తించాలి

- అవగాహన సదస్సులో గంగు ఉపేంద్రశర్మ

**హనుమకొండ, ఆగస్టు 9 (మనం ప్రతినిధి):** సమాజంలో ప్రతి ఒక్కరూ తమ జాతకరీత్యా వాడుకునే ముత్యాలు, రత్నాలు -వాటిపై మూఢ నమ్మకాల ఆధారంగానే కాకుండా శాస్త్రీయ అవగాహన కూడా కలిగి ఉండాల్సిన అవసరం ఉందని గంగు ద్రశర్మ అన్నారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణ భవన్లో ఆదివారం బ్రాహ్మణ సేవాసమితి గౌరవ అధ్యక్షుడు ఉపేంద్రశర్మతోపాటు ప్రధాన కార్యదర్శి జివిఎస్.శ్రీనివాసాచారి, ప్రముఖ జ్యోతిష్య పండితులు వరదాచారిల ఆధ్వర్యంలో సు జరిగింది. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ జుమాలజీకి చెందిన ఫౌండర్ ఆఫ్ శుక్ర డాక్టర్ హేమంత్ శ్రీనివాస్, వెలగం శాస్త్రి తదితర జ్యోతిష్య పండితులను వారి సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముత్యాలు, రత్నా ప్రకృతిలో ఎలా ఉద్భవిస్తాయి.

వాటి సహస లక్షణాలు, అంశాలపై శాస్త్రీయంగా సత్కార గ్రహితలు వివరించారు. ఈ కారం లో పెందోట సురేశ్ కుమార్, ఇటికల సనాతన చార్యులు, ములుగు జ్ఞానేందర్. వీరన్న, తుమ్మలపల్లి రవీంద్రచార్యులు, భిక్ష రాజేశ్వరావు పాల్గొన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పర్వతగిరి, ఆగస్టు 9 (మనం న్యూస్):** పర్వతగిరి మండల కేంద్రంలో యాత్ కాంగ్రెస్ ఆవిర్భవ దినోత్సవం సం దర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో పర్వతగి గ్రామ సర్పంచ్ చిదురు శంకర్, ఉప సర్పంచ్ చింతకుంట్ల అనిత రమేష్, పర్వతగిరి పట్టణ అధ్యక్షుడు కూసం రామచందర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి బొట్ల మహేంద్రా, సీనియర్ నాయకులు పిన్నింటి సునీల్ రావు యువజన కాంగ్రెస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, పర్వతగిరి మండల యూత్ కాంగ్రెస్ ఉప అధ్యక్షుడు మూడ్ దేవరాజు, వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ భూక్యా విజయేందర్, మైనారిటీ నాయకురాలు సుల్తాన, ఏబి తండ సర్పంచ్ గులోత్ కిషన్ నాయక్, రావూరు ఉప సర్పంచ్ కొమ్ము రమేష్, నరకుడు రవీందర్, చింతపట్ల అజయ్ రావు, బుద్దె కుమారస్వామి, బొట్ల వెంకన్న, యాత్ కాంగ్రెస్ నాయకులు పిట్టల లోకేష్, నూనె మాణికుమార్, చీకటి రాజేష్, నీరటి ప్రశాంత్, బుద్దె రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరుగులతో శరీరానికి చక్కటి వ్యాయామం



- గచ్చిబౌలి ఎస్ఎమ్ఏ రన్‌లో పాల్గొన్న గజ్వేల్ రన్నర్స్
- రన్నర్స్‌ను అభినందించిన ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి

**ములుగు, ఆగస్టు 9(మనంన్యూస్):** పరుగులతో శరీరానికి చక్కటి వ్యాయామం,దృఢత్వం లభిస్తుందని... మనం వేసే ఒక్క అడుగు మెదడుకు మేలు,శరీర రక్త ప్రసరణకు ఎంతగానో దోహదం చేస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ధీమావ్యక్తం చేశారు. (ఎస్ఎంఏ)పుట్టుకతో అంగవైకల్యం పొందిన చిన్నారుల సహాయార్థం హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో నిర్వహించిన రన్ ఫర్ ఎస్ఎంఏ హాఫ్ మారథాన్ కార్యక్రమంలో ములుగు మండల ఎంపిటిసి సభ్యుల ఫోరం మాజీ అధ్యక్షుడు దుంబాల లింగారెడ్డి,కాస జనార్ధన్,వెంకటేష్, కొంపల్లి కర్ణాకర్, అరిగే జైపాల్ ,అజయ్ లు పాల్గొన్నారు. రన్ లో పాల్గొన్న లింగారెడ్డి,సభ్యులను ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారు తప్పా శరీరానికి ఎలాంటి వ్యాయామం చేయడం లేదన్నారు. దీంతో గుండెపోటు,బీపీ,షుగర్లు అంటూ చిన్న వయస్సు నుండే ఇన్సులిన్,బీపీ మాత్రలు వేసుకునే పరిస్తితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల నుండి మనకు మినహాయింపు కలగాలంటే పరుగుల పోటీల్లో పాల్గొనడం,రోజు వ్యాయామం చేయడం ఉత్తమం అని అంజిరెడ్డి సూచించారు. మనం వేసే ప్రతి అడుగు శరీరానికి ఎంతగానో దోహదం చేస్తుందని కావున ప్రతి ఒక్కరు రోజు కనీసం వంద అడుగులు వేసి శారీరక ఒత్తిళ్లను జయించాలని అంజిరెడ్డి పేర్కొన్నారు. పది మందికి ఆదర్శంగా నిలిచే ఎస్ఎంఏ పోటీల్లో పాల్గొన్న లింగారెడ్డి,సభ్యులలాగే మనందరం మన దేహం కోసం ఆలోచించి అడుగులు వేయాలని ఆయన కోరారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ములుగు, ఆగష్టు 9(మనంన్యూస్):** ములుగు మండల కేంద్రంలో గంగల బోయిన నర్సింలు మరణించాడని తెలుసుకున్న మన ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారిని పరామర్శించి 10000 రూపాయల ఆర్థిక సహాయం చేశారు. వారితోపాటు సర్పంచ్ తిగుళ్ల కనకయ్య, మాజీ ఎంపిటిసి హరిబాబు, వార్డు సభ్యులు జాలిగామ దశరథ, తీగుళ్ల శ్రీనివాస్, గంగుల బోయిన నాగేష్, లింగ శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఉన్నారు.

# నేడు జిల్లాలో మంత్రులు పొంగులేటి, పొన్నం పర్యటన

**హనుమకొండ, ఆగస్టు 9: (మనం ప్రతినిధి ):** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం (ఆగస్టు10) హనుమకొండ జిల్లాలో పర్యటిం చనున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎంఆర్ఓ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన భవనాన్ని ప్రారంభిం చనున్నారు. అనంతరం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు 2-బీహెచ్కే డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం హనుమకొండ నగరానికి చేరుకున్న అనం తరం ఇండియన్ రెడ్క్రాస్ సొసైటీ, హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో తలసీమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులతో ముఖాముఖి నిర్వ హించనున్నారు. అనంతరం కుడా ఆఫీస్ లైన్లోని ఈషా సూపర్ స్పెషాలిటీ అండ్ క్రిటికల్ కేర్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.45 గంటలకు హనుమకొండ ఐడీఓసీకి చేరుకుని కొద్దిసేపు బస చేసిన అనంతరం, మధ్యాహ్నం 2.50 గంటలకు కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించే రైతు సదస్సులో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకు భద్రకాళి దేవాలయంలో దర్శనం, హనుమకొండ మ్యూజికల్ గార్డెన్ ప్రారంభోత్సవం, కాజీపేటలో నిర్వహించే దర్గా ఉర్సు వేడుకల్లో పాల్గొననున్నారు. దర్గా ఉర్సు వేడుకల్లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్తో కలిసి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# ఘనంగా ముగిసిన బంజారా వనభోజన కార్యక్రమం

- కుటుంబ సమేతంగా తరలివచ్చిన బంజారా బంధుమిత్రులు



**హనుమకొండ,, ఆగస్టు 9(మనంన్యూస్):** హనుమకొండ జిల్లా రాంపూర్ మామిడి తోటలో ఆదివారం నిర్వహించిన బంజారా వనభోజన కార్యక్రమం అత్యంత ఘనంగా, విజయవంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి బంజారా బంధుమిత్రులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆటపాటలు, సాంస్క ృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు, మహిళలు, యువత, పెద్దలు అందరూ ఉత్సాహంగా పాల్గొనడంతో రాంపూర్ మామిడి తోట సందడిగా మారింది. బంజారా సంస్క ృతి, సంప్రదాయాలు, ఐక్యతను చాటేలా కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన బంజారా బంధుమిత్రులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని బంజారా నాయకులు తెలిపారు. కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమానికి మరింత శోభ తీసుకొచ్చిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.ఎన్. నాయక్, డాక్టర్ భోజ నాయక్, శంకర్ నాయక్, జాటోత్ కిషన్ నాయక్, గుగులోత్ వీరమ్మ, గోపి సింగ్, వాంకుడోత్ వీరన్న నాయక్, పోరిక శ్యామల నాయక్, లావుడియా పల్లవి రాజు నాయక్, జవహర్లాల్ నాయక్, మూడు రమేష్ నాయక్, వసంత నాయక్, జై సింగ్ రాథోడ్, సమ్మయ్య రాథోడ్, అజ్మీర వెంకట్, రామన్న నాయక్, అర్పిత నాయక్, అనసూయ నాయక్, సోనీ సందీప్, జ్యోతి, కస్తూరి, సర్పంచ్ సాంబు నాయక్, సోము నాయక్, ఏరియా నాయక్, గణపతి, కిరణ్, వీరు నాయక్, ప్రవీణ్, మురళి, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కలిసి ఉంటే కలదు సుఖం అనే స్ఫూర్తితో బంజారా బంధుమిత్రులందరూ ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా బంజారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని తెలిపారు. వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కుటుంబానికి, ప్రతి బంజారా బంధుమిత్రునికి, సహకరించిన నాయకులు, యువత, మహిళలు మరియు నిర్వాహకులకు బంజారా నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెండింగ్ పనులను పూర్తి చేయించాలని



- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని కలిసిన సిపిఐ పార్టీ నాయకులు

**గజ్వేల్, ఆగస్టు 9 మనం న్యూస్:** గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిని కలిసిన సిపిఐ పార్టీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు బట్టు దయానంద రెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు గజ్వేల్ చేనేత సహకార కార్మికసంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం గజ్వేల్ నియోజకవర్గం కార్యదర్శి శివలింగ కృష్ణ మరియు సిపిఐ పార్టీ నాయకులు సర్గం రాములు పలు సమక్షంలమీద కలిసి మాట్లాడడం జరిగింది ముఖ్యంగా నిరుపేద చేనేత కార్మిక సంఘం సమక్షాలపై మరియు సంఘం అభివృద్ధి విషయం పైన గజ్వేల్ లో పెండింగ్ ఉన్నరింగ్ రోడ్డు మరియు బస్టాండ్ నియోజకవర్గంలో ఉన్నటువంటి ప్రాజెక్టు కెనాల్ కాలువలు పెండింగ్ లో ఉన్నటువంటి పనులను తొందరగా పూర్తి చేయాలని కోరడం జరిగింది వారు ఇట్టి సమీక్ష పైన సానుకూలంగా స్పందించి వీలైనంత వరకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామనిహామీ ఇవ్వడం జరిగింది.

# అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుంది



**గజ్వేల్, ఆగస్టు 9 మనం న్యూస్:** గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో గల శ్రీ వాసవి మాత ఆలయంలో శాకాంబరీ ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాతను వివిధ రకాల రంగురంగుల కూరగాయలు, ఆకుకూరలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారు శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలో గోపూజ సామూహిక కుంకుమార్చన అమ్మవారి పారాయణం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ది బిక్షపతి, సీనియర్ నాయకుడు నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుంది అని, ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, శాకాంబరీ మాతగా పూజలు అందుకున్న వాసవి మాత కరుణ అందరిపై ఉండాలని సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని , అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు ఆర్యవైశ్య నాయకులు, కైలాస ప్రభాకర్, తోట బిక్షపతి, కాశీనాథ్, సిరిపురం సత్యనారాయణ, జగ్గయ్యగారి శ్రీనివాస్, కైలాస ప్రశాంత్,ఉమేష్, గంగ రమేష్,ఉప్పల కష్ణమూర్తి, గందే యాదగిరి, సంతోష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వాహన చోదకులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



- నాలుగు లక్షల 50 వేల రూపాయల జరిమానా వసూలు
- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

**గజ్వేల్, ఆగస్టు 9 మనం న్యూస్:** వాహన చోదకులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ వాహన చోదకులకు సూచించారు. గత వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో వాహన చోదకులను పరిశీలించగా వారికి సరైన పత్రాలు లేకపోవడం నిబంధన ఉలగించి వాహనాలు నడపడం వంటి చర్యలను గమనించి వారికి జరిమానాలు విధించడం జరిగిందని తెలిపారు. నాలుగు లక్షల 50 వేల రూపాయల జరిమానాలను వసూలు చేయడం జరిగిందని, కోర్టులో విచారణ అనంతరం ఆరుగురికి జైలు శిక్ష కూడా వేయించడం జరిగిందని తెలిపారు. వాహన చోదకులు మద్యాన్ని సేవించి వాహనాలను నడిపించవద్దని దానితో వాహన చోదకులకే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. వాహన చోదకులు ఇప్పటికైనా సరైన పత్రాలను ఉంచుకోవడమే కాకుండా మద్యాన్ని సేవించి వాహనాలు నడపవద్దని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ సూచించడం జరిగింది.



# పోరాటాలకు చిరునామా ఆదివాసీల చరిత్ర

## కోయ భాషను కోల్పోయే పరిస్థితి తేవద్దు ● కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ సభలో మంత్రి సీతక్క



### అశ్వారావుపేటలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

### హాజరైన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా

**అశ్వారావుపేట, ఆగస్టు9(మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, పోరాట చరిత్రను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేట స్థానిక కూడలిలో ఏర్పాటు చేసిన ఆదివాసీ వీరుడు, హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క ఘనంగా ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు కొమరం భీమ్ పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీ సమాజం కోసం, వారి హక్కుల కోసం, వారి ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

**ఆదివాసీ జాతి ఔన్నత్యాన్ని చాటిన మహనీయుడు కొమరం భీమ్**

కొమరం భీమ్ కేవలం ఒక వ్యక్తి కాదని, ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీ జాతి ఔన్నత్యాన్ని, కీర్తిని, హక్కులను కాపాడేందుకు ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తన జీవితాన్ని గిరిజనుల హక్కుల కోసం అంకితం చేసిన కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. అశ్వారావుపేట వంటి ఆదివాసీ ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం గర్వకారణమన్నారు. కొమరం భీమ్ ఆశయాలను కేవలం విగ్రహాలకే పరిమితం చేయకుండా ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మనది పోరాటాల చరిత్ర ఆదివాసీ సమాజ చరిత్ర అంతా పోరాటాల చరిత్రేనని మంత్రి సీతక్క అన్నారు. అడవిలో మన పూర్వీకులు జీవనం మొదలుపెట్టిన నాటి నుంచి చెట్టుతో, పుట్టతో, వానలతో, వరదలతో, జంతువులతో పోరాడుతూ పోరాడుతూ ఇక్కడి వరకు వచ్చారని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై జీవిస్తూ అడవిని కాపాడుతూ, ప్రకృతి సంపదను పరిరక్షిస్తూ తరతరాలుగా ఆదివాసీ సమాజం తన ప్రత్యేక జీవన విధానాన్ని కొనసాగించిందన్నారు. అడవులు, కొండలు, వాగులు, చెరువులు, నదులతో కలిసి జీవిస్తూ ఎన్నో తరాలుగా ప్రకృతిని సంరక్షిస్తున్న ఆదివాసీలు దేశ సంస్కృతిలో కీలక భాగమని అన్నారు. సమ్మక్క-సారలమ్మ నుంచి కొమరం భీమ్ వరకు చరిత్రలో ఆదివాసీ సమాజం చేసిన పోరాటాలను మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాకతీయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క-సారలమ్మ నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కొమరం భీమ్ వరకు అనేక మంది ఆదివాసీ వీరులు తమ హక్కుల కోసం పోరాటాలు చేశారని తెలిపారు. సమానత్వం, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, భూమి-అడవి-జలాలపై హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు జరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ సమాజం చేసిన పోరాటాలను చరిత్రలో గుర్తించి, వారి హక్కులను కాపాడే విధంగా ప్రభుత్వాలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**రాజ్యాంగం కల్పించిన హక్కులను కచ్చితంగా అమలు చేయాలి**

భారత రాజ్యాంగం ఆదివాసీ సమాజానికి అనేక ప్రత్యేక రక్షణలు, హక్కులను కల్పించిందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రత్యేక స్వయం ప్రతిపత్తి, భూహక్కులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి అంశాల్లో రాజ్యాంగం ఆదివాసీలకు రక్షణ కల్పించిందన్నారు. ఆదివాసీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు ఆయా ప్రాంతాలకు ప్రత్యేక రక్షణలు కల్పించారని చెప్పారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాలకు ఆరో షెడ్యూల్ వంటి రాజ్యాంగపరమైన రక్షణలు కల్పించబడ్డాయని వివరించారు. అయితే రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం వల్లే ఆదివాసీ సమాజం అనేక సంవత్సరాలుగా భూమి, ఉపాధి, అభివృద్ధి, ఇతర సమస్యలను ఎదుర్కొంటూ వస్తోందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక అవకాశాలను ఆదివాసీలు వినియోగించుకునే హక్కు కలిగి ఉన్నారని, వాటిని ప్రతి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందని మంత్రి స్పష్టం చేశారు.

**ఎవరితోనూ శత్రుత్వం లేదు.. హక్కుల కోసం మాత్రమే పోరాటం**

ఆదివాసీ సమాజానికి ఇతర కులాలు, ఇతర ప్రాంతాల ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఏ కులాన్ని మనం ద్వేషించాల్సిన అవసరం లేదు. ఏ ప్రాంత ప్రజలను వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రం మేము అడుగుతాం అని అన్నారు. ఆదివాసీ ప్రాంతాలకు వచ్చిన ప్రతి ఒక్కరినీ అక్కున చేర్చుకున్న చరిత్ర తమదని పేర్కొన్నారు. ఎవరికీ వ్యతిరేకంగా పోరాటం చేయడం తమ ఉద్దేశం కాదని, రాజ్యాంగబద్ధంగా తమకు రావాల్సిన హక్కులను సాధించుకోవడమే తమ లక్ష్యమని తెలిపారు. హక్కుల కోసం ప్రశ్నించడం, న్యాయం కోరడం ప్రతి పౌరుడి హక్కు అని అన్నారు.

**అల్లూరి సీతారామరాజు పోరాటం కూడా ఆదర్శం**

మన్యం బిడ్డల కోసం పోరాడిన గిరిజనేతర నాయకుడు అల్లూరి సీతారామరాజును మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆదివాసీల కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నేటికీ మన్యం ప్రాంతాల్లో ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదివాసీ సమాజం ఎవరినీ వ్యతిరేకించలేదని, తమ ప్రాంతాలకు వచ్చిన వారిని సైతం అక్కున చేర్చుకున్నారని అన్నారు. అయితే తమ హక్కులను కాపాడుకోవడంలో మాత్రం రాజీపడబోమని స్పష్టం చేశారు.

**ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడవి బిడ్డలు, పేదలు, బడుగు బలహీన వర్గాల పట్ల ప్రత్యేకమైన అభిమానం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. బీసీల సమస్యలను గుర్తించి కులగణన నిర్వహించడం వంటి కీలక నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుందని చెప్పారు. దళిత సమాజంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అదేవిధంగా ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి స్థాయిలో నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో భూముల సమస్యలు, హక్కుల సమస్యలు, సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఆదివాసీలకు సంబంధించిన భూముల సమస్యలు అత్యంత కీలకమైనవని మంత్రి సీతక్క అన్నారు. భూమితోనే ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, ఆర్థిక పరిస్థితులు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయబద్ధమైన పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఆదివాసీ కుటుంబాలు తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు స్పందించాలని సూచించారు.

**భాష, వేషధారణ, సంస్కృతే ఆదివాసీల అస్థిత్వం**

ఆదివాసీల భాష, వేషధారణ, ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి వారి అస్థిత్వానికి ప్రతీకలని మంత్రి సీతక్క అన్నారు. ఆధునికత వైపు అడుగులు వేస్తున్నప్పటికీ తమ మూలాలను, సంప్రదాయాలను మరిచిపోకూడదని సూచించారు. ఆదివాసీ సంస్కృతి కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైనది కాదని, దేశ సాంస్కృతిక వైవిధ్యంలో ఒక గొప్ప భాగమని పేర్కొన్నారు. తమ భాషను పిల్లలకు నేర్పించాలని, సంప్రదాయాలను కొనసాగించాలని, ఆదివాసీ కళలు, జానపదాలు, ఆచారాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన గొప్ప ఆస్తి మన సంస్కృతి అని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీ యువత విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. కొమరం భీమ్ వంటి మహనీయుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అశ్వారావుపేటలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివాసీ సంస్కృతి, చరిత్ర, హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచేలా సాగాయి. కొమరం భీమ్ విగ్రహావిష్కరణతో స్థానికంగా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కొమరం భీమ్ విగ్రహానికి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ హక్కులు, సంస్కృతి, సంక్షేమంపై నాయకులు మాట్లాడారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు జల్-జంగల్-జమీన్, జై కొమరం భీమ్ అంటూ నినాదాలు చేశారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ, సంస్కృతి పరిరక్షణ, భవిష్యత్ తరాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని మంత్రి సీతక్క పిలుపునిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కన్నులపండువగా బోనాల జాతర

**కొత్తగూడెం టౌన్, ఆగస్టు 9 (మనం న్యూస్) :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం పరిధిలో మెదర్బస్తీ ప్రాంతంలో బోనాల జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శేషు స్వామి, బట్టు దుర్గల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. మెదర్బస్తీ నుంచి ప్రారంభమైన బోనాల శోభాయాత్ర పెద్దబజారు, సూపర్బజారు మీదుగా రైతుబజార్లోని శ్రీ పోచమ్మ దేవాలయం వరకు సాగింది. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పుల వాయిద్యాల నడుమ బోనాలతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పోతురాజుల విన్యాసాలు, శివ శక్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా బోనాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. మహిళలు తలపై బోనాలు మోస్తూ పోచమ్మ దేవాలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బానోత్ కళావతి, వట్టం విజయ, కంగళ రామలక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బోనాల నిర్వహణ పెద్దలు శేషు స్వామి, దుర్గ లు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఇంతటి ఘనమైన జాతర జరగడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం జాతరకు తరలివచ్చిన భక్తులు, స్థానికుల కోసం నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్తీ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. జాతర విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



### కోయగూడెం జె.వి.ఆర్-3 బొగ్గు బ్లాకులను

# సింగరేణికి కేటాయించాలి

### ఏళ్ల తరబడి నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తిని వెంటనే ప్రారంభించాలి

### కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి విజ్ఞప్తి

### సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 9(మనం న్యూస్):** కోయగూడెం ఓసి-3, జే వి ఆర్ ఓ సి-3 బొగ్గు బ్లాకులను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సి సి ఎల్ )కు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బి ఎం ఎస్)కార్యదర్శి నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు పి.మాధవ నాయక్, ఎస్ సి ఎంకేఎస్ అధ్యక్షులు అప్పానీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమార్ స్వామి ఆదివారం స్వయంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి యాజమాన్యాన్ని ఈ బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలో పాల్గొనకుండా అడ్డుకుని ప్రైవేట్ సంస్థలకు కేటాయించే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. సింగరేణికి కొత్త గనులు అందుబాటులోకి రాకపోవడంతో ఇప్పటికే ఉన్న గనుల బొగ్గు నిల్వలు తగ్గిపోతున్నాయని కొన్ని గనులు మూసివేత దశకు చేరుకోవడంతో ఈ ఏడాది సుమారు 12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన కోయగూడెం, జేవిఆర్ ఓసి-3 బ్లాకుల్లో ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాకపోవడానికి భూసేకరణ సమస్యలు చట్టపరమైన వివాదాలు గిరిజన ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన నియంత్రణలు స్థానిక సమస్యలు వివిధ అనుమతుల్లో జాప్యం వంటి కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇల్లందు ప్రాంత భవిష్యత్తుకు కోయగూడెం ఓసి-3 కీలకమన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పుట్టినిల్లు అయిన ఇల్లందు ప్రాంతం నేడు కొత్త గనులు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలిపారు. గనులు తగ్గిపోవడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులను ఇతర ఏరియాలకు బదిలీ చేస్తున్నారని ఫలితంగా స్థానిక ప్రజల ఉపాధి అవకాశాలు ఆ ప్రాంత ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కోయగూడెం, జేవిఆర్ బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే ఈ ప్రాంతానికి సమీపంలోని బొగ్గు వనరులను వినియోగించుకోవడంతో పాటు కార్మికులకు ఉద్యోగ భద్రత స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. సింగరేణికి కేటాయిస్తే అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ బ్లాకులు సింగరేణికి లభిస్తే ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు భారీ యంత్రాలు రవాణా వ్యవస్థలు స్థానిక భౌగోళిక పరిజ్ఞానం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. సమీపంలోని ఖాళీ గని ప్రాంతాలను ఓవర్బర్డెన్ డంపింగ్కు వినియోగించడం ద్వారా భూసేకరణ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. దీంతో బొగ్గు ఉత్పత్తి పెరిగి దక్షిణ భారత విద్యుత్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా బలోపేతం అవుతుందని సింగరేణి ఉద్యోగుల భద్రతతో పాటు రాష్ట్ర దేశ ఆర్థిక ప్రయోజనాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇటీవల మణుగూరు డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ ప్రాజెక్టు బొగ్గు గని సింగరేణికి దక్కేలా చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ తెలపడంతో పాటుగా అదే తరహాలో కోయగూడెం, జివిఆర్-3బొగ్గు బ్లాకుల విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కేటాయింపులపై సమగ్ర సమీక్ష జరిపి చట్టపరంగా సాధ్యమైన విధానాల ప్రకారం అవసరమైతే డీ-అలోకేషన్ చేసి పునఃకేటాయింపు లేదా పునఃవేలం ద్వారా సింగరేణికి అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పుట్టినిల్లు అయిన ఇల్లందు ప్రాంతాన్ని కాపాడుకోవాలని సంవత్సరాల తరబడి ఉపయోగంలోకి రాని బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయిస్తే బొగ్గు ఉత్పత్తితో పాటు కార్మికుల ఉద్యోగ భద్రత స్థానిక ప్రజల ఉపాధి సింగరేణి భవిష్యత్తు బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ కమిటీ మెంబర్ పులి రాజారెడ్డి, అధ్యక్షులు అప్పాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమార్ స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జీవీ కృష్ణారెడ్డి, కోశాధికారి సాయి వేణి సతీష్, ఇల్లందు ఏరియా కార్యదర్శి లీలా కృష్ణ, భూపాల్ పల్లి ఏరియా ఉపాధ్యక్షులు సుజేందర్, భూపాల్ పల్లి కార్యదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం'

- కొమరం భీం సర్కిల్ గా నామకరణం
- ఆదివాసీ జెండాను ఆవిష్కరించిన కొమరం బుచ్చయ్య, కుంజ సమ్మయ్య



**భద్రాద్రి కొత్తగూడెం ఆగస్టు 09 (మనంప్రతినిధి):** ఆదివాసీ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రంలోని కొమరం భీం సర్కిల్ వద్ద 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవ' వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై, గిరిజన విప్లవ వీరుడు కొమరం భీం పునర్నిర్మిత విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమరం బుచ్చయ్య, కుంజ సమ్మయ్యలు ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, ఆత్మగౌరవ పోరాటాలకు కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. 'జల్, జంగల్, జమీన్' సాధన కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన అమరవీరుడు కొమరం భీం ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గిరిజనుల చట్టబద్ధమైన హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ వేడుకల్లో ఆదివాసీ తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గిరిజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మరియు ఆదివాసీ సోదర సోదరీ మణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బంగారం రాగి అన్వేషణకు సింగరేణి తొలి అడుగు

### అన్వేషణ ప్రారంభానికి కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖతో ఒప్పందం

### ఐదేళ్లలో అన్వేషణ పూర్తి చేయడానికి కసరత్తు

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 9(మనం న్యూస్):** సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, యాదగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్న దేవదుర్గ బ్లాక్ లో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణలో మరో కీలక ముందడుగు వేసింది. గతంలో ఈ అన్వేషణకు కేంద్ర ప్రభుత్వ వేలంలో లైసెన్స్ పొందిన నేపథ్యంలో ఇప్పుడు అన్వేషణ పనులు ప్రారంభించేందుకు కర్ణాటక రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖతో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. నాలుగు రోజుల కిందట బెంగళూరులోని కర్ణాటక మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యాలయంలో కర్ణాటక డీఎంజీ డైరెక్టర్ రంగప్ప, సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం సింగరేణి సంస్థకు లైసెన్స్ లభించిన దేవదుర్గ ప్రాంతంలోని 199.13 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అన్వేషణను ఐదేళ్లలో పూర్తి చేయడానికి అంగీకారం కుదిరింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేవదుర్గ ప్రాంతంలోని బంగారం, రాగి ఖనిజాల అన్వేషణకు సింగరేణి గతంలోనే లైసెన్స్ సాధించిందని ఇప్పుడు వాస్తవ అన్వేషణ కార్యక్రమం ప్రారంభించేందుకు అవసరమైన ఒప్పందం కుదిరిందన్నారు. ఇప్పటికే అధికారులను నియమించామని త్వరలో మిగిలిన అధికారులు సిబ్బందిని కూడా నియమించి రెండేళ్లలోపు అన్వేషణను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రంలో ఈ స్థాయిలో ఖనిజ అన్వేషణ చేపట్టడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్న ఆయన 13 దశాబ్దాల అన్వేషణ అనుభవం కలిగిన సంస్థగా ఈ కొత్త ప్రాజెక్టును కూడా విజయవంతంగా పూర్తి చేస్తామనే పూర్తి విశ్వాసం తమకు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సహకారం అందించిన కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి మైన్స్ అండ్ జియాలజీ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అన్వేషణ కార్యక్రమంలో భాగంగా రిమోట్ సెన్సింగ్ జియోలాజికల్ మ్యాపింగ్ జియోఫిజికల్ సర్వేలు నిర్వహించి ఎంపిక చేసిన ప్రాంతాల్లో స్కౌట్ డ్రిల్లింగ్ చేపడతారు. అనంతరం సేకరించిన నమూనాలపై పెట్రోగ్రాఫిక్ మినరలాజికల్ అధ్యయనాలు నిర్వహిస్తారు. ఈ నమూనాలపై సమగ్ర మూలకాల విశ్లేషణను కొత్తగా కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సింగరేణి జియోసైన్స్ ల్యాబొరేటరీలో చేపట్టనున్నారు. అనంతరం సమగ్ర నివేదికను కర్ణాటక మైన్స్, జియాలజీ శాఖకు సమర్పిస్తారు. ఆ నివేదిక ఆధారంగా మరింత విస్తృత స్థాయి అన్వేషణ చేపట్టే అవకాశం ఉంటుంది.

## అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన

### ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, ఆగష్టు 09(మనం న్యూస్):** దమ్మపేట మండలాల లోని వివిధ గ్రామాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,తో కలిసి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం గిరిజన విద్యార్థులకు ఉపయోగపడేలా గిరిజన విద్యార్థుల కేంద్రం వద్ద రూ.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం దమ్మపేట మండలం మారప్పగూడెం గ్రామంలో సహాయక సంఘ మహిళల కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. తదుపరి నాచారం గ్రామంలో సుమారు రూ.కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధితో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామాల అభివృద్ధి స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న కృషిని వివరించారు అనంతరం నాగుపల్లి గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు చిన్నారులకు మెరుగైన వసతులు పౌష్టికాహారం మహిళలు పిల్లలకు అవసరమైన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాట్లాడుతూ దమ్మపేట మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు మంత్రి సీతక్క సహకారంతో నియోజకవర్గంలో అవసరమైన మౌలిక వసతులు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్, జిల్లా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

# నేడు జగిత్యాలలో జైల్ భరో...

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ

జగిత్యాల, ఆగష్టు 09 ( మనం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా సీఐటీయూ,, అఖిల భారత కిసాన్ సభ , అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నాటి భారత క్విట్ ఇండియా స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జైల్ భరో కార్యక్రమం లో భాగంగా జగిత్యాల జైల్ భరో కార్యక్రమాన్ని తరలి రండి అని తెలంగాణ రైతు సంఘం సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ రాష్ట్ర పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నేడు ఆగస్టు 10 తేదీ సోమవారం ఉదయం 12 గంటలకు జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో వేలాది మంది కార్మికులు రైతులు, వ్యవసాయ కూలీలతో జైల్ భరో కార్యక్రమంలో భాగంగా రాస్తారోకో నిర్వహిస్తున్నాము అని తెలిపారు. రాస్తరోకో కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలి అని కోరారు

# మాచాపురంలో జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం



నందవరం ఆగస్టు 9 మనం న్యూస్ః నందవరం మండల పరిధిలోనే స్థానిక మాచాపురం గ్రామంలో జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం టిడిపి మండల అధ్యక్షులు కాసింవలి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది . టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారంగా నిరుపేదలకు ఉద్యోగాలు అందించారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ సక్సెస్ చేసినాడని తెలియజేశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ బడే సబ్ గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నార

# బుచ్చమ్మ తోటలో తనిఖీలు



మహానంది, ఆగస్టు9,మనంన్యూస్: నంద్యాల జిల్లా మహానంది మండల పరిధిలోని బుచ్చమ్మ తోటలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం జిల్లా ఎస్ పి సునీల్ షోరాన్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్ పి సుస్మిత ఆధ్వర్యంలో ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి,పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు కార్టన్ అండ్ సర్చ్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలలో ,అనుమానాస్పద ప్రాంతాలలో తనిఖీలు చేపట్టారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మెగా డీఎస్సీపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు



గడివేముల, ఆగష్టు 9మనం న్యూస్ః మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి లేదని టిడిపి సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి ఓటమిపాలైన తరువాత పిచ్చి పరాకాష్టకు చేరిందని, జన్ జి పేరుతో మెగా డీఎస్సీ పై గొడ్డలి పార్టీలోని వారంతా సైకోల వ్యవహరిస్తున్నారని అన్నారు. జగన్కు చెందిన రాజకీయ పార్టీ ముసుగులో క్రిమినల్స్ తయారు చేయడం వారిని పోలీసులు అరెస్టు చేస్తే ఓదార్పు పేరుతో ప్రజలను బలి చేయడం జగన్ రెడ్డి కు అలవాటుగా మారిందని మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలకు వెళ్లిన విద్యార్థులు ఎవరు కాకుండా వైసిపి కార్యకర్తలు ధర్నాలు చేయడం హాస్య స్పందంగా ఉందని అన్నారు. మెగా డీఎస్సీ పరీక్షలు పారదర్శకంగా జరిగాయని, ప్రతిదానికి రిజర్వేషన్ ప్రకారంగా ఉద్యోగాలు ఇచ్చామని, వాస్తవాలు చూపించినప్పటికీ, దీని తర్వాత స్పోర్టప్స్ కోటలో అక్రమాలు జరిగాయని, వైసిపి నాయకులు హైకోర్టు ఫీల్ వేసిన దానికి ప్రాథమిక ఆధారాలు చూపించకుండా, ఇటువంటి ఫిల్ వల్ల కోర్టుకు విలువైన సమయం వృధా అవుతుందని గట్టిగా మొట్టికాయలు పెట్టినప్పటికీ వీరికి సిగ్గు లేదని అన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ ను రాజీనామా చెయ్యమనడం నీతి మాలిన చర్యని మండిపడ్డారు.

# విద్య ప్రైవేటీకరణ- కాషాయీకరణను తిప్పికొడతాం




కర్నూలు ఆగస్ట్ 09మనం న్యూస్ : ఐసా - సిపిఐ (ఎమ్ ఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ 36 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా విక్టరీ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎమ్ ఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ రసూల్, ఐసా రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున పాల్గొని జెండా ఆవిష్కరించారు...విద్య, ప్రగతి, ప్రజాస్వామ్యం లక్ష్యాలతో 1990 ఆగస్ట్ 9 ఉత్తరప్రదేశ్ అలహాబాద్ లో ఏర్పడిన ఐసా నేటికి 36 సంవత్సరాలు పూర్తి చేసుకుని దేశవ్యాప్తంగా విద్యార్థుల హక్కుల కోసం నిరంతర పోరాటాలను నిర్మిస్తోందన్నారు. భగత్సింగ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ లక్ష్యాలను కామ్రేడ్ చంద్రశేఖర్ విప్లవ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఐసా కృషి చేస్తోంది.పేద, మధ్యతరగతి, అణగారిన వర్గాల విద్యార్థులకు విద్యను అందుబాటులో ఉంచేందుకు, ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు ఐసా ముందుండి పోరాడుతోందని తెలిపారు.

# రుద్రప్ప నివాళ్లర్పించిన వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు



కౌతాళం,ఆగష్టు 09 మనం న్యూస్ : కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది.వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కామవరం మహేంద్ర రెడ్డి కౌతాళం వైసిపి మండలం కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,మాజీ సర్పంచ్ పాల్ దినకర్, సక్రితిక్కయ్య,వడ్డే రాము,అవతారం మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కామవరం టీడీపీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కన్నుమూత



కౌతాళం, ఆగష్టు 09 మనం న్యూస్: కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది.వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప మరియు ఉరుకుంద కొట్రేష్ గౌడ్ మరియు రాజబాబు కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# డీఎస్సీపై వైసీపీ నేతలకు ఎందుకీ అక్కసు



నందవర, ఆగస్టు 9 మనం న్యూస్ః నందవరం మండల పరిధిలోని స్థానిక మాచాపురం గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ ఖాసింవలి ఇంటి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మెగా ఖిఇ ద్వారా యువతకు ఉద్యోగాలు వస్తుంటే వైసీపీ నేతలకు ఎందుకు కడుపుమంట. ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించడాన్ని కూడా రాజకీయంగా చూడటం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు రావడం చూసి సంతోషించాల్సింది పోయి, రాజకీయ బురద జల్లడం వైసీపీకి అలవాటుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో యువత ఎదుర్కొన్న నిరాశను ప్రజలు మర్చిపోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, దాన్ని కూడా జీర్ణించుకోలేక విమర్శలు చేయడం వారి అసహనాన్ని బయటపెడుతోందన్నారు.

# సూట్ రూమ్ నిర్మాణానికి 5.50లక్షల విరాళం



మహానంది, ఆగస్టు9,మనంన్యూస్ః మహానంది పుణ్యక్షేత్రం లో నిర్మాణం చేపట్టబోతున్న సూట్ రూమ్ ల నిర్మాణానికి దాత ముందుకు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వాహనాదికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ కు చెందిన యలమంచిలి నవీన్, నాగిని దంపతులు వసతి గృహనిర్మాణానికి 5లక్షల 50 వేల రూపాయలు ఈఓ శ్రీనివాస రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి,పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో అందజేశారు.15లక్షల సూట్ రూమ్ నిర్మాణానికి దాత ముందస్తుగా ఈ నగదును అందజేసినట్లు తెలిపారు. దాత దంపతులను ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ, ఏ ఈఓ మధు, సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, నీలఖంటేశ్వర రాజు,టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అండ



- ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం ఆగష్టు 9 మనం న్యూస్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాయదుర్గం పట్టణంలోని 31వ వార్డులో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాయదుర్గం పట్టణంలో అధిక సంఖ్యలో చేనేత కార్మికులు 'నేతన్న సేవలో' పథకానికి అర్హత సాధించడం సంతోషకరమన్నారు. అర్హులైన చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరైందని, సోమవారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుందని తెలిపారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్ల ద్వారా అండగా నిలుస్తోందన్నారు. ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు, 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, వార్డు ఇన్చార్జి ఎల్లప్ప తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామేశ్వరి అమ్మవారికి సారె చీర



మహానంది, ఆగస్టు9,మనంన్యూస్ః మహానంది క్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి నంద్యాల కు చెందిన వాసవి మహిళా మండలి సేవాసమితి సభ్యులు సారె చీరను అందజేశారు. ఆశాడ మాసం సందర్భంగా నంద్యాల కు చెందిన వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తాడువాయి ఇందుమతి ఆధ్వర్యంలో దాదాపు 80మంది మహిళలు పాల్గొని చీర, సారేతో పాటు పిండి వంటలను సమర్పించారు. అలాగే స్వామివారికి, సీతారాముల వారికి వస్త్రాలను సమర్పించారు. నంది మండలంలో ఏర్పడిన నవనందులను దర్శించుకుంటు సారె చీరను భక్తి శ్రద్ధలతో సమర్పించారు.అంతకుముందు మహానంది క్షేత్రానికి చేరుకున్న వీరికి సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ లు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో శోభారాణి, సువర్ణ, రాధకుమారి, మనోహరి, సరిత, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి పాటుపడతాం



మహానంది, ఆగస్టు9, మనంన్యూస్: మహానంది దేవస్థానం అభివృద్ధికి తమశక్తి మేరకు పాటు పడతామని పాలక మండలి చైర్మన్ నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డి తో పాటు సభ్యులు తెలిపారు.నూతనంగా ప్రమాణ స్వీకారోత్సవం చేసిన పాలక మండలి సభ్యులు ఆదివారం మొదటి సారిగా ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమంతో పాటు ఆలయ అభివృద్ధి పై సమావేశం నిర్వహించారు. అంతకు ముందు శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు చైర్మన్ గా నరాల చంద్ర మౌళీశ్వర రెడ్డిని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నీల ఖంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, మల్లయ్య,మహానంది మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కంచర్ల శివ శంకర చౌదరి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున శెట్టి, బిసి సంక్షేమ సంగం నాయకులు లక్ష్మీ నారాయణ గౌడ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ రాజీనామా చేయాలి..



- డీఎస్సీపై సీబీఐ విచారణ జరపాలి
- సవితపై ఉషశ్రీ చరణ్ ఫైర్!

గోరంట్ల, ఆగస్టు 9 మనం న్యూస్: డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు, అవకతవకలపై సమగ్ర సీబీఐ విచారణ జరపాలని, ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గోరంట్లలో నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ రాజకీయంగా వేడెక్కింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ అధికార పక్షంపై, ముఖ్యంగా మంత్రి సవిత, ఆమె అనుచరులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు

# వర్షాలు సమృద్ధిగా కురవాలని శ్రీ కాటి కోటేశ్వర స్వామికి పాదయాత్ర

- మాల్యవంతం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర



బత్తలపల్లి, ఆగష్టు 8 మనం న్యూస్ : మండల పరిధిలోని మాల్యవంతం గ్రామ ప్రజలు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు సస్యశ్యామలంగా ఉండాలని కోరుకుంటూ భక్తిశ్రద్ధలతో శ్రీ కాటి కోటేశ్వర స్వామి సన్నిధికి పాదయాత్ర నిర్వహించారు.శనివారం ఉదయం మాల్యవంతం గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభమై సాయంత్రానికి తాడిమర్రి మండలం చిల్ల కొండాయపల్లి మీదుగా చిల్లవారిపల్లి గ్రామంలోని శ్రీ కాటి కోటేశ్వర స్వామి సన్నిధికి చేరుకున్నారు. అక్కడ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆదివారం ఉదయం స్వామివారి సన్నిధి నుంచి తిరుగు పాదయాత్రను ప్రారంభించారు. మార్గమధ్యంలోని గ్రామాల వద్ద భక్తులు భజనలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో పాదయాత్ర కొనసాగించారు.తిరుగు పాదయాత్ర ఆదివారం సాయంత్రానికి బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చేరుకుంది.ఈ సందర్భంగా మాల్యవంతం గ్రామ ప్రజలు మాట్లాడుతూ శ్రీకాటి కోటేశ్వరస్వామి ఆశీస్సులతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని, గ్రామ ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నామని తెలిపారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పాదయాత్రలో మాల్యావంతం గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్ ఆగస్టు 09 : మనం న్యూస్ : మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో 'మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100' అనే బ్యానర్ను ఏర్పాటు చేయాలన్నారు.

# డీఎస్పీ కౌన్సిలింగ్ ఒక్కటైన దంపతులు

- విడాకులు పొందిన జంటకు కొత్త జీవితం
- అర్ధరాత్రి దాకా సహనంతో కౌన్సిలింగ్
- ఇరు కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం



ముదిగుబ్బ ఆగస్ట్ 9 మనంన్యూస్ః 'పోలీసు అధికారులు అనుకోవాలే కాని ఏదైనా సాధిస్తారనడానికి ఇదొక నిదర్శనం.. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలేర్పడి వారు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కారు.. విచారించిన న్యాయస్థానం తప్పని పరిస్థితుల్లో విడాకులు మంజూరు చేసింది. దీంతో వారు ఎడబాటుగా జీవిస్తున్నారు. కొన్నాళ్ళకు మళ్లీ తన భర్తతో జీవితాన్ని ఆశించిన భార్య తమ గ్రామానికి వెళ్లిన డీఎస్పీ జనార్ధన్ రావు దృష్టికి తీసుకెళ్ళింది. దీంతో మానవతా దృక్పథంతో వెంటనే స్పందించిన డీఎస్పీ దంపతులకు కలిపేందుకు చర్యలు తీసుకున్నారు. బెంగళూరులో నివసిస్తున్న ఆమె భర్తను ఇక్కడికి పిలిపించి తమదైన శైలిలో కౌన్సిల్లింగ్ ఇచ్చి వారిని ఒక్కటి చేసారు.... దీంతో ఇరు కుటుంబాల్లో అంతులేని ఆనంద క్షణాలు వెల్లివిరిసాయి. ఇలాంటి అరుదైన ఘటన ముదిగుబ్బ మండలంలో చోటుచేసుకుంది.

# గొంతెండుతోంది...నీటి కష్టాలు పట్టవా..?



- ప్రజల గోడు వినిపించదా..?

రాయదుర్గం ఆగష్టు 9 మనం న్యూస్, : పట్టణంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రత రమవుతున్నా మున్సిపల్ యంత్రాంగం మాత్రం తాత్కాలిక చర్యలకే పరిమితమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనేకల్ ఎస్.ఎస్. ట్యాంక్లో నీటిమట్టం అడుగంటడంతో ప్రస్తుతం చాలా తక్కువ మోతాదులోనే నీటిని పంపింగ్ చేస్తున్నామని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. దీంతో పట్టణ ప్రజలకు అవసరమైన పరిమాణంలో నీటిని సరఫరా చేయడం సాధ్యం కావడం లేదని తెలిపారు. హెచ్.ఎల్.సి. కాలువకు నీరు వచ్చే వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని కమిషనర్ ప్రకటించారు. అయితే ప్రజలకు తాగునీరు అందించడంలో ముందస్తు ప్రణాళిక, ప్రత్యామ్నాయ నీటి వనరుల ఏర్పాటు, అత్యవసర చర్యలు ఎక్కడని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# సిరాజ్ హ్యాట్రిక్ సిక్సర్స్.. టీమిండియా గెలుపు



శ్రీలంక క్రికెట్ ఎలెవెన్ తో జరిగిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్ లో టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 207 పరుగుల లక్ష్యాన్ని భారత్ 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

తొలి ఇన్నింగ్స్ లో డకౌటైన యశస్వి జైస్వాల్ (61 రిటైర్డ్ హర్ట్) మెరుపు అర్ధ సెంచరీ చేసి భారత గెలుపుకు గట్టి పునాది వేశాడు. గాయం కారణంగా తొలి ఇన్నింగ్స్లో బ్యాటింగ్కు దిగని కెప్టెన్ శుభ్ మన్ గిల్ కీలక ఇన్నింగ్స్ (44) ఆడాడు. ఆఖర్లో సిరాజ్ (32 నాటౌట్; ఫోర్, 4 సిక్సర్లు) హ్యాట్రిక్ సిక్సర్స్ తో విరుచుకుపడి భారత్ను విజయతీరాలకు చేర్చాడు.

**టార్గెట్ 207**

లంక ఎలెవెన్ జట్టు రెండో ఇన్నింగ్స్ లో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసి, టీమిండియా ముందు 207 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. నిషాన్ మధుష్క (63 రిటైర్డ్ హర్ట్) అర్ధ సెంచరీతో రాణించగా.. అంజల బండార (35), నిపున్ ధనంజయ (46) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్, రవీంద్ర జడేజా తలో 2 వికెట్లు తీయగా.. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ దక్కించుకున్నారు.

**పడిక్కల్ అజేయ శతకం**

భారత్ తొలి ఇన్నింగ్స్ను 357 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (142 నాటౌట్) అజేయ సెంచరీతో సత్తా చాటాడు. రవీంద్ర జడేజా (63 రిటైర్డ్ హర్ట్) అర్ధ సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్ (40), మానవ్ సుతార్ (41), గుర్నూర్ బ్రార్ (36 నాటౌట్), సర్ఫాన్ జైన్ (22 రిటైర్డ్ హర్ట్) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో అసంక మనోజ్, రమేశ్ మెండిస్ తలో 2 వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువంత చెరో వికెట్ దక్కించుకున్నారు.

దీనికి ముందు శ్రీలంక తొలి ఇన్నింగ్స్ లో 8 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసి ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసింది. నిషాన్ మధుష్క (66), రవిందు రషాంత (71), సోనల్ దినుష (52) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ తలో 2 వికెట్లు తీయగా.. బ్రార్ చెరో వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఈ మ్యాచ్ తర్వాత భారత జట్టు శ్రీలంకతో రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ లోని తొలి టెస్ట్ మ్యాచ్ గాలే వేదికగా ఆగస్ట్ 15 నుంచి మొదలుకానుంది. రెండో టెస్ట్ కొలంబో వేదికగా ఆగస్ట్ 23న ప్రారంభం కానుంది.



# అప్పుడు కలవనివ్వలేదు.. ఇప్పుడు అదే హీరోతో!

మలయాళ నటి మమితా బైజు ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్ లో ఉంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. 'డ్యూడ్' 'జన నాయకన్' చిత్రాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ఈ శుక్రవారం(ఆగస్టు 14) ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కేరళలో శనివారం జరిగింది. ఇందులో మాట్లాడిన మమిత తన చిన్ననాటి జ్ఞాపకాలని గుర్తుచేసుకుంది.

'2015లో సూర్య ఓ కార్యక్రమం కోసం కొచ్చి వచ్చారు. అప్పుడు నేను ఎనిమిది, మా అన్నయ్య ఇంటర్ చదువుతున్నాం. సూర్యని చూసేందుకు అన్నయ్య తన స్నేహితులతో కలిసి కొచ్చి వెళ్లాడు. నేనూ వెళ్తానంటే మా తల్లిదండ్రులు పంపించలేదు. అన్నయ్య సూర్యతో ఫొటో దిగి చూపించాడు. నేను చాలా బాధపడ్డాను. ఇప్పుడు అదే హీరోతో కలిసి నటించే అవకాశం దక్కింది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్లో సూర్యతో కలిసి ఒకే వేదికపై నిలబడటం అదృష్టంగా భావిస్తున్నాను' అని మమిత చెప్పుకొచ్చింది. అభిమానిగా సూర్యని చూడాలనుకున్న తనకు.. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప ఆశీర్వాదమని పేర్కొంది.

వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 45 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడటం అనే కాన్సెప్ట్తో తెరకెక్కించారు. ఇందులో రవీనా టాండన్, రాధికా శరత్కుమార్, నాజర్ తదితరులు కీలక పాత్రలు చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించాడు.

# వైభవ్‌కు నిజంగానే 15 ఏళ్లేనా? అనుమానాలపై బ్రెట్ లీ ఆసక్తికర కామెంట్స్



ప్రపంచ క్రికెట్ లో వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్. కేవలం 15 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగు పెట్టాడు. ఈ క్రమంలో ఆసీస్ మాజీ స్టార్ పేసర్ బ్రెట్ లీ వైభవ్ టాలెంట్ పై ప్రశంసల వర్షం కురిపించాడు. సూర్యవంశీ వయసుపైనా బయట చాలా అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించాడు. కానీ, అతడి నైపుణ్యం, ఫామ్ ను చూస్తుంటే ముచ్చటేస్తోందని తెలిపాడు.

''వైభవ్ సూర్యవంశీ ఓ అద్భుతం. విదేశాల్లో చాలా మంది వైభవ్ వయసు గురించి ప్రశ్నిస్తూ ఉంటారు. అతడికి నిజంగానే 15 ఏళ్లేనా? ఎందుకంటే చూసేందుకు 17 లేదా 18 ఏళ్ల కుర్రాడిలా కనిపిస్తాడనేది వారి అభిప్రాయం. కానీ, నేనెప్పుడూ అతడి వయసు గురించి ఆలోచించలేదు. కేవలం బ్యాటింగ్ సత్తానే చూస్తా. అతడి ఏజ్ ఎంతైతే ఏంటి? కుర్రాడు అద్భుతమైన క్రికెట్ ఆడుతున్నాడు. భారత్ కు దొరికిన మంచి ఆటగాడు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆశిస్తున్నా. ఐపీఎల్ లోనే అతడి నైపుణ్యం ఏంటో చూశాం. సన్ రైజర్స్ పై 97 పరుగుల ఇన్నింగ్స్ సూపర్. ఆసీస్ కు చెందిన స్టార్ బౌలర్లపైనా విరుచుకుపడ్డాడు. క్రికెటింగ్ షాట్లకు పవర్ హిట్టింగ్ తోడైతే ఎలా ఉంటుందో అలా ఉంది. అయితే, అతడు ఇంకా చిన్న పిల్లాడే. లేనిపోని ఒత్తిడిని దరిచేరనీయొద్దు. హుక్ లేదా పుల్లర్ షాట్లను కొట్టే ఆటగాళ్లంటే నాకు ఇష్టం. వారికి బౌలింగ్ చేసేందుకు ఇష్టపడతా. పోటీ బాగుంటుంది. ఒక బంతికి సిక్స్ కొట్టినా నిరుత్సాహపడను. మళ్లీ అదే బాల్ వేసేందుకు ప్రయత్నిస్తా'' అని బ్రెట్లీ స్పష్టం చేశాడు.

**బెస్ట్ బ్యాటర్ సచిన్.. బెస్ట్ క్రికెటర్ కలిస్**

''క్రికెట్ లో అత్యుత్తమ బ్యాటర్ ఎవరంటే మాత్రం సచిన్ తెందుల్కర్ అని ఎప్పుడో చెప్పా. కానీ, బెస్ట్ క్రికెటర్ మాత్రం దక్షిణాఫ్రికా మాజీ ఆల్రౌండర్ జాక్వెలిస్ కలిస్ అని చెబుతా. అతడి గణాంకాలే ఆ మాట చెబుతాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించాడు. ఎంతటి క్లిష్టపరిస్థితులైనా కలిస్ చాలా ప్రశాంతంగా ఉంటాడు'' అని బ్రెట్ లీ తెలిపాడు.

# కియారాఅక్కడ కూడా అడుగు పెట్టనుందా?



భారతీయ సినిమాలో కోలీవుడ్ సినిమా ప్రత్యేక స్థానానికి చేరుకుంది. పలు తమిళ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తున్నాయి. అందుకే పలువురు ప్రముఖ బాలీవుడ్ బ్యూటీలు తమిళంలో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే ప్రియాంక చోప్రా నుంచి ఐశ్వర్యారాయ్, దిశా పటానీ వరకు పలువురు ఉత్తరాది భామలు తమిళ చిత్రాలు చేశారు. తాజాగా మరో టాప్ హీరోయిన్ దృష్టి కోలీవుడ్ పై పడినట్లు సమాచారం. ఆ బ్యూటీ ఎవరో కాదు టాక్సిక్ భామ కియారా అద్వానీ.

బాలీవుడ్లో అత్యధిక పారితోషికం అందుకుంటోన్న నటీమణుల్లో ఈమె ఒకరు. 2014లో ఫగ్లీ అనే చిత్రం ద్వారా కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత పలు భారీ చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్గా ఎదిగారు. హిందీ చిత్రాలు నటిస్తూనే టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చారు. అక్కడ మహేష్ బాబుకు జంటగా భరత్ అనే నేను చిత్రంతో ఎంట్రీ ఇచ్చి సక్సెస్ అందుకున్నారు. ఆ తర్వాత శంకర్ దర్శకత్వంలో రూపొందిన గేమ్ ఛేంజర్ చిత్రంలో రామ్ చరణ్తో జత కట్టారు. తాజాగా ఈమె కన్నడ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చి టాక్సిక్ చిత్రంలో యష్కు జంటగా నటించారు. ఈ చిత్రం త్వరలో తెరపైకి రానుంది.

ఇలా దక్షిణాదిలో తెలుగు, కన్నడం ప్రేక్షకులకు దగ్గరైన కియారా అద్వానీ దృష్టి ఇప్పుడు కోలీవ్పు పడినట్లు సమాచారం. ఒక తమిళ ప్రముఖ నటుడు ఈమెను కోలీవుడుకు పరిచయం చేసే ప్రయత్నంలో ఉన్నట్టు తెలిసింది. కథను కూడా చెప్పినట్లు, అందులో నటించడానికి కియారా అద్వానీ సుముఖంగా ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

# పోలీసులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు



ప్రస్తుతం 'రాకా' సినిమాతో బిజీగా ఉన్న అల్లు అర్జున్.. వైజాగ్ లో కనిపించాడు. తన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్ ని ఘనంగా ప్రారంభించాడు. హైదరాబాద్ లో ఇప్పటికే ఇలా ఓ మల్టీప్లెక్స్ ఉండగా.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ లాంచ్ చేశాడు. ఈ సందర్భంగా బన్నీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు వైజాగ్ రోడ్డుపై అస్సలు నడవలేకపోతున్నానని చెప్పుకొచ్చాడు. 'గంగోత్రి' రోజుల్లో వైజాగ్ రోడ్డుపై ఎవరూ నన్ను గుర్తుపట్టేవారు కాదు. ఇప్పుడు అదే రోడ్డుపై నడవలేకపోతున్నాను. 'రాకా' షూటింగ్ ముంబైలో జరుగుతోంది. వైజాగ్ ప్రజల కోసం ఒక రోజు బ్రేక్ అడిగి వచ్చాను. అయితే పోలీసులు నన్ను ఎయిర్ పోర్ట్ నుంచి పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు. వాళ్లకు థ్యాంక్స్' అని అన్నాడు. ఇక ఎదురుగా ఉన్న కొందరు అభిమానులు ఫొటో కావాలని అడగడంతో అందరూ ఇక్కడికి వచ్చేయండి అని స్టేజీపైకి ఆహ్వానించాడు. ఫ్యాన్స్ కి నో అని చెప్పటం నా వల్ల కాదమ్మా అని అన్నాడు. ఎనిమిది స్క్రీన్లు ఉన్న ఈ మల్టీప్లెక్స్లో 'పుష్ప'లో గడ్డం కింద చేయి పెట్టే పోజు ఉన్న బన్నీ బొమ్మని ప్రదర్శన కోసం ఉంచారు. అలానే అల్లు అర్జున్ కి సంబంధించిన పలు సినిమా స్టిల్స్ కూడా ఉంచారు. ఇకపోతే ప్రస్తుతం 'రాకా' చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ తన 23వ మూవీ చేయనున్నాడు. దీని ప్రీ ప్రొడక్షన్ వర్క్ హైదరాబాద్ లో జరుగుతోంది.

## నటిగా కాదు.. భార్యగా ఆ ఛాన్స్ వదులుకున్నా: ఐశ్వర్య



షారుఖ్ ఖాన్, దీపికా పదుకొణె జంటగా నటించిన 'హ్యాపీ న్యూ ఇయర్' సినిమా 2014లో ఎంత పెద్ద విజయం సాధించిందో చెప్పనక్కర్లేదు. అయితే ఈ సినిమాలో దీపికా పాత్రకు ముందుగా ఐశ్వర్యరాయ్ బచ్చన్ ను సంప్రదించారట దర్శకురాలు ఫరాఖాన్. కానీ ఆ సమయంలో భర్త అభిషేక్ బచ్చన్ తో కూడా నటిస్తుండటం, షారుఖ్ తో ఎక్కువ కెమిస్ట్రీ సీన్లు ఉండటంతో ఆమె ఆ అవకాశాన్ని తిరస్కరించిందట. ఓ ఇంటర్వ్యూలో ఐశ్వర్య మాట్లాడుతూ.. ''ఆరాధ్య పుట్టిన తర్వాత సినిమాలకు కొంత విరామం తీసుకున్నా. 'హ్యాపీ న్యూ ఇయర్' చేసి ఉంటే మంచి కంబ్యాక్ అయ్యేది. నటిగా ఆ అవకాశాన్ని వదులుకోవడం అంత సులభం కాదు. కానీ భార్యగా ఆ నిర్ణయం తీసుకున్నా'' అని చెప్పింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాగా ఐశ్వర్య చివరిగా 'పొన్నియిన్ సెల్వన్'లో కనిపించింది. ప్రస్తుతం ఆమె సినిమాలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీపికా విషయానికి వస్తే సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో షారుఖ్ ఖాన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'కింగ్' సినిమాలో నటిస్తోంది. దీంతో పాటు అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాలోనూ నటిస్తోంది.

# మహేశ్ బాబు బర్త్ డే స్పెషల్.. ఇంత సింపుల్‌గాఇచ్చారేంటి?

మహేశ్ బాబు- రాజమౌళి కాంబోలో వస్తోన్నమోస్ట్ అడ్వెంచరస్ మూవీ వారణాసి. ఇప్పటికే ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్తో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ మూవీ వచ్చే ఏప్రిల్ 7న ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్డేట్ వచ్చేసింది. ప్రిన్స్ మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఈ మూవీలో రుద్రను పరిచయం చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. రౌద్రం ఒక్కటే అతడి స్వభావం కాదు అనే క్యాప్షన్ పెట్టారు. కాగా.. ఈ చిత్రంలో మహేశ్ బాబు.. రుద్ర, శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

తాజాగా రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్ లో మహేశ్ బాబు చాలా సింపుల్ గా కనిపించారు. పొడవైడ జుట్టు, గడ్డంతో రిలీజ్ చేసిన మహేశ్ బాబు పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇది చూస్తుంటే రుద్ర పాత్ర ప్రపంచ యాత్రికుడిగా ఉండనుందని అర్ధమవుతోంది. కాగా.. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్గా కనిపించనుంది. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారు.





## అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట టౌన్, ఆగస్టు 09, మనం న్యూస్:** ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ శంకర కంటి హాస్పిటల్ సహకారంతో ఆదివారం కుడకుడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్లు తన్వీర్ హుస్సేన్, బానోత్ సైదులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రంగి కాళిదాసు మాట్లాడుతూ.... సమాజంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన కంటి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సూచనలు, చికిత్సలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మందడి రమాదేవి, వైద్యులు డాక్టర్ నుమాన్, డాక్టర్ అనిల్, ఫౌండేషన్ సభ్యులు బత్తుల దామోదర్ రెడ్డి, నరాల తిరుమలరెడ్డి, షేక్ నజీర్ పాషా, గడ్డం వీరబాబు, క్యాంపు ఇన్చార్జి నాయిని స్టాలిన్, రమేష్, అక్షయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన పదేళ్ల పేదింటి కల..!

### ఎమ్మెల్యే పద్మావతి చేతుల మీదుగా ఇండ్ల పట్టాలు...!

### ఎన్నికల హామీని నిలబెట్టుకున్న స్థానిక ఎమ్మెల్యే

### 9560 నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అప్పగింత



**కోదాడ, ఆగష్టు 9(మనం న్యూస్):** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఆచరణలో పెట్టి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మరో ముందడుగు వేశారు. పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న 560 పేద కుటుంబాల కలను నిజం చేస్తూ... బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. పట్టాలు చేతికందిన క్షణంలో లబ్ధిదారుల కళ్లలో ఆనందం.. కుటుంబాల్లో పండుగ వాతావరణం కనిపించింది.కోదాడ పట్టణంలోని పెరిక భవన్లో ఆదివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, వైస్ చైర్పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ సంతోష్ కిరణ్లతో కలిసి 560 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అనంతరం 35 వార్డుల కౌన్సిలర్లు లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం... అని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి స్పష్టం చేశారు. 2023 డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పేద కుటుంబాలకు సొంత ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చామని, ఆ హామీలో భాగంగానే బాలాజీనగర్లోని 560 డబుల్ బెడ్రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1,031 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే కొన్ని ఇళ్లకు గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మిగతా ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు.

**కోదాడ అభివృద్ధికి రూ.1,938.41 కోట్లు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల ఎనిమిది నెలల కాలంలో కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేశామని ఎమ్మెల్యే తెలిపారు. మొత్తం రూ.1,938.41 కోట్ల విలువైన అభివృద్ధి పనులు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయని వెల్లడించారు.లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, వంద పడకల ఆసుపత్రి, జవహర్ నవోదయ పాఠశాల, జ్యుడీషియల్ భవనాలు, పల్లె దవాఖానాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఆర్అండ్బీ బంగ్లాలు, కాలువలు, వాగుల కూడికతీత, అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు.కేవలం హామీలకే పరిమితం కాకుండా.. పనులను మంజూరు చేయించి, నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**విద్య వైద్యం సాగునీటికి అధిక ప్రాధాన్యత**

పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో రూ.50 కోట్లతో జవహర్ నవోదయ పాఠశాల నిర్మిస్తున్నామని పద్మావతి రెడ్డి తెలిపారు. జాతీయ రహదారి 365 కోదాడకు ఆనుకుని ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రూ.26 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు.రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నియోజకవర్గంలో ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు రూ.181.50 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పథకాలు పూర్తయితే రైతులకు సాగునీటి ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. కోదాడ నియోజకవర్గం నా సొంత ఇల్లు.. ఇక్కడి ప్రజలంతా మా కుటుంబ సభ్యులే అని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో రానున్న రోజుల్లో కోదాడ ముఖచిత్రాన్ని మరింతగా మార్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందే వరకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.



**పదేళ్ల కల నెరవేరింది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు: లబ్ధిదారురాలు నిమ్మసర్తి ఉమా**



డబుల్ బెడ్రూమ్ ఇంటి లబ్ధిదారురాలు నిమ్మసర్తి ఉమా మాట్లాడుతూ.. పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నాం. పేదరికం కారణంగా సొంతంగా ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్న మాకు ఇప్పుడు ఇల్లు వచ్చింది. ఫ్లాట్ నంబర్ 296 కేటాయించారు. మా ఆనందానికి అవధులు లేవు అని అన్నారు.

**ఇన్నాళ్లు సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లోనే జీవించాం: లబ్ధిదారురాలు సుల్తాని ఉమారాణి**



మరో లబ్ధిదారురాలు సుల్తాని ఉమారాణి మాట్లాడుతూ.. ఇన్నాళ్లు సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లోనే జీవించాం. ఇప్పుడు ఫ్లాట్ నంబర్ 149లో డబుల్ బెడ్రూమ్ ఇల్లు వచ్చింది. ఇల్లు ఎంతో సౌకర్యంగా ఉంది. మా సొంతింటి కలను నెరవేర్చిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని ఎన్నటికీ మర్చిపోలేం అని ఆనందం వ్యక్తం చేశారు.

# 54 కోట్ల విలువైన మెఫీ డ్రోన్ డ్రగ్స్ స్వాధీనం

- డ్రగ్స్ అక్రమ రవాణాపై పోలీసుల భారీ ఆపరేషన్
- బీబీనగర్ పోలీసులు – ఎస్ ఓ టి సంయుక్త ఆపరేషన్‌లో నలుగురు నిందితుల అరెస్ట్
- రూ.54 కోట్ల విలువైన 27 కిలోల మెఫెడ్రోన్ స్వాధీనం



**యాదాద్రి భువనగిరి,ఆగస్టు 9 (మనం ప్రతినిధి):** యాదాద్రి-భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా బీబీనగర్ పోలీసులు మరియు ఎస్ ఓ టి యాదాద్రి-భువనగిరి పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్లో 27 కిలోల నిషేధిత మెఫెడ్రోన్ డ్రగ్ను, సుమారు రూ.54 కోట్ల విలువైన మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు 08.08.2026న కొండమడుగు గ్రామ శివారులో ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా, ఎంహెచ్-49-సీఎం-1313 నంబర్ గల కారును పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. వాహనంలో 27 కిలోల మెఫెడ్రోన్తో పాటు డ్రగ్ తయారీలో ఉపయోగించే సుమారు 40 కిలోల అసిటోన్ లిక్విడ్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఎ1. చేతన్ మధుకర్ మెష్రామ్, వయస్సు 49 సంవత్సరాలు, నాగ్పూర్, మహారాష్ట్ర, పాత్ర: డ్రగ్ తయారీకి ఆర్గనైజర్ మరియు ఆర్థిక సహకారం అందించిన వ్యక్తి. ఎ2. ముజామల్ హక్, వయస్సు 25 సంవత్సరాలు, మారిగావ్, అస్సాం.

పాత్ర: డ్రగ్ తయారీలో సహకరించిన వ్యక్తి. ఎ3. ఆకాశ్ అశోక్ గవాండే, వయస్సు 31 సంవత్సరాలు, నాగ్పూర్, మహారాష్ట్ర.

పాత్ర: డ్రగ్ అక్రమ రవాణాలో సహకరించిన వ్యక్తి.ఎ4. ఉపద్రష్ట రమణ మూర్తి, వయస్సు 65 సంవత్సరాలు, చందానగర్, హైదరాబాద్.పాత్ర: వేటుకూరి ల్యాబ్స్ ఇన్చార్జిగా వ్యవహరించిన వ్యక్తి.పరారీలో ఉన్న నిందితులు:ఎ5. ఎం.డి. అయూబ్ అలీ - అస్సాంల్యాబ్ ఏర్పాటు, ముడి పదార్థాల సమీకరణ మరియు కెమిస్ట్లు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర.ఎ6. చందా ప్రదీప్ ఠాకూర్ - నాగ్పూర్ డ్రగ్ పెడ్లర్. ఎ7. గోపాల్ సిర్పట్ పటేలియా - నాగ్పూర్,డ్రగ్ పెడ్లర్. ఎ8. యేటుకూరి రామరాజు - వేటుకూరి ల్యాబ్స్ యజమాని, పీర్జాదిగూడ, మేడిపల్లిల్యాబ్ యజమాని.పరారీలో ఉన్న నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. 27 కిలోల మెఫెడ్రోన్ - సుమారు రూ.54 కోట్ల విలువ, 40 కిలోల అసిటోన్ లిక్విడ్, 06 సెల్ఫోన్లు, కారు, వేటుకూరి ల్యాబ్స్లోని రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ మరియు ఇతర డ్రగ్ తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా, 05.08.2026 నుంచి 07.08.2026 వరకు కొండమడుగు గ్రామంలోని వేటుకూరి ల్యాబ్స్లో ఇతర సహచరుల సహకారంతో మెఫెడ్రోన్ను అక్రమంగా తయారు చేసినట్లు వెల్లడించారు. తయారు చేసిన డ్రగ్ను కొండమడుగు నుంచి నాగ్పూర్కు తరలించి అక్కడ పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు విచారణలో తేలింది.

నిందితుల సమాచారం మేరకు పోలీసులు వేటుకూరి ల్యాబ్స్కు వెళ్లి తనిఖీ చేయగా, డ్రగ్ తయారీలో ఉపయోగించిన రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం కంపెనీని చట్ట ప్రకారం సీజ్ చేయడానికి చర్యలు తీసుకోబడతాయి. ఈ మొత్తం ఆపరేషన్ను ఎన్డీపీఎస్ చట్టంలోని నిబంధనలను పాటిస్తూ, పంచుల సమక్షంలో మరియు చట్టపరమైన విధానాలను అనుసరిస్తూ నిర్వహించారు. అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచగా, తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఆపరేషన్ శ్రీ బి. శ్రీనివాస్ నాయుడు, ఎస్ డి పి సి-యాదాద్రి డివిజన్, ఇన్చార్జ్ భువనగిరి డివిజన్ వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది.

ఆపరేషన్లో టి. ప్రవీణ్ బాబు, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఎస్వోటీ యాదాద్రి-భువనగిరి, ఎం. ప్రభాకర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, శ్రీ ఎస్. కృష్ణయ్య, ఎన్. రమేష్, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం యాదాద్రి-భువనగిరి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు..

## ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలి

### సూర్యాపేట ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




**సూర్యాపేట, ఆగస్టు 9 (మనం ప్రతినిధి):** రాబోయే ఎన్నికల్లో ఆర్టీసీ ఎంప్లాస్ యూనియన్ ను గెలిపించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు అన్నారు.అదివారం ఆర్టీసీ డిపో కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సమ్మె సందర్భంగా జరిగిన చర్చల గురించి మరియు రాబోయే ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కార్మికులకు వివరించారు. ఆదివారం నాడు

ఎఐటీయూసీ ఆఫీస్ సూర్యాపేట నందు టీజీఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ సూర్యాపేట డిపో జనరల్ బాడీ సమావేశం డిపో అధ్యక్షులు నేలపట్ల సైదులు అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి సూర్యాపేట డిపో ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ వారు మరియు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ముఖాముఖి కార్యక్రమం జయప్రదం చేశారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్. రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ రీజియన్ వ్యాప్తంగా కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ పోరాటాలు చేసి అనేక హక్కులు సాధించి పెట్టిందని కావున రాబోయే ఎన్నికల్లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కి సూర్యాపేట డిపో కార్మికులందరూ బస్సు గుర్తు పై ఓటు వేసి విజయం చేకూర్చాలని తెలియజేశారు.

తదనంతరం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ సూర్యాపేట డిపో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ₹సూర్యాపేట డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా దంతాల రాంబాబు ఏఐటి యుసి జిల్లా కార్యదర్శి సూర్యాపేట డిపో ఎంప్లాయిస్ యూనియన్ సలహాదారులుగా నేలపట్ల సైదులు ని ఎంప్లాయిస్ యూనియన్ సూర్యాపేట డిపో అధ్యక్షులుగా వాంకుడోతు సేవ్య, ప్రధాన కార్యదర్శిగా లక్కమల్ల రాజశేఖర్ డిపో కోశాధికారిగా విజయ్ తో పాటు 14 మందితో కమిటీ వేశారు₹. ఈ సమావేశంలో నల్లగొండ ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ అధ్యక్షులు జమాల్ గౌడ్ కార్యదర్శి ఎన్.ఆర్.సి.రాజు నల్లగొండ డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బి.ఎస్. రెడ్డి లతోపాటు సుమారు 20 మంది కార్మికులు పాల్గొని జనరల్ బాడీ సమావేశం జయప్రదం చేశారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్

**కరీంనగర్ ఆగస్టు 9(మనం బ్యూరో):** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ అమ్మవారికి బోనం ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బోనాల ఉత్సవాలు సమాజంలో ఐక్యత, సామరస్యం, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని, తెలంగాణ సంస్కృతి పరిరక్షణలో ఈ ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు , కార్పొరేటర్లు మాసం గణేష్ , చొప్పరి జయశ్రీ , సొగాని కొమరయ్య , నలువాల రవీందర్ , పొన్నం లక్ష్మీ మొండయ్య , ఇతర ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పీఠం కోసం పాట్లు...!



- ఉత్కంఠ రేపుతున్న పబ్లిక్ క్లబ్ ఎన్నికలు
- అధ్యక్ష స్థానం కోసం పలువురి ఆసక్తి
- రంగం లోకి మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి క్యాండిడేట్
- రసవత్తరంగా జరగనున్న పాలకవర్గ ఎన్నిక
- ఇప్పటికే తెరపైకి బీసీ నినాదం అభ్యర్థిని బరిలోకి నిలిపేందుకు మంతనాలు

**సూర్యాపేట ఆగస్టు 09 (మనం ప్రతినిధి):** 75 ఏండ్ల ఎంతో ఘన చరిత్ర గల సూర్యాపేట పబ్లిక్ క్లబ్ అధ్యక్ష పదవి తీవ్ర స్థాయిలో పోటీ ఉన్నట్టు తెలుస్తుంది ఇప్పటికే రాజకీయరంగు పులుముకుంటూ వస్తున్న సూర్యాపేట పబ్లిక్ క్లబ్ పాలకవర్గ పదవి కాలం ఈనెల ఆగస్టు రెండో తేదీన ముగిసిన విషయం తెలిసింది... ప్రస్తుత పబ్లిక్ లో అధ్యక్షుడు కొప్పుల వేనారెడ్డి ఇటీవల తనకు మెజార్టీ క్లబ్ సభ్యుల మద్దతు ఉందని క్లబ్ గౌరవ అధ్యక్షుడు స్థానిక ఆర్డీవోకు లిఖితపూర్వకంగా సభ్యుల సంతకాలతో కూడిన జాబితాను తయారు సిద్ధం చేసి మళ్ళీ క్లబ్ పాలకవర్గ అధ్యక్షులుగా కొనసాగించాలని.. కోరిన విషయం తెలిసింది.. దీనిపై క్లబ్ సభ్యులు కొంతమంది ప్రత్యేకంగా సమావేశమై అభ్యంతరం తెలియజేయడం.. వెంటనే ప్రజాస్వామ్య పద్ధతిలో పబ్లిక్ క్లబ్ ఎన్నికలు ఆర్డిఓ ఆధ్వర్యంలో సీక్రెట్ బ్యాలెట్ రూపంలో బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని.. కొందరు సభ్యులు గత నాలుగు రోజుల క్రితం క్లబ్ గౌరవ అధ్యక్షుడైన ఆర్డిఓ ను కలిసి వినతిపత్రం అందజేశారు... ఈ నేపథ్యంలో క్లబ్ ఎన్నికలు అనివార్యమైవడం తో అధ్యక్ష పీఠం దక్కించుకునేందుకు పలువురు సీనియర్లు పోటీకి సై అంటున్నట్టు తెలుస్తోంది.. ప్రస్తుతం క్లబ్ లో సభ్యులు సుమారు 740 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు.. ఇందులో దాదాపుగా 684 సభ్యులు తమ ఓటు హక్కు

వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తుంది.. ఈ పబ్లిక్ క్లబ్ లో ఎంతోమంది. ప్రభుత్వ ప్రైవేటు వైద్యులు లాయర్లు, సీనియర్ సిటిజెన్లు అధికారులు పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, ప్రముఖులు రాజకీయాలకతీతంగా ఎంతో మంది నాయకులు క్లబ్ మెంబర్లుగా కొనసాగుతున్నారు... అయితే ఈ క్లబ్ బైలా ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నూతనగా పబ్లిక్ క్లబ్ సెక్రటరీని పాలకవర్గాన్ని ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో పబ్లిక్ క్లబ్.. రాను రాను... అది కాస్త రాజకీయ రంగు పులుముకుంటూ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి సంబంధించిన సానుభూతిపరుడు క్లబ్ కార్యదర్శిగా ఎన్నుకోవడం అంతేకాకుండా పాలకమండలి వారి నేతృత్వంలో కొనసాగుతూ వస్తుంది... పబ్లిక్ క్లబ్ కు స్థిరచ్చర ఆస్తులు కలిగి ఉన్న ఈ క్లబ్ కాల క్రమంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూ తన మనుగడను నేటి వరకు కొనసాగిస్తూ వస్తుంది. కోట్ల విలువగల స్థలాలు ఉన్న ఈ క్లబ్ అనుసంధానంగా 52 దుకాణ సముదాయాలు అదేవిధంగా పట్టణ నడిబొడ్డులో రద్దీగా ఉండే ప్రాంతం బస్టాండ్ సమీపంలో ఫంక్షన్ హాల్ ఆడిటోరియం ఉన్నది. ఇందులో భాగంగా ఈనెల ఆగస్టులో రెండవ తేదీన పాలకవర్గం కమిటీ రద్దు కావడంతో మళ్లీ క్లబ్ సెక్రటరీగా బాధ్యతలు ఎవరు చేపడతారో అనే చర్చ కొనసాగుతోంది. ఇన్ని ఆస్తుల పరిరక్షణకు సంబంధించి బాధ్యత పాలకవర్గం చూసుకుంటుంది. ప్రతి దుకాణ సముదాయాలు ఫంక్షన్ హాల్ సముదాయంలో అద్దరూపాన వచ్చే డబ్బును క్లబ్ ట్రెజరీ ఖాతాలో వేయడం జరుగుతుంది.. ఇప్పుడు క్లబ్ కమిటీ రద్దు కావడంతో ప్రస్తుత ఈ క్లబ్ కు ఆర్డీవో గౌరవ అధ్యక్షులుగా పాలకవర్గం ఏర్పడే వరకు కొనసాగుతారు. ఇప్పటికే పాత కమిటీ అధ్యక్షుడు క్లబ్ కు సంబంధించిన అన్ని రకాల రికార్డులను గౌరవ అధ్యక్షులైన ఆర్డీవోకు సమర్పించినట్లు తెలుస్తోంది. ప్రతినెల ఆదాయాన్ని సమకూర్చుని వెబ్ అభివృద్ధికి అలాగే మెయింటెనెన్స్ సంబంధించి పక్కా లెక్కలతో నడుస్తోంది. గత 2024. 2026 జూలై మాసం వరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేనారెడ్డి సెక్రటరీగా బాధ్యతలు ఇప్పటివరకు బాధ్యతలు చేపట్టిన విషయం విధితమే...ఇప్పటికే క్లబ్ ఎన్నికలు జరిపించేందుకు కొంతమంది మెజార్టీ సభ్యులు ఆసక్తి కనపరుస్తూ వస్తున్నాడం గమనార్ధం మిగులు బడ్జెట్ చూపించిన సెక్రటరీ వేణరెడ్డి తిరిగి మళ్ళీ క్లబ్ బాధ్యతలు చేపడతాడని ఒక వర్గం డంకా బజాయించి చెబుతుంటే... ఇదే అధికార పార్టీలో మరో వర్గంకి చెందిన వారిలో ఎవరో ఒకరిని క్లబ్ సెక్రటరీగా నియమిస్తారని ప్రచారం ఊపు అందుకుంది. ఇక్కడ విశేషమేమిటంటే... ఇటీవల అధికార కాంగ్రెస్ మూడు గ్రూపులుగా చోటు చేసుకోవడంతో.. మరో వర్గం మాత్రం పారదర్శకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల నిర్వహించి మెజార్టీ అభ్యర్థుల మద్దతుతో పబ్లిక్ క్లబ్ నూతన సెక్రటరీ ఎన్నికై పాలకవర్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.. ఇందులో భాగంగానే ప్రస్తుతం గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతున్న ఆర్డీవోను కొందరు సభ్యులు కలవడం జరిగింది.. అదేవిధంగా గత 2022 నుండి 2024 ఫిబ్రవరి మాసం వరకు.. పబ్లిక్ క్లబ్ సెక్రటరీగా కొనసాగిన బీసీ వర్గానికి చెందిన పెద్దిరెడ్డి గణేష్ తన పూర్తిస్థాయి పాలకవర్గం గడువు ముగియక ముందే.. అప్పటి విభిన్న పరిస్థితులు రాజకీయ నేపథ్యంలో పాలకవర్గం రద్దు కావడం తెలిసింది.. పెద్దిరెడ్డి గణేష్ సెక్రటరీగా కొనసాగిన కాలంలో పబ్లిక్ లో ఆదాయం లో మిగులు బడ్జెట్ గా..46 లక్షల ఫిక్స్ డిపాజిట్.. దీంతోపాటు 26 లక్షల నెట్ కాష్ ను మిగులు బడ్జెట్ క్లబ్ ఖాతాలో ఉంచడం జరిగింది.. వీటికి సంబంధించిన రికార్డులను అప్పటి ఆర్డీవోకు సమర్పించిన విషయం అందరికీ తెలిసిందే... ఇక నేడో రేపు జరగబోయే పబ్లిక్ క్లబ్ ఎన్నికలు ఖాయమని సీక్రెట్ ఓటింగ్ కే అత్యధిక మంది సభ్యులు మొగ్గుచూపటంతో... ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ సానుభూతి సభ్యులు.. సైతం తమ సభ్యుని క్లబ్ సెక్రటరీ బరిలో దించేందుకు స్థానిక శాసనసభ్యులు. గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి ఆలోచిస్తున్నట్లు సమాచారం.. దీనిపై ఇప్పటికే క్లబ్ సభ్యులు కొంతమందితో మంతనాలు జరిపినట్లు సన్నిహితులు చెబుతున్నారు..

**బీసీ మంత్రం పారేనా...?**

రాష్ట్రంలో ఇటీవల కాలంలో బీసీ వాదం బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో పబ్లిక్ క్లబ్ పాలకవర్గ ఎన్నికల్లో కూడా బీసీ వాదం తెరమీదకి వస్తున్నట్లు సమాచారం.. పబ్లిక్ క్లబ్ అధిక సంఖ్యలో పబ్లిక్ క్లబ్ సభ్యత్వం కలిగి ఉన్న నేపథ్యంలో ఆ సామాజిక వర్గం నుండి క్లబ్ సెక్రటరీగా పోటీకి తామేమి తక్కువ కాదని కొంతమంది బీసీ వర్గానికి చెందిన మిత్రులు రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్టు వినికిడి.. ఈ రెండు సంవత్సరాలు బీసీ అభ్యర్థికి పబ్లిక్ క్లబ్ ట్రస్ట్ నుండి సెక్రటరీగా అవకాశం కల్పించాలని పార్టీల సానుభూతి సభ్యులు ఆయా సామాజిక వర్గాలకు అతీతంగా మద్దతు కోరేందుకు బీసీ వర్గానికి చెందిన మిత్రులు సిద్ధపడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తుండటం గమనార్ధం..

## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**సూర్యాపేట టౌన్, ఆగస్టు 09, మనం న్యూస్:** జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకీలం రాజేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్ అన్నారు. ఆదివారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో పట్టణంలోని రెడ్ హౌస్ నందు ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదేశానుసారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... గ్రామం నుంచి మండలం, పట్టణం స్థాయి పార్టీ అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలు ఏవైనా విజయం కాంగ్రెస్ పార్టీకి దక్కేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి శ్రమించే వారికి తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందన్నారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగుల వాసు, బానోత్ సైదులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతమల్ల రమేష్, జానయ్య, నరేందర్ నాయుడు, సాయి నేత, నారాయణ,దివ్య, మాధవరెడ్డి, సమీర్, అనిల్, నరేష్, శివ, మధు, శివమణి, సుధీర్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

## వైభవంగా థానాకాన్-2026 రాష్ట్ర మహాసభ



- **పాల్గొన్న వైద్యులు, ఆసుపత్రుల ప్రతినిధులు**

**వరంగల్, ఆగస్టు 9, (మనం ప్రతినిధి ):** తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ వార్షిక రాష్ట్ర మహాసభ థానాకాన్-2026 వరంగల్ అరేపల్లిలోని వజ్రా గార్డెన్స్లో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వైద్యులు, చిన్న, మధ్యతరహా మరియు పెద్ద ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య రంగానికి సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలపై నిపుణులతో శాస్త్రీయ చర్చలు, నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు , అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వైద్య రంగంలోని ముఖ్య అంశాలపై మహాసభలో భాగంగా నిర్వహించిన శాస్త్రీయ సదస్సులో లో అగ్ని ప్రమాదాల భద్రత, ఐసీయూ ప్రోటోకాల్స్, రోగుల భద్రత, వైద్య నైతిక విలువలు-వైద్య ఆచరణలో వాటి ప్రాధాన్యత, ఆరోగ్య బీమా పథకాలు, కొత్త ఆసుపత్రుల ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు వైద్యులకు అవగాహన కల్పించారు. అలాగే ఆసుపత్రి నిర్వహణ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, ళ్కీఅలు, డిజిటల్ హెల్త్కేర్, మెడికల్ ఎథిక్స్ తదితర అంశాలపై కూడా చర్చలు నిర్వహించారు. వైద్య సేవల్లో నాణ్యతను పెంచడం, రోగుల భద్రతను మెరుగుపరచడం, ఆసుపత్రుల నిర్వహణలో ఎదురవుతున్న ఆచరణాత్మక సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**డా. పి. ప్రవీణ్ థానా రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం**

ఈ సందర్భంగా థానా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా డా. పి. ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేశారు. చిన్న, మధ్యతరహా ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఆసుపత్రుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని డా. పి. ప్రవీణ్ తెలిపారు.

# చదువుతో ఎదగాలి.. ఐక్యతతో బలపడాలి



- బైండ్ల సమాజం విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మరింత ఎదగాలి
- బైండ్ల భవన్కు రూ.2 కోట్ల నిధులు ఇవ్వాలని సీఎంను కోరాం
- పే బ్యాక్ టు సొసైటీ' స్ఫూర్తితో సమాజానికి అండగా నిలవాలి
- పిల్లల చదువు మధ్యలో ఆపొద్దు.. ఉన్నత విద్యతో భవిష్యత్తు తీర్చిదిద్దాలి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**హనుమకొండ ఆగస్టు 9(మనం ప్రతినిధి ):** తెలంగాణ బైండ్ల ఉద్యోగుల సంఘం - విజన్ మీట్-2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య హాజరై మాట్లాడుతూ బైండ్ల సమాజం విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మరింత ముందుకు సాగాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు యువత విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఆఉఅఖీ (తెలంగాణ బైండ్ల ఉద్యోగుల సంఘం) విజన్ మీట్-2026 కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,₹ సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన తాను పార్లమెంట్ వరకు చేరడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులే కారణమని అన్నారు. కులవృత్తి ద్వారా ఆదాయం వస్తోందనే కారణంతో పిల్లల చదువును మధ్యలోనే నిలిపివేయవద్దని ఉన్నత విద్య, వృత్తి విద్యను అభ్యసించాలని కోరారు. ప్రతి ఒక్కరూ 'పే బ్యాక్ టు సొసైటీ' ని అలవర్చుకోవాలని అదే స్ఫూర్తితో సమాజానికి తిరిగి సేవ చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. బైండ్ల భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి గారిని తాను, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు కలిసి కోరినట్లు ఎంపీ తెలిపారు. తొలి విడతగా సుమారు రూ.2 కోట్ల వరకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని, త్వరలోనే దీనిపై ప్రభుత్వం నుంచి జీవో వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఆఉఅఖీను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బైండ్ల ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువతను సంఘంలో భాగస్వాములను చేయాలని డా. కడియం కావ్య కోరారు. సంఘంలో గ్రూపులు, విభేదాలకు తావులేకుండా అందరూ ఒక్కటిగా ముందుకు సాగాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా సంఘం కార్యకలాపాలను విస్తృతంగా ప్రచారం చేసి సభ్యత్వాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. తమ వద్ద పెద్దగా ఆస్తులు, ఆర్థిక వనరులు లేకపోయినా నిజాయితీ, తెలివితేటలు, ప్రజాబలమే తమ పెట్టుబడి అని ఎంపీ అన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి తన తండ్రి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా, తాను ఎంపీగా ప్రజాసేవలో ఉండటం గర్వకారణమన్నారు. రాజకీయ హోదాలు ఉన్నా లేకపోయినా సమాజానికి తన సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆడపిల్లల చదువుకు తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వాలని ఎంపీ సూచించారు. పిల్లలను ఉన్నతంగా చదివించి వారు జీవితంలో స్థిరపడేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తూ సమాజంలో పరస్పర అనుబంధాలను పెంచుకోవాలని డా. కడియం కావ్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఈఏటీ అధ్యక్షుడు చినపాక స్వామి, కోశాధికారి డా. జీలకర్ర స్వామి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జీలకర్ర రామ్మూర్తి, ముఖ్య సలహాదారు కడెం ధనుంజయ, సలహాదారులు డా. జీలకర్ర సోమశేఖర్, చినపాక శ్రీనివాస ప్రసాద్, ఏ. ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పరకాలలో రెండు ఎరువుల షాపుల లైసెన్సులు సస్పెండ్

**పరకాల, ఆగస్టు 9 (మనం న్యూస్):** పరకాల మండలంలోని క్రాంతి ట్రేడర్స్, భద్రకాళి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపుల ఎరువుల లైసెన్సులను పరకాల సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) జాలిగపు అవినాష్ వర్మ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్ ఉత్తర్వులను శ్రీ క్రాంతి ట్రేడర్స్ యజమాని భుజం రమేష్. భద్రకాళి ఫర్టిలైజర్స్ యజమాని పంచగిరి శ్రీనివాస్లకు స్థానిక మండల వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ జాలిగపు అవినాష్ వర్మ మాట్లాడుతూ ఎరువుల డీలర్లు ఎవరైనా రైతులకు నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయించినా, లేదా ఎరువులతో పాటు ఇతర ప్రొడక్టులను లింక్ పెట్టి బలవంతంగా అమ్మినా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మంగపేటలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

- **ఆదివాసి ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో**

**మంగపేట, ఆగస్టు 9, మనం ప్రతినిధి:** ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఆదివాసి ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మంగపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాలకు చెందిన ఆదివాసి నాయకులు ఆయా గ్రామాలలో జెండా ఎగురవేసి ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసి గ్రామ పెద్దలు, ఆదివాసి సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాలు , ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలకు చెందిన నాయకులు, ఆదివాసి ప్రజలు మండలంలోని బోరు నర్సాపురంకు చేరుకుని అక్కడ నుండి మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వరకు ఆదివాసి సాంప్రదాయ నృత్యాలతో, జై ఆదివాసీ జై జై ఆదివాసీ అంటూ నినాదాలిచ్చుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. మంగపేటలో అంబేద్కర్ విగ్రహానికి, కొమరం భీమ్ విగ్రహానికి ఆదివాసి సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసి జెండా ఎగురవేశారు. అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాలకు చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఎందరో మహనీయులు త్యాగాలు చేశారన్నారు. ఆదివాసీ వర్గాల సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గొప్ప వీరయ్య, గొప్ప సమ్మారావు, పొదెం కృష్ణ ప్రసాద్, కొండా చెంచయ్య, కబ్బాక శ్రావణ్,




నల్లబోయిన లక్ష్మణ్ దొర, అయ్యోరి యానయ్య, మద్దెల అంజయ్య, తాటి నాగరాజు, , జబ్బ రవి, పొదెం రవీందర్, ఎట్టి సారయ్య, బాడిశ నాగ రమేష్, పొదెం మేనక, డబ్బుల ముత్యాల రావు, రూప భద్రయ్యచాద మల్లయ్య, తల్లడి నాగేశ్వర రావు, సోయం ఈశ్వర్, తోలేం రామకృష్ణ,కొంచెం మొగిలి, తోలెం నరసింహారావు , కోరెం శ్రీను, పూనెం రాములు, కొమరం రవి, పూనెం ప్రశాంత్, కుర్సం రమేష్, పొదెం నాగేష్,ఆక తిరుమలరావు, కొమరం లక్ష్మీపతి, కబ్బాక లక్ష్మణ్, కొమరం సారన్న, కొమరం బాలన్న,ఇరప అరుణ, తోలేం సౌమ్య, వాగబోయిన లావణ్య,పుసాం సావిత్రి, ఇరప రజిని, కొమరం లక్ష్మీపతి, మద్దెల నాగేశ్వరరావు, కొమరం రవి, జోగ నరేందర్, ముక్తి రవి, వివిధ పార్టీలకు చెందిన మైల జయరాం రెడ్డి, చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, ఎల్పి.ముత్యాలు, పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ళ సురేష్ , ముురుకుట్ల నరేందర్, ఎంపెల్లి వీరాస్వామి పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ గుడి వద్ద అభివృద్ధి పనులు

**పర్వతగిరి, ఆగస్టు 9 (మనం న్యూస్):** పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని ముత్యాలమ్మ గుడి దేవాలయానికి గ్రామపంచాయతీ నిధులతో సర్పంచ్ గాడి పెల్లి మహేందర్ అభివృద్ధి పనులను చేపట్టారు.

ఆదివా గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులతో పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గాడి పెల్లి మహేం. మాట్లాడుతూ బోనాల పండుగ సమీపిస్తున్నందున గ్రామ పంచాయతీ నిధులు సుమారు 7 లక్షల రూపాయలు వెచ్చించి గుడి వద్ద అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పం గాడిపెల్లి శేషయ్య, మల్లయ్య, అజయ్ కుమార్, భార్గవ్, సంపత్, రాజబాబు, పవన్ కళ్యాణ్, రామచందర్, సంతోష్.. రాపోలు రవీందర్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలే శాంతికి పునాది

- **తెలంగాణ డీజీపీ శ్రీ సీవీ ఆనంద్**
- **పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్లను ప్రారంభించిన డీజీపీ**

**హనుమకొండ ఆగస్టు 8(మనం ప్రతినిధి ):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పర్యటనలో భాగంగా తెలంగాణ డీజీపీ శ్రీ సీవీ ఆనంద్, నక్సలిజంపై పోరాటంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 28 మంది పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు 'ఖీఎ-ఉఉఖ పేరుతో ప్రత్యేక గ్రీవెన్స్ పోర్టల్ను డీజీపీ ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా అమరవీరుల కుటుంబ సభ్యులు తమకు సంబంధించిన ఆర్థిక సహాయం, ఎక్స్గ్రేషియా, కారుణ్య నియామకాలు, ఇంటి స్థలాల కేటాయింపు, స్థలాల రిజిస్ట్రేషన్/టైటిల్ సమస్యలు, పెన్షన్, ఇతర సంక్షేమ పథకాలు మరియు ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదిక ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. అమరవీరుడి ఉద్యోగ వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, ఇప్పటివరకు అందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు (ఎట్స) తదితర సమాచారాన్ని కూడా ఈ పోర్టల్లో సమగ్రంగా పొందుపరచనున్నారు. యూనిట్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్నతాధికారులు ఫిర్యాదులను పర్యవేక్షించి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా ఈ పోర్టల్ను రూపొందించారు. ఈ సందర్భంగా డీజీపీ క్యూఆర్ కోడ్తో కూడిన కుటుంబ కార్డులను అమరవీరుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ క్యూఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా ఖీఎ-ఉఉఖ గ్రీవెన్స్ పోర్టల్కు వెళ్లి తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చు. ఈ పోర్టల్ను రూపొందించిన ఎస్ఐబీ అధికారులు రాష్ట్రంలోని అన్ని యూనిట్లకు వెంటనే సమాచారం అందించి, ఆయా యూనిట్ల పరిధిలోని అన్ని పోలీస్ అమరవీరుల కుటుంబాల నుంచి సమస్యలు, ఫిర్యాదులను సేకరించి, వాటిపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీ ఆదేశించారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులు తమకు చాలా కాలంగా పెండింగ్లో ఉన్న పలు సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎక్స్గ్రేషియా, ఆర్థిక సహాయం, ఇంటి స్థలాల కేటాయింపు, స్థలాల రిజిస్ట్రేషన్ మరియు టైటిల్ సమస్యలు, పెన్షన్, ఇతర సంక్షేమ అంశాలకు సంబంధించిన సమస్యలను వివరించారు. కుటుంబ సభ్యులు తెలిపిన సమస్యలను డీజీపీ సావధానంగా విని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబాలకు అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ, వారి సమస్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీమతి శ్వేత ఐపీఎస్ను డీజీపీ ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీ శ్రీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, తన వృత్తి జీవిత ప్రారంభ దశలో నక్సలిజం తీవ్రంగా ఉన్న సమయంలో వరంగల్లో విధులు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోయిన పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని తెలిపారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను, ఎదురుకాల్పులు, దాడులు, ఆకస్మిక దాడులు వంటి సవాళ్లను గుర్తుచేస్తూ, నేడు ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలకు పోలీస్ అమరవీరుల త్యాగాలే ప్రధాన పునాది అని డీజీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణకు తమ ప్రాణాల కంటే ప్రాధాన్యతనిచ్చి త్యాగాలు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు.

## 16న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలి

- **శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడి**

**దామెర ఆగస్టు 9(మనం న్యూస్ ):** దామెర మండల కేంద్రంలోని ఏ ఎన్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆగస్టు 16న పరకాల నియోజకవర్గ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేయుటకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి బహిరంగసభ విజయవంతం చేయాలి అన్నారు.ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జిలు, ఆఔఅలు, సర్పంచులు, గ్రామ పార్టీ కొత్త, పాత అధ్యక్షులు, కాంటెస్టెంట్ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ౖఅఇఖ చైర్మన్లు, మరియు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కులను పరిరక్షించాలి



**కన్నాయిగూడెం, మనం న్యూస్, ఆగస్టు 9:** కన్నాయిగూడెం మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆదివాసీ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షుడు పోడెం బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోడెం బాబు మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, చట్టాలు, ప్రభుత్వ జీవోలు పటిష్టంగా అమలు కావాలని అన్నారు. 1982లో 135 దేశాల మేధావులు ఐక్యరాజ్యసమితి వేదికగా ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయగా.. 1994 నుంచి ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని అనేక ఆదివాసీ గూడేల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కొమురం భీమ్ భవనానికి హామీ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి రాంబాబును తుడుందెబ్బ నాయకులు కలిసి కొమురం భీమ్ విగ్రహం ఆవరణ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడంతో పాటు కొమురం భీమ్ భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రాంబాబు.. సమస్యను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం మంత్రి సీతక్కతో ఫోన్లో మాట్లాడి కొమురం భీమ్ విగ్రహం ఆవరణలో ప్రహరీ గోడ, భవన నిర్మాణానికి మంజూరు చేయించినట్లు రాంబాబు నాయకులకు సమాచారం అందించారు. దీంతో తుడుందెబ్బ నాయకులు రాంబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలం నాగేష్, జిల్లా నాయకులు యాలం మొరిలి, తుడుందెబ్బ నాయకులు ఆలం కుమార్, కొరం సంపత్, బొగ్గం బాబు, దబ్బగట్ల సాయి, పెద్ద లక్ష్మీనారాయణ, ఆలం రాంబాబు, జంపయ్య, కొరం చిరంజీవి పాల్గొన్నారు.

## డీజీపీ సీవీ ఆనంద్ను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్



**హనుమకొండ: ఆగస్టు 9. (మనం ప్రతినిధి ):** ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా హనుమకొండలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో ఉన్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు.

## ఆదివాసీలకు అండగా పోరాడుదాం

**హనుమకొండ, ఆగస్టు 9 (మనం ప్రతినిధి):** అస్తిత్వం కోసం హక్కుల కోసం మనగడ కోసం పోరాడుతున్న ఆదివాసులకు అం డగా పోరాడుదాం అని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మ ఖ్య అతిథిగా వారు హాజరయ్యారు. డివిజన్ నాయకులు దార లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తరతరాలుగా ఆదివాసీలు అడవిని నమ్ముకుని జీవిస్తున్నారని వారిని అభివృద్ధి చేయాల్సిన పాలకులు మాటలతో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. తమ పూర్వీకుల నుంచి కాపాడుతూ వచ్చిన ఖనిజ సంపదను పెట్టుబడిదారులకు ధారదత్తం చేస్తున్న పాలకులపై పోరాడాలని అన్నారు. రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలని, భారత రాజ్యాంగం ఇచ్చిన ఐదవ షెడ్యూల్ అమలు




చేస్తూ, పిసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు, తాగునీరు, పం టలకు గిట్టుబాటు ధర, విద్యా ఉపాధి వైద్యం ఇలాంటి మౌలిక వసతుల కల్పనలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు కోడి సోమయ్య, డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, కోడం సారయ్య, పొన్నం కుమారస్వామి. రాములు సుధాకర్, పాషా, సారక్క చిలకమ్మా తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక పోలీసింగ్పైనే ప్రధాన దృష్టి

- నక్సలిజం నుంచి సైబర్ నేరాల వరకు పోలీసింగ్లో భారీ మార్పు
- డీజీపీ సి.వి. ఆనంద్
- మౌలిక పోలీసింగ్నే ప్రధాన దృష్టి..
- డ్రగ్స్, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్, ఆగస్టు 9: (మనం ప్రతినిధి ):** ఒకప్పుడు నక్సలిజం పోలీసింగ్లో అతిపెద్ద సవాలైతే, ఇప్పుడు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరాలు, రోడ్డు భద్రత ప్రధాన సవాళ్లుగా మారాయని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరును ఆదివారం సమీక్షించిన ఆయన, పోలీసింగ్లో సాంకేతికత ఎంత కీలకమైనా మౌలిక పోలీసింగ్ను విస్మరించరాదని అధికారులకు సూచించారు. జిల్లాలోని ఎన్ఐటీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (ఖీఎఇఖీఆ), టీ-స్పార్క్, సీఐడీ అధికారులు సైబర్ నేరాల ధోరణులు, దర్యాప్తు విధానాలు, నూతన సాంకేతిక వ్యవస్థలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. వరంగల్తో విడదీయరాని అనుబంధం తన ఐపీఎస్ ఉద్యోగ జీవితం వరంగల్లో జిల్లా శిక్షణతో ప్రారంభమైందని, అనంతరం వరంగల్ రూరల్ ఎస్పీగా పనిచేసిన రోజులు మరువలేనివని డీజీపీ గుర్తుచేసుకున్నారు. నక్సలిజం తీవ్రంగా ఉన్న రోజుల్లో ప్రతి రోజు ప్రమాదకరంగా ఉండేది . ల్యాండ్మైన్ పేలుళ్లు, దాడుల మధ్య పోలీసులు విధులు నిర్వర్తించే వారమని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో నేడు నెలకొన్న శాంతిభద్రతలు పోలీసు అమరుల త్యాగాల ఫలితమేనని పేర్కొన్నారు. సైబర్ మోసాలతో రూ.1,700 కోట్ల నష్టం గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల వల్ల ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు కోల్పోయారని డీజీపీ వెల్లడించారు. మోసపోయిన వెంటనే ఫిర్యాదు చేయకపోవడం వల్ల డబ్బు రికవరీ అవకాశాలు తగ్గుతున్నాయని చెప్పారు. అధిక లాభాల పేరుతో జరిగే పెట్టుబడి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





# వరుణ దేవా.. కరుణించవా





**సకాలంలో వానలు కురిపించి.. తెలంగాణకు సుభిక్షం కలిగిస్తూ.. ప్రజలను ప్రగతి పథంలో నడిపించాలని వాన దేవుడిని కోరుతూ కృష్ణా నది ఒడ్డున నాగార్జున సాగర్‌లో యాదాద్రి వేద పండితులు, 108 మంది రుత్వికుల నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నేడు జరుపుతున్నవరుణ యాగం..పై మనం ప్రత్యేక కథనం...**

ఎల్ నినో కారణంగా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలన్నింటిలో చాలా తక్కువ నీరు ఉండడం, వర్షాలు లేకపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం ,ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం, నేడు నాగార్జునసాగర్ సమీపంలోని కృష్ణా నది ఒడ్డున విజయ విహార్ ఆవరణలో ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి వరుణ యాగం

నిర్వహిస్తున్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వేద పండితుల ఆధ్వర్యంలో 108 మంది ఋత్వికులతో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల అర్చకులు తెల్లవారుఝామున 4 గంటలకు వరుణ యాగాన్ని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆసక్తిగా చూస్తున్న ఈ వరుణయాగానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, ప్రముఖులు విచ్చేశారు.

**సకల సౌకర్యాలు..**

అత్యధిక సంఖ్యలో వస్తున్న భక్తులు, ఆధ్యాత్మికులు,



ప్రజలు యాగ క్రతువులను తిలకించేందుకు వీలుగా విజయ విహార్ ప్రాంగణంలో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం, లైటింగ్, శానిటేషన్, తాగునీరు, వసతి, భోజన సౌకర్యాలు, బందోబస్తు ప్రతి ఒక్క అంశాన్నీ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేశారు.

- నల్లగొండ
(మనం ప్రతినిధి)





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.